www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

కేసీఆర్‌కు మళ్లీ అస్వస్థత

విషయం తెలియగానే స్వయంగా కారు నడుపుతూ వెళ్లిన కేటీఆర్

ఎర్రవల్లి ఫాంహౌస్‌కు వైద్యుల బృందం

కేసీఆర్‌ను పరామర్శించిన హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి



గజ్వేల్/మర్కుక్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శనివారం అస్వస్థతకు గురైనట్లు తెలిసింది. దీంతో హైదరాబాద్ నుంచి ప్రత్యేక వైద్యుల బృందం ఎర్రవల్లి ఫాంహౌస్‌కు చేరుకుని చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. కేసీఆర్ శరీరంలో చక్కెర, సోడియం స్థాయిల్లో వ్యత్యాసాలు వస్తున్నాయని.. వైద్య బృందం అవసరమైన పరీక్షలు చేసి, చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది. కేసీఆర్

మిగతా 13వ పేజీలో...

ఆదివారం | 24-8-2025 | పేజీలు: 16 + 32 పేజీల వినాయక ప్రత్యేకం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 130

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, బాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి ఉ.11:49 తదుపరి విదియ; నక్షత్రం: పుబ్బ రా.2:06 తదుపరి ఉత్తర; వర్జ్యం: ఉ.9:18-10:59; దుర్ముహూర్తం: సా.4:51-5:41; అమృతఘడియలు: రా.7:23-9:03; రాహుకాలం: సా.4:30-6:00; సూర్యోదయం: 6:03; సూర్యాస్తమయం: 6:31

హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 24-8-2025 | పేజీలు: 16 + 32 పేజీల వినాయక వ్రతకల్పం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 130 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షఋతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి ఉ.11.49 తదుపరి విదియ; నక్షత్రం: పుబ్బ రా.2.06 తదుపరి ఉత్తర; వర్జ్యం: ఉ.9.18-10.59; దుర్ముహూర్తం: సా.4.51-5.41; అమృతఘడియలు: రా.7.23-9.03; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.03; సూర్యాస్తమయం: 6.31 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బీసీ కోటాపై కమిటీ

ప్రముఖ న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపేందుకే..

మంత్రులు భట్టి, ఉత్తమ్, పొన్నం, శ్రీధర్‌బాబు, సీతక్కలతో ఏర్పాటు

టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో నిర్ణయం

బీసీ రిజర్వేషన్లపై ఈ నెల 26 కల్లా సర్కారుకు నివేదిక

27న ఆ నివేదిక డెడికేషన్ కమిటీ ముందుకు

29న క్యాబినెట్‌లో చర్చించి, స్థానిక ఎన్నికలపై నిర్ణయం

ఎన్నికలకు వెళ్లాల్సిందేనన్న మెజారిటీ సభ్యులు

బీసీలకు మేలు జరగాలన్న సీఎం

వినాయక నిమజ్జనంలోపు నామినేటెడ్ పదవుల భర్తీ!

టీపీసీసీ కోర్ కమిటీ నిర్ణయం



'ఓట్ చోరీ'పై ప్రచార లోగోను విడుదల చేస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మహేశ్‌గౌడ్, మీనాక్షి, ఉత్తమ్, జూపల్లి

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై న్యాయనిపుణులతో విస్తృత సంప్రదింపులు జరపాలని టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) నిర్ణయించింది. నిపుణుల సలహా మేరకు ముందుకెళ్లాలని తీర్మానించింది. న్యాయ కోవిదులతో సంప్రదింపులు జరిపేందుకు ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్కలతో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ కమిటీని ఏర్పాటు చేశారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉన్న మార్గాలపై దేశంలోని ప్రముఖ న్యాయ, రాజ్యాంగ నిపుణులతో ఈ కమిటీ సంప్రదింపులు జరపనుంది. స్థానిక ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు ఉన్న 27 శాతం రిజర్వేషన్‌కు తోడు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తే.. మొత్తం రిజర్వేషన్లు 69 శాతానికి చేరతాయి. ఈ రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలకు వెళ్లడానికి ఉన్న అవకాశాలపై న్యాయకోవిదులు, రాజ్యాంగ నిపుణుల నుంచి కమిటీ అభిప్రాయాలు తీసుకోనుంది. కులగణన సర్వేపై ఏర్పాటైన నిపుణుల కమిటీ ఛైర్మన్ జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అభిప్రాయాన్ని కూడా తీసుకోనుంది. వీటన్నింటితో కూడిన నివేదికను ఈ నెల 26 కల్లా ప్రభుత్వానికి సమర్పించనుంది. ఆ నివేదికను ప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్‌కు ఇవ్వనుంది. కమిషన్ దానిపై అధ్యయనం చేసి.. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వానికి సూచన చేయనుంది. ఈ నెల 29న రాష్ట్ర క్యాబినెట్ సమావేశమై కమిషన్ సూచన ఆధారంగా బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోనుంది. గాంధీభవన్‌లో శనివారం టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన పీఏసీ, టీపీసీసీ సలహా కమిటీల ఉమ్మడి

మిగతా 13వ పేజీలో...

మూసీ అభివృద్ధికి రూ.375 కోట్లు

ఎంఆర్‌డీసీఎల్‌కు రెండో త్రైమాసికం నిధులు

విడుదల చేస్తూ పురపాలక శాఖ జీవో 13



ఇక జిల్లాల్లోనే కీమోథెరపీ

చికిత్స కోసం హైదరాబాద్ రానక్కర్లేదు

బోధనాస్పత్రుల్లో డే కేర్ క్యాన్సర్ సెంటర్లు

ఒక్కో కేంద్రంలో 20 పడకలు

తొలుత ఎంఎన్‌జేలో.. తర్వాత జిల్లాల్లో..

క్యాన్సర్‌పై పోరుకు సర్కారు నిర్ణయం

హైదరాబాద్/సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన క్యాన్సర్ రోగులు కీమోథెరపీ కోసం ఇకపై హైదరాబాద్ రానక్కర్లేదు. జిల్లా కేంద్రాల్లోనే కీమోథెరపీ చేసేలా సర్కారు ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా కేంద్రాల్లోని బోధనాస్పత్రుల్లో డే కేర్ క్యాన్సర్ సెంటర్లు(డీసీసీసీ) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ కేంద్రాల ద్వారా క్యాన్సర్ రోగులకు కీమోథెరపీ కష్టాలు తీరనున్నాయి. క్యాన్సర్ నివారణ, చికిత్స విషయంలో ప్రముఖ క్యాన్సర్ నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు ఇటీవల వైద్య శాఖకు పలు సూచనలు చేశారు. వాటిపై శనివారం వైద్యఆరోగ్యశాఖ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించింది. ఇందులో పాల్గొన్న విభాగాధిపతులు.. తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా 34 బోధనాస్పత్రుల్లో డీసీసీసీలను ప్రారంభించాలని నిర్ణయించారు. హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే, నిమ్స్ మాదిరిగా డీసీసీసీలు పనిచేసేలా

మిగతా 3వ పేజీలో...



మేం పార్టీ మారలేదు!

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే కొనసాగుతున్నాం

అసెంబ్లీ రికార్డుల్లోనూ అలాగే ఉంది

నోటీసులకు వివరణ ఇవ్వనున్న ఎమ్మెల్యేలు!

స్పీకర్ ఢిల్లీ నుంచి వచ్చాక మిగిలిన వారికి నోటీస్

పార్టీ మారలేదని కృష్ణమోహన్‌రెడ్డి పునరుద్ఘాటన

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అనుసరించి స్పీకర్ ప్రసాద్‌కుమార్ జారీ చేసిన నోటీసులకు ఎమ్మెల్యేలు ఏమని సమాధానం ఇస్తారు? ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో ప్రధానంగా ఈ అంశంపైనే చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ ఆ పార్టీ ఇచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి ఉపక్రమించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్.. ఐదుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఆలిండియా స్పీకర్స్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు ఢిల్లీకి వెళ్లిన స్పీకర్.. మంగళవారం తిరిగి హైదరాబాద్‌కు రానున్నారు. ఆయన వచ్చాక మిగిలిన ఐదుగురు ఎమ్మెల్యేలకూ నోటీసులు జారీ చేయనున్నట్లు అసెంబ్లీ వర్గాల సమాచారం. దీంతో నోటీసులు అందుకున్న, అందుకోనున్న ఎమ్మెల్యేలు ఈ గండం నుంచి ఎలా గట్టెక్కుతారన్న

మిగతా 13వ పేజీలో...

బెట్టింగ్ కేసులో కర్ణాటక ఎమ్మెల్యే అరెస్ట్

12 కోట్ల నగదు, 6 కోట్ల విలువైన బంగారం స్వాధీనం

సిక్కింలో ఎమ్మెల్యే వీరేంద్రని అదుపులోకి తీసుకున్న ఈడీ

క్యాసినో లీజు వ్యవహారంపై అక్కడికి వెళ్లిన ఎమ్మెల్యే 14


ఈడీ స్వాధీనం చేసుకున్న నగదు; ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ

నువ్వుగానీ చంపావేమిత్రా?

టెన్షన్ పడుతుండటంతో సహస్ర హత్యపై నిందితుడైన బాలుడిని ప్రశ్నించిన తల్లి 3

పోలీసుల విచారణలో బయటపడ్డ వివరాలు

బ్యాట్ దొంగతనం కోసం ఇంట్లోకి.. సహస్ర అడ్డుకోవడంతో హత్య.. జువైనల్ హోంకు బాలుడు

వాడిని ఉరితీయండి.. బాలిక తల్లిదండ్రుల ధర్నా

హాస్టల్లో విషప్రయోగం

విద్యార్థులు తాగే నీటిలో గడ్డి మందు కలిపిన ఉపాధ్యాయుడు 11

తనతో పడని ఓ అధికారిని ఇరికించే కుట్ర

విధుల నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు, వంట కార్మికురాలి తొలగింపు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా గాంధీనగర్ అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఘటన

'నిత్య పెళ్లికొడుకు'పై పోక్సో కేసు

13 ఏళ్ల బాలికను పెళ్లాడిన సూర్యాపేట జిల్లా నడిగూడెం పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్

అతడికి గతంలో ముగ్గురితో వివాహం, విడాకులు

ఆ సంగతి దాచి రెండేళ్ల క్రితం బాలికతో మనువు

పోలీసులకు ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు 3




ఆ తీర్పు చదివి ఉంటే.. అమిత్‌షా అలా మాట్లాడేవారు కాదు!

నాతోపాటు మరో జడ్జి ఉన్నారు, ఇంకో ఇద్దరు రివ్యూ కొట్టేశారు

సుప్రీంకోర్టుకు చెందిన ఈ జడ్జిలందరూ నక్సలైట్లేనా? 14

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వ్యాఖ్యలు



బిలియనీర్ బాబు 3

నంబర్ వన్ సంపన్న సీఎం

కుటుంబ ఆస్తులు 931 కోట్లు

రేవంత్‌కు 30 కోట్లు: ఏడీఆర్



ఆదివారం అనుబంధం బదులుగా **'శ్రీ వినాయక పూజా విధానం'** నేటి దినపత్రికతో ఉచితంగా అందుకోండి.

- మేనేజింగ్ డైరెక్టర్

వేల ఎకరాల్లో పంట నష్టం

భారీ వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న పంటలు

వరి, పత్తి రైతులకు గుండెకోత

పెట్టుబడి, రెక్కల కష్టమంతా వరద పాలు.. మెడకు అప్పులు

పంట నష్టంపై 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయి పరిశీలన


మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం లంబాడీ తండాలో తీవ్రంగా దెబ్బతిన్న పత్తి పంట

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

కల్లోల వాతావరణం శాంతించింది. రైతుల గుండెల్లో మాత్రం అశాంతే మిగిలింది. విరామం లేకుండా కొన్నిరోజుల పాటు ఉధృతంగా కురిసిన వర్షం ఇప్పుడు లేదు. కానీ ఆ వాన మిగిల్చిన విపత్తు అన్నదాతలకు కన్నీళ్లను మిగిల్చింది. భారీ వర్షం.. ఫలితంగా తీవ్ర వరద పోటుకు కొన్నిచోట్ల పత్తి, కంది, పెసర, మినుము, మొక్కజొన్న, మిర్చి, వేరుశనగ తదితర పంటలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. ప్రధానంగా అప్పుడే నాట్లు వేసిన దశలో ఉన్న వరి వరదకు కొట్టుకుపోయింది. నదులు, చెరువులు, కాల్వల బ్యాక్‌వాటర్ కారణంగా ఇంకొన్నిచోట్ల చేలల్లో

మిగతా 10వ పేజీలో...

ఆరు ఎకరాల్లో పత్తి మునిగింది..

6 ఎకరాల్లో పత్తి పంట నీట మునిగి నష్టం వచ్చింది. ప్రభుత్వం పరిహారం ఇచ్చి మమ్మల్ని ఆదుకోవాలి.

- మాధవ్, రైతు, అమీన్‌పూర్, మహబూబ్‌నగర్ జిల్లా

కమిటీల్లేవు.. చర్చల్లేవు!

జలవివాదాలపై కమిటీ ప్రతిపాదనను పక్కన పెట్టిన తెలుగు రాష్ట్రాలు

తెలంగాణ పేర్కొన్న 13 అంశాలు మాత్రమే ఎజెండాలో ఉన్నాయంటూ ఏపీ విముఖత

పొరుగు రాష్ట్రం సుముఖంగా లేనందున సభ్యుల పేర్లను ఇవ్వబోమంటున్న తెలంగాణ

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గోదావరిపై అపరిష్కృతంగా ఉన్న సాగు నీటి ప్రాజెక్టులతోపాటు జలవివాదాలపై తెలుగు రాష్ట్రాల మధ్య చర్చలు జరిగే అవకాశాలు కనిపించడం లేదు. జలవివాదాలపై కమిటీ అంశాన్ని ఇరు రాష్ట్రాలు పక్కన పెట్టాయి. జలవివాదాలపై చర్చించడానికి వీలుగా కమిటీలో సభ్యుల పేర్లను ప్రతిపాదించాలని కేంద్ర జల శక్తి శాఖ ఇటీవలే తెలుగు రాష్ట్రాలకు లేఖ రాసిన విషయం విదితమే. అయితే, ఎజెండాలో గోదావరి-బనకచర్ల అనుసంధానం లేకపోవడం, గత నెల 16న కేంద్ర జలశక్తి శాఖ నేతృత్వంలో జరిగిన సీఎంల

మిగతా 2వ పేజీలో...


సురవరం భౌతికకాయం వద్ద డి.రాజా, కూనంనేని తదితరులు

అధికార లాంఛనాలతో.. నేడు

సురవరానికి వీడ్కోలు

అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం

నేటి మధ్యాహ్నం 3 గంటలకు అంతిమయాత్ర

ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు సీఎం స్టాలిన్ సహా ప్రముఖుల సంతాపం 3

లోకం తీరు

ఓపెన్ ఏఐ కార్యకలాపాలను హైదరాబాద్‌లో ప్రారంభించాలి: కేటీఆర్



విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

20 నెలలుగా ఉపాధ్యాయుల ఎదురుచూపు

రాష్ట్ర ప్రభుత్వం విశ్వసనీయత నిలుపుకోవాలి

పాత పెన్షన్ విధానం, ఏకీకృత రూల్స్ తేవాలి

యూఎస్‌పీసీ మహాధర్నాలో వక్తల డిమాండ్

హైదరాబాద్/కవాడిగూడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించి, రాష్ట్ర ప్రభుత్వం విశ్వసనీయత నిలుపుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ప్రజా ప్రభుత్వంలో సమస్యలన్నీ పరిష్కారమవుతాయని ఉపాధ్యాయులు ఆశించారని, వినతిపత్రాలు ఇస్తూ 20 నెలలుగా ఓపికతో ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. మ్యానిఫెస్టో హామీలూ అమలు చేయడం లేదన్నారు. గత ప్రభుత్వం విద్యా రంగ సమస్యలపై ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు తెలిపినా సహించలేక సంఘ నాయకులపై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేసిందని ఆరోపించారు. శనివారం


మహాధర్నాలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. విద్యా శాఖలో ఎన్నేళ్ల జోక్యాన్ని నివారించాలని, కొత్త జిల్లాలకు డీఈవో, ప్రతి రెవెన్యూ డివిజన్‌కు డిప్యూటీ ఈవో, కొత్త మండలాలకు ఎంఈవో పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్ రూపొందించి, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని, పీఆర్‌సీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఐక్య పోరాటాలు చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. ధర్నాలో యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు చావ రవి, సీహెచ్ అనిల్ కుమార్, ఎం సోమయ్య ఏ వెంకట్, ఎస్ తిరుపతి, టీ లింగారెడ్డి, కొమ్ము రమేష్, ఎస్ హరికిషన్, జాడి రాజన్న, బీ కొండయ్య, వై విజయకుమార్, జాదవ్ వెంకట్రావు, మేడి చరణ్‌దాస్, దూడ రాజనర్సు బాబు మాట్లాడారు. భాగస్వామ్య సంఘాల నాయకులు, జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సహా ఐదువేల మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, టీజీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీలు ప్రొ. నాగేశ్వర్, అలుగుబెల్లి నర్సిరెడ్డి, ప్రొ.లక్ష్మీనారాయణ, అరుణోదయ విమలక్క, పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షులు ఎల్ అరుణమ్మ తదితరులు ధర్నాకు సంఘీభావం తెలిపారు.

గత ప్రభుత్వ జీవో 28ను రద్దు చేయాలి

సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం జారీ చేసిన జీవో 28ను రద్దు చేయాలని తెలంగాణ కంట్రిబ్యూటరీ పెన్షన్స్ స్కీం(సీపీఎస్) ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. వందల సంఖ్యలో సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో మధ్యాహ్న భోజన విరామ సమయంలో పాఠశాలలు, కార్యాలయాల్లో శనివారం నిరసన చేపట్టారు. సీపీఎస్ నోడల్ ఆఫీస్ కార్యాలయం ముందు జీవో 28 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ.... తెలంగాణ ఏర్పడ్డ 2 నెలల్లోనే రాష్ట్రంలో 2 లక్షలపైగా ఉన్న సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులను జీవో 28తో మళ్లీ నూతన పెన్షన్ విధానంలోకి నెట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలోను సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన సంగతి గుర్తు చేశారు. మేనిఫెస్టోకనుగుణంగా సీపీఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి స్థితప్రజ్ఞ విజ్ఞప్తి చేశారు.

6 బ్యాంకు ఖాతాల్లో 2 నెలల్లో రూ.155.90 కోట్ల లావాదేవీలు

- 611 మంది బాధితుల ఖాతాలు ఖాళీ
- సైబర్ నేరగాళ్లకు కేటుగాడి ద్వారా ఖాతాలు
- నేపాల్ సరిహద్దుల్లో పట్టుకున్న ఎస్‌సీబీ

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లకు ఇతరుల బ్యాంకు ఖాతాలను అందిస్తూ.. రూ.కోట్లలో అక్రమ లావాదేవీలు చేస్తున్న కేటుగాడు వడ్డేపల్లి లలిత్ శరణ్ కుమార్‌ను సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) అధికారులు నేపాల్ సరిహద్దుల్లో అరెస్టు చేశారు. విజయవాడ వాసి శరణ్ కుమార్ దుబాయ్ కేంద్రంగా సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలను సమకూరుస్తున్నట్లు తమ విచారణలో వెల్లడైందని సీఎస్‌బీ డైరెక్టర్ షికా గోయల్ ఓ ప్రకటనలో తెలిపారు. గతేడాది శరణ్ కుమార్ హైదరాబాద్ షంషీర్‌గంజ్‌లోని ఎస్‌బీఐ బ్యాంకులో కరెంట్ ఖాతాలు నిర్వహిస్తున్న ఆరుగురు వ్యక్తులను సంప్రదించి.. సైబర్ నేరగాళ్లకు సహకరించడానికి ఒప్పించాడని, గతేడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో 6 ఖాతాల్లో రూ.155.90కోట్ల మేర లావాదేవీలు జరిగాయని ఆమె వివరించారు. సైబర్ నేరాల్లో బాధితులైన 611 మంది ఖాతాల నుంచి కొల్లగొట్టిన డబ్బును శరణ్ కుమార్ మళ్లించి, ఆ తర్వాత సైబర్ కేటుగాళ్లకు పంపాడని చెప్పారు. అప్పట్లో ఈ కేసుకు సంబంధించి ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్‌తో పాటు ఆరుగురిని అరెస్టు చేసినట్లు గుర్తు చేశారు. నాటి నుంచి దుబాయ్‌కి పరారైన శ్రవణ్‌పై లుకౌట్ నోటీసు జారీ చేశామని షికా గోయల్ తెలిపారు. దుబాయ్ నుంచి నేపాల్ మీదుగా దేశంలోకి రావడానికి ప్రయత్నిస్తున్న శరణ్‌ను సునాలీ చెక్‌పోస్టు వద్ద అరెస్టు చేశామని చెప్పారు. త్వరలో కోర్టు అనుమతితో శరణ్‌ను విచారిస్తామన్నారు.

టీచర్ కాదు సైకో!

- విద్యార్థులపై కారం కొట్టి చిత్ర హింసలు పెట్టిన ఉపాధ్యాయుడు
- నిజామాబాద్ జిల్లా ఖుద్వాన్‌పూర్‌లో ఘటన

నందిపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అల్లరి చేస్తున్న విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టేందుకు ఉపాధ్యాయులు వారిని మందలించి.. దండించడం సహజమే. కానీ ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మాత్రం విచక్షణ కోల్పోయి చిన్న పిల్లలని కూడా చూడకుండా విద్యార్థుల పట్ల సైకోలా ప్రవర్తించాడు. నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం ఖుద్వాన్‌పూర్ గ్రామంలోని మండల ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో 4 రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. శంకర్ అనే ఆ పాఠశాల ఉపాధ్యాయుడు 2, 3 తరగతులకు చెందిన 10 మంది విద్యార్థులపై మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది వద్ద నుంచి తెచ్చిన కారం చల్లి, ఆపై కొట్టి ప్రతాపం చూపెట్టాడు. అప్పట్నించి విధులకు డుమ్మా కొట్టిన శంకర్.. శనివారం పాఠశాలకొచ్చాడని తెలుసుకున్న బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు రావడంతో తనపై దాడి చేస్తారేమోనని పరారయ్యాడు. అతనిపై దాడికి కూడా గ్రామస్థులు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఎంఈవో పాఠశాలకు వచ్చి విచారణ చేపట్టారు.

గోదావరి-కావేరీ లింకుతో.. కృష్ణా బేసిన్‌లో రెండు రిజర్వాయర్లు..!

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరీ అనుసంధానం(జీసీ లింక్)లో వాటాగా వచ్చే నీటిని సమ్మక్కసాగర్ బ్యారేజీ(తుపాకుల గూడెం) పరిసరాల్లో కాక కృష్ణా బేసిన్‌లో 2 రిజర్వాయర్లు కట్టుకొని, వినియోగించుకోవాలని తెలంగాణ నిర్ణయించింది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలకు కృష్ణా జలాల పంపిణీపై విచారణ జరుగుతుండగా.. ఏడాదిలోపు తీర్పు వెలువడే అవకాశాలున్నాయి. ఆ తర్వాత కృష్ణా ట్రైబ్యునల్ నీటిని కేటాయించని ప్రాంతాల్లో జీసీ లింకు వాటా వినియోగానికి రిజర్వాయర్లను నిర్మించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. ఛత్తీస్‌గఢ్ వినియోగించుకోని వాటా నుంచి 147 టీఎంసీలను జీసీ లింకుకు తొలిదశలో తరలించాలని జాతీయ నీటి అభివృద్ధి సంస్థ(ఎన్‌డబ్ల్యూడీఏ) నిర్ణయించింది. ఇందులో తెలంగాణకు 45, ఏపీకి 43, తమిళనాడుకు 40.8, కర్ణాటకకు 15.9, పుదుచ్చేరికి 2.3 చొప్పున టీఎంసీలను కేటాయించాలని ప్రతిపాదించిన విషయం తెలిసిందే.! తెలంగాణ వాటాను ఏ బేసిన్‌లోనైనా వాడుకునే స్వేచ్ఛనివ్వాలనే సర్కారు విజ్ఞప్తికి ఎన్‌డబ్ల్యూడీఏ ఇదివరకే సమ్మతించింది.

అలుగు దుంకుతున్న చెరువులు

- నిండు కుండల్లా 12,701 జలాశయాలు

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రాష్ట్రంలో చెరువులు నిండు కుండల్లా మారాయి. రాష్ట్ర వ్యాప్తంగా 34,740 చెరువులకు 12,701 చెరువులు అలుగులు పారుతున్నాయి. 10,240 చెరువు లు 75 శాతానికి పైగా నిండగా.. 5,681 చెరువులు 50-75 శాతం.. 3,302 చెరువులు 25-50% నిండాయి. ఆదిలాబాద్‌లో 977 చెరువులకు 556 చెరువులు అలుగు దుంకుతున్నాయి. 399 చెరువులు 75 శాతానికి పైగా నిండా యి. ములుగులో 2,142 చెరువులకు 1,529 చెరువులు పూర్తిగా నిండాయి. 473 చెరువుల్లో 75 శాతానికి పైగా నీరుంది. నల్లగొండలో 1,628 చెరువులకు 613 చెరువుల్లో 25% లోపు నీరు ఉంది. 25-50% లోపు నిల్వ కల చెరువులు 234, 50-75% లోపు 281 చెరువులు, 75-100% లోపు 317 చెరువుల్లో నీటి నిల్వలున్నాయి. 183 చెరువులు అలుగు పారుతున్నాయి. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సూర్యాపేట పరిధిలో 1,225 చెరువులకు 8 మాత్రమే 25% లోపు నిల్వలు కలిగి ఉన్నాయి. 16 చెరువుల్లో 25-50 శాతం మధ్య, 110 చెరువుల్లో 50-75 శాతం లోపు, 449 చెరువుల్లో 75-100 శాతం లోపు నీరు ఉంది. 642 చెరువులు అలుగులు పారుతున్నాయి.

కమిటీల్లేవు.. చర్చల్లేవు!

(మొదటిపేజీ తరువాయి)

సమావేశంలో పొందుపర్చిన 13అంశాలు మాత్రమే ఉండడంతో.. కమిటీ ఏర్పాటుపై ఏపీ విముఖత చూపుతోంది. పొరుగు రాష్ట్రం సుముఖంగా లేనందున.. తాము కూడా కమిటీకి సభ్యులను ప్రతిపాదించకూడదని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. వాస్తవానికి గత నెలలో సీఎంల సమావేశం విషయం ప్రస్తావనకు వచ్చినప్పుడే.. గోదావరి-బనకచర్ల అంశం ఎజెండాలో ఉంటే తాము హాజరు కాబోమని తెలంగాణ స్పష్టం చేసింది. సమావేశంలో 13 అంశాలపై చర్చించాలంటూ మంత్రి ఉత్తమ్ కేంద్రానికి లేఖ రాశారు. డిండి ఎత్తిపోతల పథకంతోపాటు సమ్మక్కసాగర్(తుపాకుల గూడెం) ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి మైనర్ ఇరిగేషన్‌లో కేటాయించిన 45 టీఎంసీలను వినియోగించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి ఏపీ ఇతర బేసిన్‌లకు అక్రమంగా నీటి తరలింపును కట్టడి చేయాలని, శ్రీశైలంతోపాటు సాగర్ నుంచి తరలించే ప్రతి నీటి చుక్కను లెక్కించడానికి టెలిమెట్రీలు పెట్టాలని, రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని అడ్డుకోవాలని, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ సామర్థ్యం పెంపును అడ్డుకోవాలని, శ్రీశైలం ప్రాజెక్టు రక్షణకు చర్యలు తీసుకోవాలని, తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి కేంద్రం సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. సీఎంల సమావేశంలోనూ తెలంగాణ లేవనెత్తిన ఈ 13 అంశాలే చర్చకు వచ్చాయి. అయితే, ఈ అంశాలపై కమిటీ ఏర్పాటు చేసి, చర్చించాల్సిన అవసరం లేదని ఏపీ భావిస్తుండగా, తామూ సభ్యులను ప్రతిపాదించకూడదని తెలంగాణ నిర్ణయించినట్లు తెలిసింది. దీంతో కమిటీ, చర్చల ప్రతిపాదన అటకెక్కినట్లయింది.

ఇక జిల్లాల్లోనే కీమోథెరపీ!

(మొదటి పేజీ తరువాయి)

ప్రణాళిక సిద్ధం చేశారు. వీటిలో క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తారు. లక్షణాలు కనిపిస్తే.. వారిని ఎంఎన్‌జేకు పంపుతారు. ఒకవేళ నిర్ధారణ అయితే చికిత్స ప్రారంభిస్తారు. తొలి కీమోథెరపీ ఎంఎన్‌జేలో ఇస్తా రు. అనంతరం ఆ రోగులను వారి జిల్లా కేంద్రాల్లోని డీసీసీసీలకు పంపుతారు. రోగికి అవసరమైన కీమోథెరపీలను అక్కడే ఇస్తారు. దీంతో రోగులకు వ్యయప్రయాసలు తగ్గుతాయని వైద్యవర్గాలు పేర్కొన్నాయి. జిల్లాల్లో ప్రతి డీసీసీసీని 20 పడకలతో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపాయి. ఇందులో 10 పడకలను కీమోథెరపీ కోసం, మరో 10 పాలియేటివ్ కేర్ కోసం వినియోగించనున్నారు. కీమోథెరపీ బాధ్యతలను జనరల్ సర్జన్ వైద్యులకు అప్పగిస్తారు. పాలియేటివ్ కేర్ అంటే కొందరు రోగులు కీమోథెరపీ చేయించుకొని అదేరోజు ఇంటికి వెళ్లిపోయే పరిస్థితి ఉండదు. వారిని ఇన్‌పేషెంట్‌గా ఉంచి, అవసరమైన చికిత్సలను అందిస్తామని ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. క్యాన్సర్ పాలియేటివ్ కేర్ బాధ్యతలను అనస్థీషియా వైద్యులకు అప్పగించామని తెలిపారు. అలాగే, రోగి వయసు, వచ్చిన క్యాన్సర్, దశను బట్టి చికిత్స అందించనున్నారు. రాష్ట్రంలో క్యాన్సర్ కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఏటా కొత్తగా 55 వేల కేసులు నమోదవుతున్నాయి. ఫలితంగా ఎంఎన్‌జే, నిమ్స్ అంకాలజీ విభాగాలతో పాటు బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి లాంటివి రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే డీసీసీసీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో 27 డీసీసీసీల ఏర్పాటుకు కేంద్రం రూ.40.23 కోట్లు విడుదల చేసింది. మిగిలిన 7 కేంద్రాలను రాష్ట్రనిధులతో ఏర్పాటు చేయనున్నారు.

ఎంఎన్‌జేలో పిల్లలకు ప్రత్యేక యూనిట్!

ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో పిల్లల కోసం ప్రత్యేక యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పీడియాట్రిక్ అంకాలజీ పేరుతో పిల్లలకు వైద్య సేవలను అందించాలని భావిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వ వైద్య విభాగం సలహాదారుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు ఇటీవల ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిని సందర్శించి, అక్కడి పరిస్థితులను పర్యవేక్షించారు. ఆస్పత్రి డైరెక్టర్ ఎం.శ్రీనివాసులుతో భేటీ అయ్యారు. ఈ క్రమంలో పిల్లల విభాగాల అభివృద్ధిపై పలు సూచనలు చేశారు. పిల్లలకు పడకలను పెంచాలని ప్రతిపాదనలు చేశారు. పిల్లల క్యాన్సర్ చికిత్స కోసం సీఎస్ఆర్ నిధుల సేకరణలో తన వంతు సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఎంఎన్‌జే ఆస్పత్రిలో పిల్లలకు చికిత్స అందించడానికి 120 పడకలున్నాయి. ఇవి ఎప్పుడూ రోగులతో రద్దీగా ఉంటున్నాయి. దీంతో పిల్లలకు మాత్రమే ప్రత్యేక యూనిట్‌ను పెట్టే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే ఆస్పత్రిలోనే పిల్లల ఇన్‌స్టిట్యూట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు వైద్యాధికారులు సుముఖంగా ఉన్నారు. ఆస్పత్రి ఖాళీ స్థలంలో ప్రత్యేక బ్లాక్ నిర్మాణం చేయవచ్చని అంటున్నారు. అక్కడ 500 పడకలను ఏర్పాటు చేయొచ్చని అంటున్నారు. కాగా, పిల్లలకు బ్లడ్ క్యాన్సర్‌ను నయం చేయడానికి ప్రత్యేకంగా కీమోథెరపీ ఇస్తున్నట్లు ఎంఎన్‌జే డైరెక్టర్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. బోన్ క్యాన్సర్‌తో వచ్చే రోగులకు కాలు తొలగించకుండా ప్రత్యేకంగా చికిత్స అందించి నయంచేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఆదేశిస్తే పిల్లల కోసం ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేస్తామన్నారు. తమ ఆస్పత్రిలో పిల్లలకు నెలకు 20-30 శస్త్రచికిత్సలు జరుగుతుంటాయని తెలిపారు.

పోలీసుల్లో మహిళల సంఖ్య చాలా తక్కువ

- నియామకాల్లో 33 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి
- మహిళా పోలీసు సదస్సులో కీలక తీర్మానాలు

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో పని చేసే మహిళలు జాతీయ స్థాయిలో 12.32 శాతం ఉంటే, తెలంగాణలో 8.6 శాతం మాత్రమే ఉన్నారని ఇటీవల జరిగిన మహిళా పోలీసుల సదస్సు పేర్కొంది. పోలీసు నియామకాల్లో కనీసం 33 శాతం పోస్టులను మహిళలతో భర్తీ చేయాలని ప్రభుత్వానికి సూచించింది. తెలంగాణలో తొలిసారి కానిస్టేబుల్ నుంచి సీనియర్ ఐపీఎస్ వరకు పని చేస్తున్న 400 మంది మహిళలు తెలంగాణ పోలీసు అకాడమీలో ఈ నెల 21, 22 తేదీల్లో జరిగిన సదస్సులో పాల్గొన్నారు. ఇందులో ఐదు అంశాలపై సమీక్ష నిర్వహించి, ఆ తీర్మానాలను ప్రభుత్వానికి పంపడానికి ఉన్నతాధికారులు సన్నద్ధమయ్యారు. "పోలీసు శాఖలోని పని భారం మహిళలపై ప్రభావం చూపుతోంది. అందువల్ల షిఫ్టు పద్ధతి అమలు చేయాలి. చాలా పోలీసు స్టేషన్లలో మహిళలకు తగిన రెస్ట్ రూంలు, దుస్తులు మార్చుకునే వసతి, విశ్రాంతి గదులు లేవు. పదోన్నతులు, పోస్టింగ్‌ల విషయంలో మహిళలు లింగ వివక్షకు గురవుతున్నారు." అని సదస్సులో తీర్మానించారు. లింగ వివక్ష, పని ప్రదేశంలో వేధింపులు, సదుపాయాల కల్పన తదితర అంశాలపై సదస్సులో సుదీర్ఘ చర్చ జరిగిందని అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ ఒక ప్రకటనలో తెలిపారు.

హెచ్ఎంఎస్‌లోకి కవితకు ఆహ్వానం


- త్వరలో సింగరేణి గౌరవాధ్యక్షురాలిగా నియామకం
- ఏకగ్రీవంగా ఎన్నుకుంటాం: రియాజ్ అహ్మద్

హైదరాబాద్, గోదావరిఖని, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ కార్మిక సంఘమైన హిందూ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) సింగరేణి గౌరవాధ్యక్షురాలుగా ఎమ్మెల్సీ కవిత ఎన్నికకు రంగం సిద్ధమైంది. తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం(టీబీకేఎస్) అధ్యక్షురాలిగా పదేళ్లకు పైగా ఉన్న కవితను ఇటీవల అనూహ్యంగా ఆ పదవి నుంచి తొలగించి కొప్పుల ఈశ్వర్‌ను నియమించారు. ఈ నేపథ్యంలో సింగరేణి జాగృతి, హెచ్ఎంఎస్ కలిసి సింగరేణిలో పని చేయాలని నిర్ణయించుకున్నాయి. ఈ క్రమంలో కవితను గౌరవాధ్యక్షురాలుగా ఎన్నుకోవాలని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నట్లు హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ తెలిపారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షురాలిగా సింగరేణి కార్మికుల కోసం కవిత చేసిన సేవలను పరిగణనలోకి తీసుకుని ఆమెను ఈ పదవికి ఎన్నుకోబోతున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో ఈ నెల 30, 31 తేదీల్లో నిర్వహించే జనరల్ బాడీ సమావేశంలో ఏకగ్రీవ ఎన్నిక జరుగనుందని వివరించారు.

బిలియనీర్ చంద్రబాబు

అత్యంత సంపన్న సీఎంల జాబితాలో అగ్రస్థానం

- కుటుంబ ఆస్తులు 931 కోట్లు.. 10 కోట్ల అప్పులు
- రూ.30 కోట్ల ఆస్తులతో ఏడో స్థానంలో రేవంత్ రెడ్డి
- రూ.15 లక్షలతో చివరి స్థానంలో మమత.. ఏడీఆర్ నివేదిక

న్యూఢిల్లీ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): దేశంలోని అత్యంత సంపన్న ముఖ్యమంత్రుల జాబితాలో ఏపీ సీఎం చంద్రబాబు అగ్రస్థానంలో నిలిచారు. ఆయనకు రూ.931 కోట్లకు పైగా ఆస్తులు ఉన్నాయి. రూ.332 కోట్లకుపైగా ఆస్తులతో అరుణాచల్‌ప్రదేశ్ సీఎం పెమా ఖండు రెండో స్థానంలో, రూ.51 కోట్ల ఆస్తులతో కర్ణాటక సీఎం సిద్దరామయ్య మూడో స్థానంలో ఉన్నారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ రూ.15 లక్షలకుపైగా ఆస్తితో ఈ జాబితాలో చివరిస్థానంలో నిలిచారు. దేశంలోని 30 మంది ముఖ్యమంత్రులు ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్), నేషనల్ ఎలక్షన్ వాచ్ రూపొందించిన నివేదిక ఈ విషయాలను వెల్లడించింది. 30 మంది సీఎంల సగటు ఆస్తులు రూ.54.42 కోట్లు. వీరి ఆస్తుల మొత్తం రూ.1,632 కోట్లు. వీరిలో ఇద్దరు మాత్రమే బిలియనీర్లు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి రూ.30 కోట్ల ఆస్తి, రూ.కోటి అప్పు ఉండటం గమనార్హం. సంపన్న సీఎంల జాబితాలో ఆయన 7వ స్థానంలో ఉన్నారు. జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లాకు రూ.55 లక్షలు, కేరళ సీఎం పినరయి విజయన్‌కు రూ.కోటి ఆస్తి ఉన్నట్టు నివేదిక తెలిపింది. ఇక అప్పుల విషయానికి వస్తే పెమా ఖండుకు రూ.180 కోట్లు, సిద్దరామయ్యకు రూ.23 కోట్లు, చంద్రబాబుకు రూ.10 కోట్ల అప్పులు ఉన్నాయి.

హెరిటేజ్ వాటాలే బాబు సంపదగా పరిగణన...

చంద్రబాబుకు హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్‌లో ఎలాంటి షేర్లూ లేనప్పటికీ, 1992లో కేవలం రూ.7,000 పెయిడ్ క్యాపిటల్, రూ.కోటి ఆథరైజ్డ్ క్యాపిటల్‌తో స్థాపించిన ఈ సంస్థలో ఆయన భార్య నారా భువనేశ్వరికి 24.37 శాతం వాటా ఉంది. ఈ వాటాను ఏపీ సీఎం సంపదగా పరిగణించారు. నారా కుటుంబానికి (ప్రమోటర్లు) హెరిటేజ్ ఫుడ్స్‌లో మొత్తం 41.3 శాతం వాటా ఉంది. ఈ కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ 1995లో రూ.25 కోట్ల నుంచి తాజాగా రూ.4,381 కోట్లకు (శుక్రవారం బీఎస్ఈలో షేర్ల ముగింపు ధర ప్రకారం) పెరిగింది.

ఎర్త్ సైన్సెస్ వర్సిటీలో 67 శాతం సీట్లు ఖాళీ!

- మొత్తం120లో 40 సీట్లు మాత్రమే భర్తీ
- 28న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్న వర్సిటీ

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే మొదటిసారిగా రాష్ట్రంలోని కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన డాక్టర్ మన్మోహన్ సింగ్ భూవిజ్ఞాన శాస్త్ర (ఎర్త్ సైన్సెస్) విశ్వవిద్యాలయం విద్యార్థుల కోసం ఎదురుచూస్తోంది. ఉపాధికి విస్తృత అవకాశాలున్న కోర్సులు అందిస్తున్నప్పటికీ విద్యార్థులకు అవగాహన లేక, కోర్సుల విశిష్టతల గురించి ప్రచారం చేయకపోవడంతో తొలి విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు మూడో వంతు సీట్లే భర్తీ అయ్యాయి. ఇటీవలే ప్రారంభించిన ఈ వర్సిటీలో బీఎస్సీ జియాలజీలో 60, బీఎస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో 60 సీట్లున్నాయి. విద్యార్థినీ విద్యార్థులకు వేర్వేరుగా ఉచిత హాస్టల్ వసతి ఉంది. అయితే దోస్త్ చివరి విడత ప్రవేశాల సమయంలో వర్సిటీ ప్రారంభంకావడంతో ప్రత్యేక కోర్సుల గురించి విద్యార్థులకు తెలియలేదు. గత వారం ప్రవేశాలు ముగిసేనాటికి బీఎస్సీ జియాలజీలో 11 సీట్లు, బీఎస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో 29 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. మొత్తం 120 సీట్లలో 40 సీట్లే భర్తీ కాగా 80 సీట్లు (67 శాతం) మిగిలిపోయాయి. ఈ సీట్ల భర్తీకి దరఖాస్తు గడువును ఈ నెల 26 వరకు పొడిగించారు. అప్పటికీ భర్తీ కాకపోతే ఈనెల 28న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించాలని వర్సిటీ నిర్ణయించింది. మూడేళ్ల బీఎస్సీ జియాలజీలో ప్రవేశాలకు ఇంటర్‌లో ఎంపీసీ, ఎంబీపీసీ, తత్సమానమైన బ్రిడ్జి కోర్సు చేసినవారు, బీఎస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ కోసం ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంబీపీసీ, తత్సమాన బ్రిడ్జి కోర్సులు చేసిన వారు అర్హులని ప్రిన్సిపాల్ .జగన్మోహన్ రాజు తెలిపారు.

నువ్వుగానీ చంపావేమిట్రా?

టెన్షన్ పడుతుండటంతో సహస్ర హత్యపై నిందితుడైన బాలుడిని ప్రశ్నించిన తల్లి



పోలీసుస్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సహస్ర తల్లిదండ్రులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పన్నెండేళ్ల బాలిక సహస్ర నిండు ప్రాణాలను బలిగొన్న పదో తరగతి చదువుతున్న ఆ బాలుడు (14) హత్య తర్వాతా నిర్భీతిగా వ్యవహరించాడు. హత్య అనంతరం రక్తపుమరకలు అంటిన టీషర్టుతోనే ఇంట్లోకి వెళ్లి.. ఆ మరకలు ఇంట్లో ఎవరి కంటా పడకుండా ఉండేందుకు దండెం మీద ఆరేసిన ఓ చొక్కా తీసుకొని దాన్ని టీషర్టుకు అడ్డంగా పెట్టుకొని బాత్‌రూంలోకి వెళ్లిపోయాడు. ఆ టీషర్టును విప్పి.. వాషింగ్‌మెషిన్‌లో వేశాడు. కత్తిని శుభ్రంగా కడిగేసి.. ఫ్రిజ్‌మీద పెట్టాడు. తర్వాత స్నానం చేసి ఏమీ తెలియనట్లుగా ఇంట్లోవారితో కలిసి టీవీ చూశాడు. ఇంట్లో బాలుడి తీరును అనుమానించిన తల్లి.. 'నువ్వు గానీ చంపావేమిట్రా ఆ అమ్మాయిని' అని ప్రశ్నిస్తే.. 'నీమీదొట్టమ్మా? అని బొంకాడు. ఆపై 'నువ్వే పట్టించేలా ఉన్నావే' అంటూ బెదురుగా మాట్లాడాడు. ఆ బాలుడు ఎప్పుడూ ఊహాలోకంలో విహరిస్తుంటాడని.. తానో సీఐడీ అధికారి అయిపోయినట్లు.. పెద్ద క్రికెటర్‌ను అయిపోయినట్లుగా భావిస్తుంటాడని అతడితో మాటల సందర్భంగా గుర్తించారు. గల్లీలో క్రికెట్ ఆడుతుండగా సహస్ర తమ్ముడి వద్ద ఉన్న ఖరీదైన బ్యాట్‌పై కన్నేసి.. దాన్ని చోరీ చేసేందుకు ఇంట్లోకి చొరబడ్డాడని.. సహస్ర అడ్డుకోవడంతో ఆమెను కత్తితో పొడిచాడని పోలీసులు తేల్చారు. బాలుడిని మేడ్చల్‌లోని జువైనల్ హోంకు తరలించారు. ఈ మేరకు కూకట్‌పల్లి దయార్‌గూడలో బాలిక హత్య కేసుకు సంబంధించి సీపీ అవినాశ్ మహంతి వివరాలు వెల్లడించారు.

కళ్లు మూసుకొని 27 కత్తిపోట్లు

దయార్‌గూడలో బాలిక సహస్ర తల్లిదండ్రులు అపార్ట్‌మెంట్‌లోని పెంట్‌హౌస్‌లో.. బాలుడి తల్లిదండ్రులు ఆ పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌లోని నాలుగో అంతస్తులో ఉంటున్నారు. గల్లీలో క్రికెట్ ఆడినప్పుడల్లా ఆ బాలుడు సహస్ర తమ్ముడి బ్యాట్‌తో ఆడేవాడు. తనకు ఆ బ్యాట్ ఇచ్చేయాలని అతడు అడిగినా సహస్ర తమ్ముడు ఇవ్వలేదు. గుట్టుగా ఇంట్లోకి చొరబడి ఆ బ్యాట్ సొంతం చేసుకోవాలని బాలుడు ప్రణాళిక వేసుకున్నాడు. ఈనెల 18న ఉదయం 10 తర్వాత కత్తి తీసుకొని తన అపార్ట్‌మెంట్ గోడ దూకి ఆవలివైపు అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించాడు. ఇంట్లో సహస్ర ఒక్కత్తే ఉండటం, ఆమె టీవీలో మునిగిపోయి ఉండటంతో లోపలికి దూరి.. వంటగదిలో ఉన్న బ్యాట్‌ను తీసుకున్నాడు. అతడు వెళ్లిపోతుండగా గమనించిన సహస్ర.. వెళ్లి బాలుడిని టీషర్టు పట్టుకొని వెనక్కి లాగింది. మా నాన్నకు చెప్తానంటూ బెదిరించింది. సహస్రతో పెనుగులాడిన బాలుడు, తన వెంట తెచ్చుకున్న కత్తితో తొలుత ఆమె మెడపై పొడిచాడు. ఆపై.. కళ్లు మూసుకొని కత్తితో విచక్షణారహితంగా కడుపులో పొడిచాడు. ఆమె శరీరంపై 27 కత్తిపోట్లను వైద్యులు గుర్తించారు.

'నీ ఆట ముగిసింది..' అని అనగానే..

పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి విచారణలో భాగంగా చుట్టుపక్కలవారిని ప్రశ్నిస్తుండగా అక్కడికి వెళ్లిన బాలుడు.. 'హత్య జరిగిన రోజు ఉదయం 10:30 గంటలకు సహస్ర డాడీ డాడీ అని అరవడం నేను విన్నాను' అని పోలీసులకు చెప్పాడు. తర్వాత పోలీసులు ఎన్నిసార్లు ఘటనాస్థలికి వెళ్లినా ప్రతిసారి 3వ అంతస్తువరకొచ్చి అక్కడ ఏం జరుగుతుందో తెలుసుకొని వెళ్లేవాడు. ఈ విషయాన్ని మూడో ఫ్లోర్‌లో ఉంటున్న ఓ వ్యక్తి గమనించాడు. గతంలోనూ ఆ బాలుడు గోడ దూకి సహస్ర ఇంటికి వెళ్లడాన్ని ఆ వ్యక్తి చూసి ఉండటంతో పోలీసులకు ఉప్పందించాడు. తర్వాత ఏసీపీ రవికిరణ్ రెడ్డి వెళ్లి బాలుడిని దగ్గరకు పిలుచుకున్నారు. మాటలు కలిపి.. 'ఏంట్రా సహస్ర వాళ్ల తమ్ముడితో నువ్వు ఆడుకునేదట.. నిజమేనా? నీ ఆట ముగిసిందిరా. ఇప్పటికైనా నిజం చెప్పు' అని గద్దించారు. 'సార్ సీఐడీ క్రైమ్ సీరియల్‌లో నిజం తెలిసిన తర్వాత కొట్టరు కదా.. నేను నిజం చెప్తాను సార్' అంటూ నేరం అంగీకరించాడు. బ్లూరేస్ సూపర్ లైట్ టెక్నాలజీ ద్వారా హత్య చేసిన రోజు ధరించిన టీషర్టుపై ఉన్న రక్తపు నమూనాలను సేకరించారు. అవి సహస్ర బ్లడ్ శాంపిల్స్‌తో సరిపోయాయి.

వాడిని ఉరితీయండి

'మాకు జరిగిన అన్యాయం మరెవ్వరికీ జరగకూడదు' అని సహస్ర తల్లిదండ్రులు కృష్ణ, రేణుక మీడియాతో వాపోయారు. తమ కుమార్తెను హత్య చేసిన బాలుడిని ఉరితీయాలి, కాల్చి పడేయాలి, పెట్రోల్ పోసి తగులబెట్టాలి అంటూ శనివారం కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎదుట బంధుమిత్రులతో కలిసి ధర్నా చేశారు. బ్యాట్ కోసమే హత్య చేశాడని పోలీసులు చెబుతున్నా.. తమకు నమ్మశక్యంగా లేదని, హత్య వెనుక బాలుడి తల్లిదండ్రుల ప్రమేయం ఉందని అనుమానిస్తున్నట్లు చెప్పారు. కాగా, సహస్ర హత్య చాలా బాధాకరమని, ప్రభుత్వపరంగా ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని ఎస్సీ, ఎస్టీ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు.

స్నానం చేయడంతోనే అనుమానించిన తల్లి

ప్రతిరోజు ఎన్నోసార్లు మందలిస్తే తప్ప స్నానం చేయని కొడుకు.. బాలిక హత్య జరిగిన రోజు ఉదయం 10:30కే స్నానం చేయడంతో ఆశ్చర్యపోయానని.. అప్పుడే అనుమానం మొదలైందని తల్లి పోలీసులకు చెప్పింది. హత్య జరిగిన రోజు తన కొడుకు టెన్షన్‌గా ఉండటాన్ని గమనించి, రెండు రోజులపాటు కదలికలపై కన్నేసింది. ఘటనాస్థలికి పోలీసులు వచ్చినప్పుడల్లా.. అక్కడ జరిగేది తెలుసుకొని రావడం.. తన ఇంట్లో వాళ్లనూ ఆ వివరాలు అడుగుతుండటంతో మరింత అనుమానించింది. 'ఏందిరా ఆ వివరాలన్నీ అడుగుతున్నావ్.. ఆ పిల్లను నువ్వేమైనా చంపావా?' అంటూ ప్రశ్నించింది. దాంతో ఆ బాలుడు 'అమ్మతోడమ్మ.. నేనేమీ చేయలేదు. ఎందుకు అనుమానిస్తున్నావ్.. నువ్వే నన్ను పోలీసులకు పట్టించేలా ఉన్నావ్' అంటూ బెదిరిపోయినట్లు మాట్లాడాడని ఆ తల్లి పోలీసులకు చెప్పింది. ఇంట్లో ఎవ్వరూ డబ్బివ్వకుండానే ఇటీవల ఆ బాలుడు సెల్‌ఫోన్ కొన్నాడు. ఫోన్ ఎలా కొన్నావురా? అని తాను ప్రశ్నిస్తే 'నీకెందుకు?' అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడని తల్లి వెల్లడించింది. ఆ రోజే నిలదీసి ఉంటే ఈ రోజు ఈ దుస్థితి వచ్చేది కాదని బాలుడి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారని డీసీపీ వెల్లడించారు.

అధికార లాంఛనాలతో.. సురవరానికి నేడు వీడ్కోలు

అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం.. నేటి మధ్యాహ్నం 3 గంటలకు అంతిమయాత్ర



సురవరం భార్య విజయలక్ష్మిని పరామర్శిస్తున్న డీ.రాజా

న్యూఢిల్లీ, హైదరాబాద్, అమరావతి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో జరగనున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ఈ మేరకు అధికారులను శనివారం ఆదేశించారు. ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి కార్యాలయం ఓ ప్రకటన చేసింది. సురవరం అంతిమయాత్రను ఆదివారం నిర్వహిస్తున్నామని సీపీఐ ప్రకటించింది. సురవరం భౌతికకాయాన్ని ఆదివారం ఉదయం 9 గంటలకు గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రి నుంచి హిమాయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయం(మగ్దూం భవన్)కి తరలిస్తారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు భౌతికకాయాన్ని ప్రజల సందర్శనకు ఉంచుతారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి గాంధీ వైద్య కళాశాల వరకు అంతిమయాత్ర నిర్వహిస్తారు. సురవరం భౌతికకాయాన్ని వైద్య, విద్య పరిశోధనల నిమిత్తం వైద్యకళాశాలకు అప్పగించనున్నారు. కాగా, పార్టీ శ్రేణులు ఎర్ర వస్త్రాలు ధరించి సురవరం అంతిమయాత్రలో పాల్గొనాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని కోరారు.

అత్యున్నత నేతల్లో ఒకరు సురవరం

దేశంలోని అణగారిన వర్గాల ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకుడు సురవరం అని సీపీఐ కొనియాడింది. భారత కమ్యూనిస్టు అత్యున్నత నాయకుల్లో ఒకరిగా సురవరం ఎప్పటికీ గుర్తుండిపోతారని పేర్కొంది. ఈ మేరకు ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సురవరం చిత్రపటానికి సీపీఐ నేతలు నివాళులర్పించారు. సురవరం మరణానికి సంతాపంగా పార్టీ జెండా అవనతం చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) ప్రధాన కార్యదర్శిగా, అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) అధ్యక్షుడిగా సురవరం చేసిన ప్రజాపోరాటాలను నాయకులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. నల్లగొండలో ఫ్లోరైడ్ కాలుష్యం, రైతుల సమస్యలు, నల్లధనం, 2జీ కుంభకోణం వంటి అంశాలపై పార్లమెంటులో చేసిన ప్రసంగాలతో సురవరం అన్ని పార్టీల గౌరవం పొందారని స్మరించుకున్నారు. ఇక, హైదరాబాద్ కేర్ ఆస్పత్రిలో ఉన్న సురవరం భౌతికకాయాన్ని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పలువురు నేతలు శనివారం సందర్శించారు. పార్టీ కార్యాలయంలో సురవరం చిత్రపటానికి నివాళి అర్పించారు.

ప్రముఖుల సంతాపం

సురవరం మరణం పట్ల ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, తమిళనాడు సీఎం స్టాలిన్, కేరళ సీఎం పినరయి విజయన్ సహా పలువురు ప్రముఖులు సంతాపం తెలియజేశారు. నిత్యం ప్రజల కోసమే పని చేసే సురవరం ఇక లేరంటే నమ్మలేకపోతున్నానని చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సురవరం కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు. న్యాయంకోసం, ఆత్మగౌరవం కోసం సురవరం సాగించిన ఉద్యమజీవితం స్ఫూర్తిదాయకమని తమిళనాడు సీఎం స్టాలిన్ పేర్కొన్నారు. సురవరం కమ్యూనిస్టు నాయకుడే కాక గొప్ప పార్లమెంటేరియన్ అని కేరళ సీఎం పినరయి కొనియాడారు. ఏపీ మంత్రి నారా లోకేశ్ కూడా సురవరం మృతికి సంతాపం తెలియజేశారు. విద్యార్థి దశ నుంచే ప్రజాపోరాటాలు చేస్తూ.. అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితం ధారబోసిన వ్యక్తి సురవం అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. పీడిత ప్రజల కోసం అనేక ప్రజాపోరాటాలు చేసిన ఉద్యమనేత సురవరం అని ఎమ్మెల్సీ గోరటి వెంకన్న పేర్కొన్నారు. సురవరం మరణం పార్టీకి తీరని లోటు అని సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. సురవరం మృతి పట్ల సీపీఐ(ఎం) సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే పాటూరి రామయ్య, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కౌన్సిల్ అధ్యక్షులు అనిల్ సంతాపం వ్యక్తం చేశారు.

కోట్ల విజయభాస్కర్‌రెడ్డిపై సురవరం పోటీ

సురవరం సీపీఐ తరఫున 1980 నుంచి ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగారు. 1994లో కర్నూల్ జిల్లాలోని డోన్ నియోజకవర్గంలో అప్పటి సీఎం కోట్ల విజయభాస్కర్‌రెడ్డిపై పోటీ చేసి ఓడిపోయారు. అంతకు ముందు 1980, 1985 ఎన్నికల్లో మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత 1998లో 12వ లోక్‌సభకు, 2004లో 14వ లోక్‌సభకు నల్లగొండ నుంచి ఎన్నికయ్యారు. కాగా, ఉమ్మడి ఏపీలో జరిగిన విద్యుత్ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారు.

'నిత్యపెళ్లికొడుకు'పై పోక్సో కేసు

13 ఏళ్ల బాలికను పెళ్లాడిన కానిస్టేబుల్

- గతంలో ముగ్గురితో వివాహం, విడాకులు
- రెండేళ్ల క్రితం బాలికతో మనువు
- 10 రోజుల క్రితం పోలీసులను ఆశ్రయించిన ఆమె తల్లిదండ్రులు
- బాలల సంక్షేమ అధికారుల చొరవతో కేసు

సూర్యాపేట రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): 13 ఏళ్ల బాలికను పెళ్లాడిన సూర్యాపేట జిల్లా నడిగూడెం పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్, నిత్య పెళ్లికొడుకుగా పేరొందిన బానోతు కృష్ణంరాజు(40)పై పోక్సో కేసు నమోదైంది. బాలల సంక్షేమ అధికారుల ఫిర్యాదుకు స్పందించిన పోలీసులు కేసు నమోదు చేశారు. సూర్యాపేట రూరల్ ఎస్సై బాలునాయక్ వివరాల మేరకు.. సూర్యాపేట మండలం సపావత్ తండాకు చెందిన ఓ బాలికను చివ్వెంల మండలం తుల్జారావుపేటకు చెందిన బానోతు కృష్ణంరాజు 2023 డిసెంబరులో పెళ్లి చేసుకున్నాడు. వివాహ సమయంలో బాలిక వయస్సు 13 ఏళ్లు. దీని కంటే ముందు కృష్ణంరాజుకు మూడు పెళ్లిళ్లు జరిగాయి. ఆ ముగ్గురితోనూ విడాకులయ్యాయి. దీంతో కృష్ణంరాజు నిత్య పెళ్లికొడుకుగా పేరొందాడు. కృష్ణంరాజు చరిత్రను బాలిక తల్లిదండ్రులు ఆలస్యంగా తెలుసుకున్నారు. గతంలో జరిగిన మూడు పెళ్లిళ్ల సంగతి చెప్పకుండా కృష్ణంరాజు తమ కుమార్తెను పెళ్లి చేసుకుని మోసగించాడని బాధిత బాలిక తల్లిదండ్రులు 10 రోజుల క్రితం పోలీసులను ఆశ్రయించారు. దీనిపై 'ఈ కానిస్టేబుల్ నిత్య పెళ్లికొడుకు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఓ కథనం కూడా ప్రచురితమైంది. దాంతో స్పందించిన అధికారులు 2012 బ్యాచ్‌కు చెందిన కృష్ణంరాజును విధుల నుంచి సస్పెండ్ చేశారు. అయితే, బాలల సంక్షేమ అధికారులు జోక్యం చేసుకుని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కృష్ణంరాజుపై చైల్డ్ మ్యారేజ్ ప్రొవిజన్ చట్టం కింద అత్యాచారం, పోక్సో కేసు నమోదు చేశారు. కృష్ణంరాజు పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రజాగ్రహ గళం – ఉద్యమాల దళం

'ఆదర్శం ఆచరణల – సముచిత సమన్వయం/ కమ్యూనిజమే నిజమని – చెదరని విశ్వాసం'గా జీవితాంతం అరుణ పతాకం నీడ కింద జీవితాన్నీ, వ్యక్తిత్వాన్నీ తీర్చిదిద్దుకున్న ఆదర్శ కమ్యూనిస్టు సురవరం సుధాకరరెడ్డి.

1942 మార్చి 25న అప్పటి మహబూబ్‌నగర్ జిల్లా కొండ్రావుపల్లెలో సురవరం వెంకట్రామరెడ్డి–ఈశ్వరమ్మ దంపతులకు పుట్టిన సుధాకరరెడ్డి పెదనాన్న సురవరం ప్రతాపరెడ్డి. పెదనాన్న నుంచి సంక్రమించిన సాహిత్యాభినివేశం, తండ్రి నుంచి లభించిన స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో బాల్యం నుంచి ఉద్యమ లక్షణాలు పుణికి పుచ్చుకున్న సుధాకరరెడ్డి పువ్వుపుట్టగానే పరిమళిస్తుందన్నట్లు పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడే స్కూల్‌లో బ్లాక్‌బోర్డులు, చాక్‌పీసులు, పాఠ్యపుస్తకాలు కావాలంటూ 15 ఏళ్ళ ప్రాయంలోనే ఆందోళనకు నాయకత్వం వహించాడు. అది క్రమంగా జిల్లా వ్యాప్త ఆందోళనగా విస్తరించి, సమస్య పరిష్కారానికి దారితీసింది. విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు భావజాలం ఆయనను ఆకర్షించింది.

1950లో అఖిల భారత విద్యార్థి సమాఖ్య కర్నూలు పట్టణ కార్యదర్శిగా, తర్వాత జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించాడు. 1964లో కర్నూలు కళాశాల విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. 1967లో ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాయకళాశాల విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర బాధ్యతలు చేపట్టాడు. 1970లో అఖిల భారత విద్యార్థి సమాఖ్యకు, 1972లో అఖిల భారత యువజన సమాఖ్యకు జాతీయ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించాడు. 2000లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి చరిత్రాత్మకమైన విద్యుత్ ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించాడు. 1988లో, 2004లో నల్లగొండ నియోజకవర్గం నుంచి పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికయ్యాడు. నల్లగొండలో ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి కృషి చేశాడు. కేరళ యువనేత సి.కె.చంద్రప్పన్‌తో కలిసి 18 ఏళ్ళకే ఓటుహక్కు కోసం లోక్‌సభలో గళమెత్తి, తమ డిమాండ్‌ను సాధించాడు.

ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పార్లమెంట్‌లో పీడిత ప్రజల పక్షాన, శ్రామిక జనం, రైతాంగం, మహిళల సమస్యలపై బలమైన గళగర్జనలు వినిపించాడు. ప్రజల న్యాయమైన హక్కుల సాధన కోసం అవిశ్రాంతంగా కృషి చేశాడు. ప్రభావవంతమైన వక్తగా మూడుతరాల విద్యార్థులను, యువజనులను, శ్రామికులను ప్రభావితం చేసిన సుధాకరరెడ్డి మూడు పర్యాయాలు (2012 నుంచి 2019 వరకు) సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాడు. చంద్ర రాజేశ్వరరావు తరువాత భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన రెండవ తెలుగు నేత సురవరం కావడం విశేషం.

సుధాకరరెడ్డి నేతృత్వంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ, జాతీయస్థాయిలోనూ అన్ని ప్రజాసంఘాలలో క్రియాశీలంగా పనిచేశాయి. వారి ప్రత్యక్ష పర్యవేక్షణలోనే 2003లో హైదరాబాద్ నగరంలో అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం జాతీయ మహాసభలు ఘనంగా జరిగాయి.

తెలంగాణ తొలిదశ ఉద్యమం (1969) సందర్భంగా



సమైక్యాంధ్ర నినాదం చేపట్టిన భారత కమ్యూనిస్టు పార్టీ, తెలంగాణ రాష్ట్ర సాధన తుదిదశ ఉద్యమ కాలంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు సంపూర్ణమైన మద్దతును ప్రకటించడం వెనుక సుధాకరరెడ్డి ప్రమేయం నిత్య స్మరణీయం.

జీవితంలోనూ, ఉద్యమ ప్రస్థానంలోనూ ఎన్నో ఒడిదుడుకులనూ, జయాపజయాలనూ ఎదుర్కొంటూనే తాను నమ్ముకున్న కమ్యూనిస్టు సిద్ధాంతాల కోసం అంకితమై పురోగమించిన సురవరం సుధాకరరెడ్డి జీవితం, వ్యక్తిత్వం, సిద్ధాంతం నేటితరానికీ, రానున్న తరాలకూ స్ఫూర్తిదాయకం, ఆదర్శప్రాయం.

◦ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ
పూర్వ ఉపకులపతి, తెలుగు విశ్వవిద్యాలయం

సుధాకర దుర్గం

పాలమూరు నడిగడ్డన
ఇసుక ఎడారిలో పరిమళించిన మందారం
గుక్కెడు నీళ్ళులేని నేల
ప్రజా గొంతై ప్రతిధ్వనించిన మాటల మహానది
ప్రతాపరెడ్డి సాహిత్యపు గోలకొండ
సుధాకర్ రెడ్డి కమ్యూనిస్టు దుర్గం

బాల్యంలో
ఆకాశపు నక్షత్రాలమధ్య
ఎంతమందిలున్నా చందమామలా ఆయననే చూసేది
వెతికి వెతికి చూపిచ్చేది మా ఊరి పెద్దలు
వేదికలపై మా కలల రెక్కల్ని విప్పారు
మతోన్మాద ఫాసిస్ట్ విధానాలపై చలి మంటల విసుర్లు
సత్య ప్రపంచానికి సమిధయి ఎదురీదిన
మా చేగువేరా! మా ఫిడెల్ కాస్ట్రో!

అందుకోలేనంత ఎత్తులో మీ ప్రభ
వడగళ్ల సవ్వడిలా
అగ్నిజ్వాలలా ఉవ్వెత్తున ప్రసంగాలు
మహాకావ్యాలు చదివినంత సంతృప్తి
యువత గుండెల్లో విప్లవ నవతను ఆవిష్కరించారు
ప్రగతిశీల భావాల వేకువై
మీరు నడిచిన తొవ్వ ఆచరణీయం

రాచరికాల అరాచకాలు భూస్వామ్య క్రౌర్యాలెన్ని
ముసిరినా తలదించని ఎవరెస్టు

నవభారత నిర్మాణానికి సత్యాగ్రహమై విప్లవించావు
కమ్యూనిజమే అజేయమని అగ్నికణమై రగిలావు
ఎర్రజెండానే అంతిమ పతాకమని
సగర్వమై సాగావు



మహా నేత
విప్లవ యోధుడా! అరుణతార!!
మీ నిష్క్రమణ తీరని దుఃఖమైనా
మీ తాత్వికత ప్రాపంచిక దృక్పథం
రక్తప్రసారమై ప్రజ్వలిస్తున్నది

కార్మిక కర్షక తాడిత పీడిత హక్కులకు
ప్రజా చైతన్యపు బావుటై ఆదరించి
ఆచరించిన మార్గదర్శి
దారి చూపే మైలురాయే కాదు
తెగించి పోరాడే వారసత్వాన్ని నింపిన స్ఫూర్తి
సూర్యుడంత వెలుగు చంద్రుడంత వెన్నెల



– వనపట్ల సుబ్బయ్య

ఓయూ పునర్వైభవం కోసం కలిసి నడుద్దాం..!

దేశంలో తక్షశిల, నలంద విశ్వవిద్యాలయాలు మొదలు ఎన్నో విశ్వవిద్యాలయాలు సమాజాభివృద్ధిలో కీలక భూమిక పోషించాయి. 108 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయ ఔన్నత్యం గురించి ప్రత్యేకంగా చెప్పుకోనవసరం లేదు. ఆయా రంగాల్లో అత్యంత క్రియాశీలక మేధావులను, నాయకత్వాన్ని అందించి ప్రపంచ చరిత్రలోనే ఉస్మానియా విశ్వవిద్యాలయం తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత ఎన్నో విశ్వవిద్యాలయాలు ఏర్పాటయ్యాయి. ఫలితంగా సామాన్యులు సైతం విద్య, పరిశోధనల్లో భాగస్వాములయ్యే అవకాశాలు దక్కాయి.

ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ, ఐటీ విప్లవంతో కూడిన ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను కాపాడుకునే బాధ్యత మనందరిది. తెలుగు రాష్ట్రాల్లో అత్యంత పేరు ప్రఖ్యాతి కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయం... ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు నాయకత్వం వహించాల్సి ఉంటుంది. విశ్వవిద్యాలయం నాయకత్వం వహించటమంటే... ఈ నేల, ఈ గాలి, ఈ జ్ఞాన నిధికి వారసులైన ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావటం. ఓయూ నుంచే ఎదిగిన ఓ ప్రపంచస్థాయి తత్వవేత్త పద ప్రయోగం చేసినట్లు... ఓయూ క్యాచ్‌మెంట్ ఏరియా పరిధిలోకి వచ్చే, అంటే ఓయూతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిపైనా ప్రభుత్వ రంగ విద్యను కాపాడుకునే బాధ్యత ఉంది. పేదలు, దిగువ మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చే చురుకైన, మేధోసంపత్తి కలిగిన విద్యార్థులకు ఆదెరువుగా ఉన్న ఉస్మానియా లాంటి విశ్వవిద్యాలయాల పురోగతి అనివార్యం. ఆధునిక ప్రపంచ గమనంలో ఏర్పాటైన ప్రైవేటు విశ్వవిద్యాలయాల పోటీని ఎదుర్కొని నిలవాలంటే... సమకాలీన స్థితిగతులకు అనుగుణంగా ఆలోచన, కార్యాచరణ మనదగ్గరుండాలి. ప్రభుత్వాలు సహా భాగస్వాములందరినీ కలుపుకుని ప్రైవేటుకు దీటుగా మన విశ్వవిద్యాలయాలను అభివృద్ధి చేసుకోవాలి.

ముఖ్యమంత్రి ఉస్మానియా విశ్వవిద్యాలయ పర్యటనను స్వాగతిద్దాం. రానున్న కాలంలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దే బృహత్తర కార్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయాన్నీ భాగస్వామ్యం చేద్దాం. ప్రభుత్వ ఆకాంక్షకు అనుగుణంగా ఉన్నత విద్యలో నైపుణ్యాలను మెరుగుపరుద్దాం. పరిశోధనలను పరుగులు పెట్టిద్దాం. అందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, నియామకాల బాధ్యతను ప్రభుత్వం ముందు ఉంచుదాం. ఉస్మానియా విశ్వవిద్యాలయ కీర్తిపతాకాన్ని ప్రపంచ యవనికపై ఎగరేద్దాం.



ప్రపంచీకరణ తర్వాత ప్రభుత్వరంగ విద్యకు అనేక పరిమితులు ఏర్పడ్డాయి. మారుమూల పల్లెల్లోనూ ప్రైవేటు విద్య అందుబాటులోకి వచ్చింది. ఉన్నత విద్య పేదలకు అందకుండా పోయే ప్రమాదం సమీప భవిష్యత్తులోనే ఉంది. ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులోనూ ప్రభుత్వ విద్య అందుబాటులో ఉండాలంటే.... ప్రస్తుత ఆధునిక సమాజంలో ప్రభుత్వరంగ విశ్వవిద్యాలయాలను కాపాడుకునేందుకు ఓ వ్యూహం, ఎత్తుగడ అవసరం.

విశ్వవిద్యాలయాలు మేధో చర్చకు నిలయాలుగా ఉండటం చరిత్ర నేర్పిన పాఠం. యూజీసీ నిబంధనావళి ప్రకారం విశ్వవిద్యాలయాల పరిశోధనల ఫలితాల ద్వారా ప్రభుత్వ పథకాలను రూపొందించుకోవాలని ఎన్నోసార్లు ఉద్ఘాటించారు. కనుక మన చర్చలన్నీ నిర్మాణాత్మకంగానే ఉండాలి. కానీ, కొన్ని సందర్భాలలో కొందరు వ్యక్తులు, కొన్ని సంస్థలు ముందూ వెనకా ఆలోచించకుండా.... ఆవేశకావేశాలకు లోనుకావటం ద్వారా ప్రస్తుత పరిస్థితుల్లో విశ్వవిద్యాలయాల దిశను మార్చలేము. ఈ సందర్భంలో తన సాహిత్యానికి నాలుగుసార్లు పులిట్జర్ బహుమతి పొందిన అమెరికన్ రచయిత రాబర్ట్ ఫ్రాస్ట్ చెప్పిన... "విద్య అంటే మీ కోపాన్ని లేదా ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవటం కాదు, ఏదైనా వినయంతో వినగల సామర్థ్యాన్ని కలిగి ఉండటం" అనే మాటలు గుర్తొస్తున్నాయి. రాజకీయ కారణాలు, వ్యక్తిగత అవసరాలతో చేసే నినాదాల పట్ల విద్యార్థులు, పరిశోధకులు అప్రమత్తంగా ఉండాలి. వాస్తవిక విషయాలను అర్థం చేసుకుని మసలుకోవాల్సిన అవసరాన్ని గుర్తెరగాలి. గుడ్డిగా ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకత్వాన్ని అడ్డుకోవడం, వ్యతిరేకంగా నినదించటం వల్ల జరిగే నష్టాన్ని అర్థం చేసుకోవాలి. ప్రభుత్వాల విధానాలను వ్యతిరేకించడమంటే ప్రభుత్వ యంత్రాంగాన్ని బహిష్కరించటం కాదు. తద్వారా జరగాల్సిన మేలు కన్నా కీడే ఎక్కువ. అయితే.. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపేందుకు వేరే పద్ధతులున్నాయి. రాజకీయంగా ఏవైనా భిన్నాభిప్రాయాలుంటే అందుకు వేరే వేదికలను వినియోగించుకోవచ్చు.

తెలంగాణ రాష్ట్ర విద్యావ్యవస్థకు దిక్సూచిగా, పెద్దన్నగా ఉన్న ఉస్మానియా విశ్వవిద్యాలయ పరిస్థితి గురించి మనం ప్రత్యేకంగా చర్చించుకోవాలి. ప్రతి సందర్భంలోనూ 'రాజకీయ నాయకత్వాన్ని అడ్డుకుంటాం, బహిష్కరిస్తాం' లాంటి నినాదాలు గత పదేళ్లలో ఎక్కువగా విన్నాం. ఇలాంటి వ్యాఖ్యలు ఉస్మానియా విశ్వవిద్యాలయం పట్ల సమాజంలో తప్పుడు అభిప్రాయాన్ని కల్గించే అవకాశం ఉంది. ఇది జాతీయ, అంతర్జాతీయ ర్యాంకింగ్‌లు, న్యాక్ గుర్తింపుపై ప్రభావం చూపుతుంది. విదేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో సీటు పొందాలంటే ఇప్పుడున్న ప్రమాణాల ప్రకారం మన దేశంలోని విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్‌లను, న్యాక్ గుర్తింపులను ప్రమాణంగా తీసుకుంటారు. ఫలితంగా ఇక్కడ చదువుకునే తెలంగాణ భూమి పుత్రుల భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకునే ప్రమాదం ఉంది.

ఉస్మానియా విశ్వవిద్యాలయానికి తిరిగి పునర్వైభవం తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ పౌర సమాజంపై ఉంది. వర్సిటీ పరిధిలో ఉన్న 730కి పైగా కళాశాలల్లో మూడున్నర లక్షల మంది విద్యార్థులు దాదాపు 175 విభిన్న కోర్సుల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. వారి బంగారు భవిష్యత్తుకోసం అవసరమైన నైపుణ్యాలను పెంపొందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. ఇందుకోసం విద్యార్థులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు ఓ కార్యాచరణతో ముందుకు వెళ్లాలి. ప్రభుత్వాలను భాగస్వామ్యం చేస్తూ ఓయూను అభివృద్ధి పథంలో నడిపించే పంథాను అనుసరించాలి. ఇప్పటికే పదమూడేళ్లుగా బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు లేక రాష్ట్ర విశ్వవిద్యాలయాలు ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రభుత్వ సహకారంతో అధిగమించాలి. ఏటికేడు ఆచార్యుల పదవీ విరమణలతో రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో క్రమేణా అధ్యాపకుల సంఖ్య ఐదో వంతుకు చేరింది. అవసరం మేరకు సదుపాయాలు లేక సమాజ సమగ్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావాల్సిన ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు కొంత వెనకబడ్డా.. ఆధునిక పోటీని తట్టుకుని నిలబడగలిగాయి. క్లిష్ట పరిస్థితుల్లోనూ జాతీయ, అంతర్జాతీయ ర్యాంకింగుల్లో ఉస్మానియా తనదైన స్థాయిని దక్కించుకుంది. ఇక్కడి అధ్యాపకులు, ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థుల కృషి, పట్టుదలే ఇందుకు కారణం. వారు పరిమిత వనరులతోనే పోటీ ప్రపంచాన్ని నెగ్గుకుంటూ అత్యుత్తమ ఉద్యోగాలు పొందుతున్నారు. అయితే.. ప్రస్తుత ప్రభుత్వం విశ్వవిద్యాలయాల్లో నియామకాలకు పచ్చజెండా ఊపటంతో పాటు అధ్యాపకుల పదవీవిరమణ వయస్సు 65 ఏళ్లకు పెంచటం శుభపరిణామం. ఈ ఆర్థిక సంవత్సరానికి ఒక్క ఓయూకే రూ.542 కోట్ల బ్లాక్ గ్రాంట్‌తో పాటు మౌలికవసతుల కల్పనకు రూ.100 కోట్లు అదనంగా కేటాయించటం ద్వారా ఉన్నత విద్య పట్ల ప్రభుత్వ విధానం స్పష్టమైంది. ఈ సందర్భంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు విశ్వవిద్యాలయాల్లో పర్యటించటం ద్వారా మౌలికవసతుల కల్పనకు అవకాశం ఏర్పడింది.

ఏ దేశ అభివృద్ధి కొలమానమైనా ఆ దేశ విద్యావ్యవస్థ నాణ్యతపై ఆధారపడి ఉంటుంది. మెరుగైన, నాణ్యమైన, నైపుణ్యాలతో కూడిన విద్యావ్యవస్థ కలిగిన దేశాలు, ప్రాంతాలు సమగ్రాభివృద్ధిలోనూ ముందు వరుసలో ఉంటాయి. అందుకే రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తు కోసం తపిస్తున్న ముఖ్యమంత్రి ఉస్మానియా విశ్వవిద్యాలయ పర్యటనను స్వాగతిద్దాం. రానున్న కాలంలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దే బృహత్తర కార్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయాన్నీ భాగస్వామ్యం చేద్దాం. ప్రభుత్వ ఆకాంక్షకు అనుగుణంగా ఉన్నత విద్యలో నైపుణ్యాలను మెరుగుపరుద్దాం. పరిశోధనలను పరుగులు పెట్టిద్దాం. అందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, నియామకాల బాధ్యతను ప్రభుత్వం ముందు ఉంచుదాం. ఉస్మానియా విశ్వవిద్యాలయ ఖ్యాతిని ప్రపంచ యవనికపై ఎగరేద్దాం. ప్రపంచ ప్రతిష్ఠాత్మక మ్యాగజైన్ ఫోర్బ్స్ పబ్లిషర్ దివంగత మాల్కం ఫోర్బ్స్ చెప్పినట్లు.... 'విద్య యొక్క ఉద్దేశ్యం ఖాళీ మనస్సును విశాల మేధస్సుతో భర్తీ చేయడం'.



• ప్రొఫెసర్ కుమార్ మొలుగరం
వైస్ ఛాన్స్‌లర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం

ప్రజామేధావుల సంరక్షణ సమాజ బాధ్యత!

ప్రజాస్వామ్యం స్థిరంగా నిలవాలంటే అభిప్రాయ స్వేచ్ఛ తప్పనిసరి. ప్రశ్నించడం మేధావి ధర్మం. మేధావులపై దాడులు ప్రజాస్వామ్యానికి ప్రమాదం. మేధావులు రెండు విధాలు. మొదటి తరగతి సాంప్రదాయ మేధావులు తాము సమాజం నుంచి విడివడి ఉన్నట్లుగా భావిస్తారు. వీరు వీరికి తెలియకుండానే ఉన్న వర్గవ్యవస్థను బలపరచే పాత్ర వహిస్తారు. వీరికి భిన్నంగా ఆర్గానిక్ మేధావులు ఉంటారని ఆంటోనియో గ్రాంస్కీ అనే ఇటాలియన్ మార్క్సిస్టు మేధావి భావన. ఇలాంటి వారు వర్గచైతన్యాన్ని పెంచడానికి పనిచేస్తారు.

ప్రజామేధావి చైతన్యం పెంచే ప్రయత్నం చేస్తే అతనిపై దేశద్రోహి అనే ముద్ర వేస్తారు. చేయని నేరం మోపుతారు, వేటాడతారు. అవమానాల్ని, ఒత్తిడిని తట్టుకోవడం, సత్యం చెప్పడంలో వెనుకడుగు వేయకపోవడం, గెలుపు ఆలస్యం అయినా దారి మళ్లకుండా ఉండటం వంటి లక్షణాలు కలిగి, ఒకవైపు మేధస్సు, మరోవైపు నిబద్ధతతో ప్రజామేధావి నిరంతర పోరాటం చేస్తూ ఉండాలి.



గ్రాంస్కీ సిద్ధాంతంలో మరో ప్రధాన భావన సాంస్కృతిక ఆధిపత్యం. దీనర్థం పాలకవర్గాల భావాలు బలప్రయోగం ద్వారా కాక, ఎక్కువగా ప్రజల అంగీకారాన్ని పొందడం ద్వారా పనిచేస్తాయి. పాలకవర్గాలు తమ విలువలు, ఆచారాలు, ఆలోచనా విధానాలను సామాన్య ప్రజలలో చొప్పించేందుకు ప్రయత్నిస్తాయి. ప్రజలు ఈ విలువలను స్వీకరించి, వాటిని స్వచ్ఛందంగా నమ్ముతారు. వాళ్లను బలవంతం చేయాల్సిన అవసరం ఉండదు. సినిమాలు, పాఠశాలలు, మతం, మీడియా వంటివన్నీ పాలకవర్గాల భావజాలాన్ని విస్తరించే పనిలో ఉంటాయి.

వీరికి భిన్నంగా ఆర్గానిక్ మేధావులు ప్రజల అభ్యుదయానికి పనిచేస్తూ, ఆధిపత్యాన్ని ప్రశ్నించి, ప్రజల చైతన్యాన్ని పెంచుతారు. ప్రస్తుత కాలంలో సామాజిక మాధ్యమాలు, విద్యా వ్యవస్థ వంటివి ఉపయోగించి ఆధిపత్య వర్గాలు ప్రజల మనోభావాలను మలుస్తున్నారు. దీనిని అర్థం చేసుకొని, ప్రజలకు నిజమైన చైతన్యం కలిగించడమే ఆర్గానిక్ మేధావుల ప్రధాన పని. సాంస్కృతిక ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా ప్రజా సంస్కృతి ఎలా అభివృద్ధి చెందాలీ అన్నదే సమాజాభివృద్ధికి ప్రధానం. ప్రజా సంస్కృతి ప్రజల అనుభవాల కేంద్రంగా రూపొందుతుంది. ప్రజల దైనందిన జీవితం, వారి కష్టసుఖాలు, ఆశయాలు, ఆలోచనల వంటివన్నీ ప్రజా సంస్కృతిలో ప్రతిఫలిస్తాయి. ఆధిపత్య వర్గాల ఒప్పించబడిన భావజాలం కాకుండా, ప్రజల స్వతంత్ర అవగాహన మీద ఆధారపడి ఇది ఉంటుంది. రైతు కవితలు, కార్మికుల గేయాల వంటివి ప్రజా సంస్కృతి రూపాలే. స్థానిక భాషలు, కళలు, సాంప్రదాయాలు ఈ సంస్కృతిలో భాగంగా ఉంటాయి.

ఆధిపత్య వర్గాలు "సాంస్కృతిక ఏకీకరణ" జరిపి తమ విలువలను ప్రజలపై ప్రబలంగా ముద్రించడానికి ప్రయత్నిస్తాయి. నేడు మోదీ ప్రభుత్వం ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే జాతి వంటి నినాదాలివ్వడం ఇందులో భాగమే. దీనికి భిన్నంగా ప్రజా సంస్కృతి మాత్రం స్థానికత, వైవిధ్యత, భిన్నత్వాలను కాపాడుతుంది. ఆధిపత్య వర్గాలు చరిత్రను వక్రీకరిస్తాయి లేదా మరచిపోయేలా చేస్తాయి. నేడు పాఠ్యాంశాలలో చరిత్ర అంశాలను తొలగించడం ఇందులో భాగమే. ప్రజా సంస్కృతి ప్రజల అసలు చరిత్రను సజీవంగా ఉంచుతుంది. తమ గతాన్ని గుర్తించి, భవిష్యత్తును నిర్మించుకోవడంలో ప్రజలకు మార్గదర్శకత్వం చేస్తుంది.

సమాజ పరిణామాలను శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషించిన వర్గ సిద్ధాంత రూపకర్త కార్ల్ మార్క్స్, వలసబాధిత దేశాల ప్రజలకు మేధో మార్గదర్శనం ఇచ్చిన ఫ్రెంచ్ మేధావి ఫ్రాంట్జ్ ఫానన్, కార్మిక వర్గానికి ప్రజా మేధావిగా మారిన గ్రాంస్కీ, భారతదేశ స్వాతంత్ర్యానికై మేధస్సును త్యాగం చేసిన మహాత్మాగాంధీ, అణగారిన ప్రజల విముక్తికై పోరాడిన డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్, మహిళా విద్యకై విశేష కృషి చేసిన సావిత్రి బాయి పూలే, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి వారంతా ప్రజల గుండె చప్పుడు విన్న మేధావులు.

సమాజానికి ప్రజా మేధావులు కావాలి. అయితే నేటి సమాజంలో అలాంటి వారు మనుగడ సాగించడం అత్యంత కష్టతరం. ఎందుకంటే సాంస్కృతిక ఆధిపత్యం బలమైనది. అధికార వర్గాలు ప్రజల మనస్సుల్లో తమ భావజాలాన్ని గాఢంగా నాటుతాయి. ప్రజలు తమ దోపిడీని, కష్టాలను కూడా సహజంగానే భావించే స్థితిలో ఉంటారు. ప్రజలలో మార్పు సాధించాలంటే, మేధావి ఈ గాఢమైన 'సహజ జ్ఞానా'న్ని మార్చగలగాలి. "బానిస తన గొలుసును ఆభరణంగా భావించినప్పుడు విముక్తి కష్టం." పేద ప్రజలు ఆకలి, అనిశ్చితి, భయం వంటి దయనీయ పరిస్థితుల్లో ఉన్నపుడు వారిలో చైతన్యాన్ని సృష్టించడం సులభం కాదు. పాలక వర్గాలు మతం, జాతి, భాష, ప్రాంత భేదాల ఆధారంగా ప్రజలను చీల్చి, దారి మళ్లిస్తాయి. మేధావి ప్రజలను ఒకతాటిపై తీసుకురావాలంటే, ఈ విభజనల చీకటి మబ్బుల్ని తొలగించాలి.

ప్రజామేధావి చైతన్యం పెంచే ప్రయత్నం చేస్తే అతనిపై దేశద్రోహి అనే ముద్ర వేస్తారు. చేయని నేరం మోపుతారు, వేటాడతారు. అవమానాల్ని, ఒత్తిడిని తట్టుకోవడం, సత్యం చెప్పడంలో వెనుకడుగు వేయకపోవడం, గెలుపు ఆలస్యం అయినా దారి మళ్లకుండా ఉండటం వంటి లక్షణాలు కలిగి, ఒకవైపు మేధస్సు, మరోవైపు నిబద్ధతతో ప్రజా మేధావి నిరంతర పోరాటం చేస్తూ ఉండాలి.

మోదీ ప్రభుత్వం ఒక పథకం ప్రకారమే ప్రజా మేధావి వర్గాన్ని, ప్రశ్నించే వారిని లక్ష్యంగా ఎంచుకుంది. గౌరీలంకేశ్, ప్రబీర్ పురకాయస్థ, ప్రొఫెసర్ సాయిబాబా, ప్రొఫెసర్ అలీ ఖాన్, సుధా భారద్వాజ్, స్టాన్ స్వామి వంటి అనేకమందిపై హత్యాయత్నాలు, హత్యలు, అక్రమ అరెస్టులు జరిగాయి. ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాటం చేసే పత్రికలూ నాయకులపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. మనుషుల్ని చంపగలరేమో గానీ, వారిచ్చిన జ్ఞానాన్ని చంపలేరు కదా!

ప్రజామేధావులు లేని ఏ సమాజమైనా సృజనాత్మకంగా ముందుకుపోవడంలో విఫలమవుతుంది. ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక వ్యవస్థల్లో అస్తవ్యస్థలు, వివక్షలు, పరిష్కారాలు లేకపోవడం వంటి అనేక నష్టాలను సమాజం ఎదుర్కొంటుంది. "తుఫానొస్తే కొండ మీద చెట్లు కదులుతాయి కానీ, కొండ కదలదు కదా!" అన్నారు రావి శాస్త్రి. అలాగే మన ప్రజాస్వామ్య వ్యవస్థ కూడా అనేక ఆటుపోట్లను ఎదుర్కొని స్థిరంగా, బలంగా నిలబడింది. అందులో ప్రజామేధావుల పాత్రను మరువలేం. అందుకే నేటి క్లిష్ట పరిస్థితుల్లో ఈ తరహా మేధావులను ప్రోత్సహించడం పౌర సమాజం బాధ్యత.

◆ ఎ. అజశర్మ
ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

కొత్త పొద్దులో తపాలాభారతి!


ఘన చరిత్ర కలిగిన తపాలా శాఖ ఎట్టకేలకు నిద్రావస్థను వీడి ప్రైవేట్ కొరియర్ సంస్థలతో పోటీకి దీటుగా డిజిటలైజేషన్ వైపు అడుగులు వేస్తోంది. దశలవారీగా దేశమంతటా పోస్టాఫీసుల్లో సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్ ప్రక్రియ చేపట్టారు. నగదు రహిత ఆన్‌లైన్ చెల్లింపులకు మార్గం సుగమమైంది. మరోపక్క లాభసాటి కాదనుకుంటున్న రిజిస్టర్డ్ పోస్టు విత్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్ సర్వీసు ఈ నెలాఖరు నుంచి రద్దు చేస్తున్నారు. గతంలో రద్దు చేసిన రిజిస్టర్డ్ బుక్‌పోస్ట్ స్థానంలో ఈ ఏడాది మే 1 నుంచి జ్ఞాన్ పోస్ట్ సర్వీసును ప్రవేశపెట్టారు. వ్యాపార విస్తరణలో భాగంగా ఇ-కామర్స్ తరహాలో ఆదివారాలు, సెలవు రోజుల్లోనూ బట్వాడాకు పథకాలు రచిస్తున్నారు. లాభాలే లక్ష్యం చేసుకోకుండా, సామాన్యుడిపై భారం మోపకుండా సేవల నాణ్యతను పెంచడం ఇప్పుడు తపాలాశాఖ ముందున్న సవాలు.

భారతదేశ తపాలా శాఖకు సుదీర్ఘ చరిత్ర ఉంది. బ్రిటిష్ ఇండియా గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్స్ 1774 మార్చిలో, ఈస్టిండియా కంపెనీ వాణిజ్య ప్రయోజనాల పరిరక్షణ కోసం మొదటిసారి తపాలా సేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. లార్డ్ డల్‌హౌసి 1850లో ఏర్పాటు చేసిన పోస్టాఫీస్ కమిషన్ సిఫారసుల మేరకు 1854లో పోస్టాఫీస్ చట్టాన్ని తెచ్చారు. బెంగాల్ ప్రధాన కేంద్రంగా 700 పోస్టాఫీసులు హోంమంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో పనిచేసేవి. సంస్థాన ప్రాంతాలు సహా దేశమంతటా ఒకే టారిఫ్, పోస్టల్ స్టాంపులతో ఏకీకృత సేవలకు ఈ చట్టం వీలు కల్పించి ఆధునిక తపాలా వ్యవస్థకు పునాది వేసింది. నాటి నుంచి అంచెలంచెలుగా విస్తరిస్తూ దేశ సామాజిక, ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోంది. తపాల సేవలకే పరిమితం కాకుండా, స్మాల్ సేవింగ్స్ డిపాజిట్లు, లైఫ్ ఇన్సూరెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకూ తపాలా శాఖ ద్వారా సేవలు అందుతున్నాయి.

మారిన అవసరాలు, టెక్నాలజీని దృష్టిలో పెట్టుకుని 2023లో ఇండియన్ పోస్టాఫీస్ చట్టాన్ని కొత్తగా తెచ్చారు. 2024 జూన్ 18 నుంచి అమలులోకి వచ్చిన ఈ చట్టం ద్వారా డిజిటల్ ఎలక్ట్రానిక్ సాంకేతికతకు అనుగుణంగా ప్రభుత్వ ఆమోదంతో తగిన నిర్ణయాలు తీసుకోవడానికి పోస్టల్ డైరెక్టర్ జనరల్‌కు అధికారాలు కట్టబెట్టింది. పాత చట్టంలో ప్రతి నిర్ణయానికీ పార్లమెంటరీ ఆమోదం పొందాల్సి వచ్చేది.

సిబ్బంది జవాబుదారీకి సంబంధించి కొత్త చట్టంలో వెసులుబాటు కల్పించడంపై ఆక్షేపణలు వచ్చాయి. తపాలా ద్వారా పంపే వస్తువుల నష్టం, ఆలస్యం, సరైన చిరునామాదారుకు చేర్చకపోవడం వంటి పొరపాట్లకు సిబ్బందిని జవాబుదారీతనం నుంచి తప్పించారు. దురుద్దేశపూర్వకంగా తప్పు చేసే వారికి మాత్రం ఇది వర్తించదు. లయబిలిటీ క్లాజును తొలగించడం సిబ్బందిలో ఉపేక్షకు, నిర్లక్ష్యానికీ దారితీయవచ్చనే విమర్శలు వచ్చాయి. సర్వీసుల నాణ్యతపై కూడా ప్రతికూల ప్రభావం పడవచ్చు.

డిజిటల్ చెల్లింపులకు ఇంతకాలానికి పోస్టాఫీసుల్లో వెసులుబాటు కలిగింది. అయితే కొత్త టెక్నాలజీకి పూర్తిగా సిబ్బంది సన్నద్ధం కాకపోవడం, అన్ని పోస్టాఫీసుల్లో అప్‌డేషన్ పూర్తి కాకపోవడంతో సర్వీసులు నత్తనడకన సాగుతున్నాయి.



మరో పక్క యాభై ఏళ్లుగా అందుబాటులో ఉన్న రిజిస్టర్డ్ పోస్ట్ విత్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్ సర్వీసును 2025 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ఉపసంహరించుకుంటున్నారు. ఈ సర్వీసును స్పీడ్ పోస్ట్‌లో విలీనం చేస్తున్నట్లు తపాలాశాఖ ప్రకటించింది. ప్రైవేట్ కొరియర్ సంస్థ పోటీ కారణంగా రిజిస్టర్డ్ పోస్టుల సంఖ్య 25 శాతం తగ్గింది. దీనికి తోడు డిజిటల్ ఎడాప్షన్‌లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారట.

ఇప్పటివరకూ లీగల్ నోటీసులను, ఉద్యోగ నియామక పత్రాల వంటి డాక్యుమెంట్లను రిజిస్టర్డ్ పోస్టు ద్వారానే పంపేవారు. ఈ సర్వీసు ద్వారా పొందే ఎక్‌నాలెడ్జ్‌మెంట్‌కు చట్టబద్ధత ఉంది. కోర్టులు కూడా నోటీసు అందినదనడానికి దీన్ని రుజువుగా పరిగణించేవి. స్పీడ్ పోస్ట్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్‌కు ఈ విధమైన చట్టబద్ధత ఉంటుందా అనేది తేలాల్సి ఉంది. స్పీడ్ పోస్ట్ టారిఫ్, దూరాన్ని బట్టి మారుతుంది. కనుక కస్టమర్లపై అదనపు భారం పడుతుంది.

గతంలో రద్దు చేసిన రిజిస్టర్డ్ ప్రింటెడ్ బుక్ పోస్ట్ స్థానే 2025 మే 1వ తేదీ నుంచి జ్ఞాన్ పోస్ట్ పేరుతో కొత్త పోస్టల్ సర్వీసును అందుబాటులోకి తెచ్చారు. అయితే జ్ఞాన్ పోస్ట్‌కు తగినంత ప్రచారం కల్పించకుండా గుట్టుగా ఉంచడంతో రచయితలు, పబ్లిషర్ల వినియోగానికి పూర్తిగా రాలేదు. యూనివర్శిటీలు, గుర్తింపు పొందిన బోర్డుల స్టడీ మెటీరియల్‌ను పోటీ పరీక్షలు రాసేవారు చదివే పాఠ్యపుస్తకాలను జ్ఞాన్ పోస్ట్ ద్వారా పంపవచ్చు. సామాజిక, సాంస్కృతిక, మత అంశాలతో ప్రచురించిన పుస్తకాలను ఈ జ్ఞాన్ పోస్ట్ ద్వారా చేరవేయవచ్చు. 300 గ్రాముల వరకు రూ.20తో మొదలయ్యే టారిఫ్ 5 కిలోలకు గరిష్ఠంగా రూ.100 వసూలు చేస్తారు. జీఎస్టీ అదనం. పీరియాడికల్స్‌ను మాత్రం అనుమతించరు.

రచయితలు, ప్రచురణకర్తలకు కాస్తంత ఊరట కలిగించే జ్ఞాన్ పోస్ట్ సర్వీసులకు పలుచోట్ల తపాలా సిబ్బంది మోకాలడ్డుతున్నారు. ఒక పుస్తకం మాత్రమే పంపాలనీ, నాలుగు వైపులా బుక్ పాకెట్ తెరచి ఉంచాలనీ, ఇలా ఎవరికి తోచిన రూల్స్ వారు చెప్తూ వేధిస్తున్నారు. ఐదు కిలోల వరకు పంపే వెసులుబాటును నీరుగారుస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దాలి.

యాభై ఏళ్లుగా ఉన్న రిజిస్టర్డ్ పోస్ట్ విత్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్ సర్వీసును సెప్టెంబర్ 1 నుంచి ఉపసంహరించుకుంటున్నారు. అంతగా వినియోగంలో లేని మనియార్డర్, పోస్ట్‌కార్డ్, ఇన్‌ల్యాండ్ లెటర్ మునుముందు రోజుల్లో కనుమరుగుకావచ్చు.

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఇ-కామర్స్ సంస్థలతో పోటీ పడేందుకు తపాలాశాఖ సన్నద్ధమవుతోంది. ఇప్పుడు ఒక షిఫ్ట్‌లోనే పోస్ట్‌మెన్ బట్వాడా విధులు నిర్వర్తిస్తున్నారు. దీన్ని మూడు షిఫ్ట్‌లకు పెంచి, ఆదివారాలు, సెలవు రోజుల్లో కూడా బట్వాడా చేసి ఆదాయం పెంచుకోవాలని తపాలాశాఖ యోచిస్తోంది. దీంతో పాటు ఇతర ఆదాయం పెంపు మార్గాలపైనా తపాలా శాఖ దృష్టి పెట్టనుంది. లాభసాటిగా లేని గ్రామీణ పోస్టాఫీసులను మూసివేయడమో, సమీప పోస్టాఫీసుల్లో విలీనం చేయడమో జరగవచ్చు. అంతగా వినియోగంలో లేని మనియార్డర్, పోస్ట్‌కార్డ్, ఇన్‌ల్యాండ్ లెటర్ మునుముందు రోజుల్లో కనుమరుగు కావచ్చు. శాశ్వత ప్రాతిపదికన సిబ్బంది నియామకాలను చేపట్టి, భవనాల వంటి మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించినప్పుడే తపాలా శాఖ ఆశించిన లక్ష్యాలు సాధించగలదు.

▪ గోవిందరాజు చక్రధర్

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.6 కనిష్ఠం 21.8

5 నిమిషాల్లోనే ఖజానా దోపిడీ



ఇద్దరిని సూరత్‌లో పట్టుకున్న సైబరాబాద్ పోలీసులు


ఆరుకు చేరిన అరెస్టులు.. పరారీలో మరో నిందితుడు

6

కరెంట్ సీన్ మారింది !

విద్యుత్ కనెక్షన్ల జారీలో కొత్త నిబంధనలు

- గదుల ఆధారంగా కిలోవాట్ల కేటాయింపు
- డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌కు 5 కిలోవాట్లు..
- త్రిబుల్ బెడ్‌రూమ్‌కు 10 కిలోవాట్లతో కనెక్షన్లు
- 20 కిలోవాట్ల లోడ్ దాటితే ట్రాన్స్‌ఫార్మర్ తప్పదు
- బహుళ అంతస్తుదారులకు తప్పని తిప్పలు
- సమాచారం లేకుండా మార్పులపై మండిపాటు



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) తీసుకొచ్చిన కొత్త నిబంధనలు అపార్ట్‌మెంట్లు, బహుళ అంతస్తుల భవనాల నిర్మాణదారుల గుండెల్లో గుబులు రేపాయి. ముందస్తు సమాచారం లేకుండా నిబంధనలను ఎలా మారుస్తారంటూ వారు ఆందోళన చెందుతున్నారు. కొత్త నిబంధనలను వెంటనే సవరించాలని డిమాండ్ చేస్తున్నారు. మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ జోన్లలో విద్యుత్ కనెక్షన్ల జారీలో అధికారులు కొత్త నిబంధనలు అమల్లోకి తీసుకురావడంతో కనెక్షన్ల జారీపై ఆ ప్రభావం పడింది. కొత్తగా వెలుస్తున్న బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్లకు ఇకపై గదుల ఆధారంగా విద్యుత్ లోడ్ తీసుకుంటే తప్ప కొత్త కనెక్షన్లు జారీచేయలేమని ఆశాఖ స్పష్టం చేస్తోంది. అపార్ట్‌మెంట్లలో సింగిల్ బెడ్‌రూమ్‌కు 2కిలోవాట్లు, డబుల్ బెడ్‌రూమ్‌కు 5, ట్రిబుల్ బెడ్‌రూమ్‌కు 10, నాలుగు బెడ్‌రూమ్‌లకంటే ఎక్కువగా ఉన్న ఫ్లాట్లకు 15 కిలోవాట్ల లోడ్ సామర్థ్యంతో కూడిన కనెక్షన్లు తీసుకోవాలనే కొత్త నిబంధనను అమల్లోకి తెచ్చారు. దీంతో మేడ్చల్, సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, సంగారెడ్డి, సికింద్రాబాద్, బంజారాహిల్స్ సర్కిళ్లలోని కస్టమర్ సర్వీస్ సెంటర్లలో (సీఎస్‌సీ)లలో కొత్త కనెక్షన్ల దరఖాస్తులు రావడం ఒక్కసారిగా తగ్గింది. ఈ నిబంధనలతో వందల కనెక్షన్లు పెండింగ్‌లో పడ్డాయి.

గదుల ఆధారంగా లోడ్ సామర్థ్యంతో విద్యుత్ కనెక్షన్లు

ఫ్లాట్	కిలో వాట్స్
సింగిల్ బెడ్‌రూమ్ -	2
డబుల్ బెడ్‌రూమ్ -	5
త్రిబుల్ బెడ్‌రూమ్ -	10
4 బెడ్‌రూమ్, ఆపైన-	15

క్షేత్రస్థాయిలో అభ్యంతరాలు

ఇటీవలి వరకు అపార్ట్‌మెంట్లలో 5 కిలోవాట్ల లోడ్ విద్యుత్ కనెక్షన్లు జారీచేసిన దక్షిణ డిస్కం ఒకేసారి లోడ్ రెట్టింపు చేయడంపై క్షేత్రస్థాయిలో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. పది త్రిబుల్ బెడ్‌రూమ్ కల్గిన అపార్ట్‌మెంట్‌కు మొన్నటి వరకు ఒక్కో ఫ్లాట్‌కు 5 కిలోవాట్ల లోడ్‌తో 63 కిలోవాట్ల ట్రాన్స్‌ఫార్మరు ఏర్పాటు చేసుకుంటే, కొత్త నిబంధనలతో ఒక్కో ఫ్లాట్‌కు 10 కిలోవాట్ల లోడ్ తీసుకొని అదే భవనానికి 160 కిలో సామర్థ్యం కల్గిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోంది. దీంతో చార్జీల భారం రెట్టింపవుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గృహాలకు

మిగతా 6వ పేజీలో..



పర్యావరణహిత నగరంగా

హైదరాబాద్

- ఆ దిశగా తీర్చిదిద్దుతాం
- పెద్ద ఎత్తున చెరువులను పునరుద్ధరిస్తున్నాం
- దక్షిణ మండలి సమావేశంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్

6

సహస్ర పేరుతో కొత్త చట్టం తేవాలి

- ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు కేఏ పాల్

6

రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు

- నిషేధిత జాబితాలో ఉన్న భూమికి రిజిస్ట్రేషన్..

6



రంగులతో సిద్ధమవుతున్న ఖైరతాబాద్ గణపతి

తుది మెరుగులు..

ఖైరతాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): భక్తుల పూజలందుకునేందుకు భారీ గణేశుడు సిద్ధమయ్యాడు. ఆదివారం తుది మెరుగులు పూర్తి చేసి సోమవారం ఉదయం కళ్లను అమర్చి విగ్రహాన్ని పూజలకు సిద్ధం చేయనున్నారు. ఈ మేరకు ప్రధానశిల్పి రాజేంద్రన్‌తో పాటు పెయింటింగ్ కళాకారులు రాత్రింబవళ్లు పని చేస్తున్నారు. కళ్లను తీర్చిదిద్ది వినాయకుడికి శిల్పి ప్రాణం పోస్తే అదేరోజు సాయంత్రం గణపయ్య వచ్చేశాడని ఖైరతాబాద్ యూత్ ఆధ్వర్యంలో ఆగమన్‌ను నిర్వహించనున్నారు.

ఇంజెక్షన్ బోర్లతో భూగర్భ జలాల పెంపు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పెద్ద అపార్ట్‌మెంట్ల ఆవరణల్లో కొన్ని ఇంజెక్షన్ బోర్లు ఏర్పాటు చేసుకుంటే భూగర్భ జలాలు పెరుగుతాయని వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి అన్నారు. ఈ విధంగా చేస్తే వచ్చే వేసవిలో ట్యాంకర్లు బుక్ చేసే అవసరం ఉండదని ఆయన పేర్కొన్నారు. శనివారం ప్రగతినగర్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నీటి సరఫరా, అత్యధిక ట్యాంకర్ బుకింగ్‌లపై స్థానికులతో మాట్లాడారు. కార్యక్రమంలో సీజీఎం ఆనంద్‌నాయక్, జీఎం సుబ్బరాయుడు, డీజీఎం చంద్రమోహన్, మేనేజర్ పాల్గొన్నారు.

సార్.. ప్రజెంట్!

- ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్‌తో పరుగులు తీస్తున్న టీచర్లు
- నిర్ణీత సమయంలోపు పాఠశాలల్లో అడుగు
- యాప్ ద్వారా హాజరు వేసుకుంటున్న పరిస్థితి



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు నిర్ణీత సమయంలోపు బడికి చేరుతున్నారు. ఈ మేరకు పాఠశాల ప్రాంగణంలో ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) యాప్ ద్వారా హాజరు వేసుకుంటున్నారు. విద్యార్థులకు అందుబాటులో ఉంటూ బోధనలు అందిస్తున్నారు. తెలంగాణ విద్యా శాఖ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు కూడా ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్‌ను అమలులోకి తీసుకొచ్చింది. సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కొంతమంది టీచర్లకు ముకుతాడు వేసి పాఠశాలలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. దీంతో ఆలస్యమైతే గైర్హాజరు పడుతోందనే ఉద్దేశంతో ఉపాధ్యాయులు ఉదయం పూట

మిగతా 6వ పేజీలో..

రోడ్ల పక్కనే వదిలేస్తున్న కేబుల్స్



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం మరోసారి బహిర్గతమైంది. విద్యుత్ స్తంభాలకున్న కేబుల్స్‌ను, 15 అడుగుల కంటే తక్కువ ఎత్తులో వేలాడుతున్న తీగలను తొలగించి అక్కడే వదిలేశారు. వాటిని తరలించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. లంగర్‌హౌస్, బోరబండ, కూకట్‌పల్లి, మేడ్చల్, మాదాపూర్, జీడిమెట్ల, కుత్బుల్లాపూర్‌తో పాటు పలు ప్రాంతాల్లో శనివారం ఈ దృశ్యం కనిపించింది. అయితే, రోడ్లు, ఫుట్‌పాత్‌లపై వదిలేసిన ఈ కేబుల్స్‌కు తట్టుకుని పాదచారులు, ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయాలకు గురవుతున్నారు. అధికారులు కేబుల్స్‌ను ఎప్పటికప్పుడు తరలించాలని వారు కోరుతున్నారు.

విద్యుత్ స్తంభాల నుంచి తొలగించి రోడ్డుపక్కనే వదిలేసిన కేబుల్ వైర్లు



అధిక లాభాలంటూ వృద్ధుడికి టోకరా

- రూ. 35.89 లక్షలు కాజేత

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను వినియోగించి స్టాక్ ట్రేడింగ్ చేస్తే అధిక లాభాలు వస్తాయని నమ్మించిన సైబర్ నేరగాళ్లు ఓ వృద్ధుడి నుంచి రూ.35.89 లక్షలు కాజేశారు. తిరుమలగిరి ప్రాంతానికి చెందిన వృద్ధుడిని (61) శూన్య ఎక్స్ఛేంజ్ గ్రూప్ నిర్వాహకులమంటూ సైబర్ నేరగాళ్లు సంప్రదించారు. అనన్య కపూర్ అనే మహిళ తనను తాను శూన్య ఎక్స్ఛేంజ్ సీఈఓ సర్వజిత్‌సింగ్ విర్క్‌కు సెక్రటరీగా పరిచయం చేసుకుంది. తాము పెట్టే పెట్టుబడుల్లో అధిక లాభాలు వస్తాయని నమ్మించి సదరు వృద్ధుడిని వాట్సప్ గ్రూప్‌లో చేర్చారు. షేర్ ట్రేడింగ్ ఎక్స్‌పర్ట్ అంటూ మాయ అనే యువతి సంస్థ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి పెట్టుబడి పెట్టించింది. అలా బాధితుడు పలు దఫాలుగా రూ.35.89 లక్షలు వారు సూచించిన ఖాతాల్లో జమ చేశాడు. భారీగా లాభాలు వచ్చినట్లు యాప్‌లో చూపారు. అయితే, విత్‌డ్రాకు యత్నించగా.. మరో రూ.45.56 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దాంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశాడు.

సెల్‌ఫోన్ కొన్నప్పుడే నిలదీయాల్సింది



హత్యకు గురైన బాలిక సహస్ర (ఫైల్)

నిందితుడి తల్లిదండ్రుల ఆవేదన

- బాలుడి టెన్షన్‌ను గమనించిన తల్లి
- నిలదీస్తే.. అనుమానిస్తావా అంటూ ఎదురుప్రశ్న
- బాలుడి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన పోలీసులు
- భయపడకుండా కిల్లింగ్ స్టోరీ చెప్పిన వైనం
- హత్యాకాండను విని విస్తుపోయిన తల్లిదండ్రులు



హత్యచేయుడానికి వినియోగించిన కత్తి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సహస్రను హత్య చేసిన నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. అతని తల్లిదండ్రులతో మాట్లాడినప్పుడు విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చినట్లు బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్ వెల్లడించారు. వివరాలు ఆయన మాటల్లోనే.. రోజూ స్నానం చేయాలని ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోని బాలుడు సహస్ర చనిపోయిన రోజు 10:30కే స్నానం చేయడంతో కొడుకు ప్రవర్తన మీద తల్లికి అనుమానం వచ్చింది. ఎవరూ డబ్బులు ఇవ్వకపోయినా ఇటీవల ఒక సెల్‌ఫోన్ కొన్నాడు. ఫోన్ ఎలా కొన్నావురా అని ప్రశ్నిస్తే నీకెందుకు అంటూ సమాధానం దాటవేసేవాడని పేర్కొన్నారని డీసీపీ తెలిపారు. ఆరోజే సెల్‌ఫోన్ ఎలా వచ్చింది, ఎవరు కొనిచ్చారు, డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీసి ఉంటే ఈరోజు సహస్ర బతికేదని, ఈ దుస్థితి వచ్చేది కాదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు.

కుటుంబీకుల ఎదుటే స్టేట్‌మెంట్ రికార్డు..

బాలుడే నిందితుడని పోలీసులు గుర్తించిన తర్వాత కుటుంబ సభ్యుల ఎదుటే అతని స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. తల్లిదండ్రులను రహస్యంగా విచారణ చేసే గదికి సమీపంలో ఉంచి, ఆ బాలుడిని విచారించారు. అయితే, సహస్రను హత్య చేసిన విషయాన్ని పూసగుచ్చినట్లుగా వివరిస్తుండగా బాలుడి తల్లిదండ్రులు, ఇద్దరు అక్కలు విన్నారని, వారి సమక్షంలోనే నేరంగీకార స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసినట్లు తెలిపారు. అయితే, ఎలాంటి బెరుకూ భయం లేకుండా హత్యోదంతాన్ని కళ్లకు కట్టినట్లు బాలుడు వివరించాడు. సహస్రను చంపిన తర్వాత షర్టుకు ఉన్న రక్తపు మరకలు కనిపించకుండా ఇంట్లోకి వెళ్లిన విధానం, ఆ షర్టును వాషింగ్ మిషన్‌లో ఉతికిన విధానం, హత్యకు వాడిన కత్తిని తీసుకెళ్లిన విధానం అంతా విని ఆ బాలుడి తల్లిదండ్రులు విస్తుపోయినట్లు డీసీపీ తెలిపారు.

అమ్మా.. నువ్వే నన్ను పట్టించేలా ఉన్నావ్

హత్య జరిగిన రోజు కొడుకు చాలా టెన్షన్‌గా ఉండటాన్ని తల్లి గమనించింది. ఘటనా స్థలానికి వెళ్లడం, అక్కడ జరిగేది తెలుసుకొని రావడం, అక్కడ ఏం జరుగుతోందని ఇంట్లో తెలుసుకుంటూ ఉండటంతో తల్లికి అనుమానం వచ్చింది. 'ఏందిరా ఎప్పుడూలేంది ఈ వివరాలన్నీ అడుగుతున్నావ్.. ఆ పిల్లను నువ్వేమైనా చేశావా..?' అంటూ ప్రశ్నిస్తే.. 'అమ్మతోడమ్మా.. నేనేమీ చేయలేదు. ఎందుకు అలా అనుమానిస్తున్నావ్.. నువ్వే నన్ను పోలీసులకు పట్టించేలా ఉన్నావ్' అంటూ బెదిరిపోయినట్లు మాట్లాడాడని విచారణలో తల్లిదండ్రులు చెప్పినట్లు డీసీపీ తెలిపారు.

సొంత భవనాలున్న

కాలేజీలకే సై

- ఇంజనీరింగ్ కోర్సుల చేరికలో విద్యార్థుల మొగ్గు
- నాలుగు కళాశాలల్లో మొత్తం సీట్ల భర్తీ.. నాలుగింటిలో నిల్
- మిగిలిపోయిన 978 సీట్లు.. 26నుంచి స్పాట్ అడ్మిషన్లు



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరాలనుకున్న అభ్యర్థులు సొంత భవనాలున్న ప్రభుత్వ కాలేజీల వైపే మొగ్గు చూపారు. అద్దె భవనాల్లో అరకొర వసతులతో కొనసాగుతున్న కాలేజీల్లో చేరేందుకు విముఖత వ్యక్తం చేశారు. ప్రఖ్యాత జేఎన్‌టీయూ పరిధిలో మొత్తం 8 అనుబంధ (ప్రభుత్వ) కాలేజీలు ఉండగా, వీటిలో సొంత భవనాలున్న 4 కాలేజీల్లో సీట్లు హౌస్‌ఫుల్ కావడం, అద్దెభవనాల్లో కొనసాగుతున్న కాలేజీల్లో మాత్రం అధికంగా సీట్లు మిగిలిపోవడమే ఇందుకు నిదర్శనంగా కనిపిస్తోంది. మూడు విడతల కౌన్సెలింగ్ ప్రక్రియ అనంతరం ఎప్‌సెట్ అధికారులు విడుదల చేసిన మిగిలిపోయిన సీట్ల జాబితాలను పరిశీలిస్తే.. హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ క్యాంపస్ కాలేజీతో పాటు సొంత భవనాలు, మౌలిక వసతులున్న సుల్తాన్‌పూర్, జగిత్యాల, మంథని జేఎన్‌టీయూ కాలేజీల్లో దాదాపుగా సీట్లన్నీ భర్తీ అయ్యాయి. అద్దె భవనాల్లో కొనసాగుతున్న పాలేరు, సిరిసిల్ల, వనపర్తి, మహబూబాబాద్ జేఎన్‌టీయూ కాలేజీల్లో మొత్తం సీట్లలో 20శాతానికి లోపే భర్తీ కావడం జేఎన్‌టీయూ వర్గాలను ఆందోళనకు గురిచేస్తోంది. మొత్తంగా జేఎన్‌టీయూ అనుబంధ కాలేజీల్లో 978సీట్లు మిగిలిపోగా, వాటి భర్తీకి ఈ నెల 26నుంచి 29వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించేందుకు వర్సిటీ ఉన్నతాధికారులు సన్నద్ధమయ్యారు.

చేరింది 20 శాతానికి లోపే..

2021లో ప్రారంభమైన సిరిసిల్ల జేఎన్‌టీయూ కాలేజీలో నాలుగేళ్ల బీటెక్ పూర్తి చేసుకొని ఒకబ్యాచ్ బయటకు వచ్చినప్పటికీ వసతుల లేమి, ఆచార్యుల కొరత కొట్టొచ్చినట్లు కనబడుతోంది. మాజీ మంత్రి కేటీఆర్ ప్రాతినిథ్యం వహించిన నియోజకవర్గంలోని జేఎన్‌టీయూ కళాశాల దుర్భర దుస్థితిలో ఉండడం రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా ఉంటోంది. మరోవైపు వనపర్తి జేఎన్‌టీయూ కాలేజీకి కొంత భూమిని అప్పటి ప్రభుత్వం కేటాయించినప్పటికీ సొంత భవనాలు లేకపోవడంతో విద్యార్థులు దానిలో చేరేందుకు ఆసక్తి చూపడం లేదు. 2023లో ఏర్పాటైన మహబూబాబాద్, పాలేరు జేఎన్‌టీయూ కాలేజీలకు కూడా భవనాలు లేకపోవడంతో అద్దెభవనాల్లోనే

మిగతా 6వ పేజీలో..

విరివిగా ఏఐ సాంకేతికత

వినియోగం

- విశ్లేషణతో సమస్యల పరిష్కారానికి వాటర్‌బోర్డు చర్యలు
- గతేడాది సెప్టెంబర్ నుంచి 6.50 లక్షల ఫిర్యాదులు
- 12లక్షలకు పైగా ట్యాంకర్ బుకింగ్‌లు



హైదరాబాద్ సిటీ, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ)ను వినియోగిస్తూ ఏడాది కాలంలో ఏ ఏ ప్రాంతాల నుంచి అత్యధిక ఫిర్యాదులు వస్తున్నాయో, ఏ ప్రాంతం నుంచి ట్యాంకర్లకు అధిక డిమాండ్ ఏర్పడిందో వాటర్‌బోర్డు అధికారులు తేల్చారు. తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణలో ఏఐ సాంకేతికతను బోర్డు విరివిగా వినియోగిస్తోంది. ఈ క్రమంలో వినియోగదారుల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడానికి చర్యలు చేపడుతోంది. వాటర్‌బోర్డులో ఏడాది కాలంలో మెట్రో కస్టమర్ కేర్(ఎంసీసీ)లో నమోదైన ఫిర్యాదులను, బుక్ అయిన ట్యాంకర్ల వివరాలను ఏఐ ద్వారా కొన్ని రోజులుగా ఐటీ విభాగపు అధికారులు విశ్లేషిస్తున్నారు. గతేడాది సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి.. ఇప్పటివరకు 6.50లక్షలకు పైగా వివిధ సమస్యలపై వాటర్‌బోర్డు కస్టమర్ కేర్‌కు ఫిర్యాదులు అందాయని, 12 లక్షలకు పైగా ట్యాంకర్లు బుక్ అయ్యాయని అధికారులు తెలిపారు. అత్యధికంగా ట్యాంకర్లను బుక్ చేసిన టాప్ 10 వినియోగదారులను గుర్తించారు. అందులో అత్యధికంగా ప్రగతినగర్‌లోని సౌతన్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ ఏడాదిలో 674 ట్యాంకర్‌లను బుక్ చేసినట్టు తేల్చారు.

కల్వర్టులో

మెట్రో పిల్లర్!

- అమీర్‌పేట వద్ద ముంపునకు అదీ కారణమే..
- గుర్తించిన ప్రభుత్వ విభాగాలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట ముంపు సమస్యకు ఆ ప్రాంతంలోని కల్వర్టులో నిర్మించిన మెట్రో పిల్లర్ కూడా ఓ కారణమేనని అధికారులు నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. ఇప్పటికే హైడ్రా, జీహెచ్ఎంసీ కమిషనర్లు, అధికారులు పలుమార్లు క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఎగువ ప్రాంతాల్లో వరద నీటి కాలువలు కుచించుకుపోవడం, చెరువులు కబ్జాకు గురవడంతో భారీగా దిగువకు వర్షపు నీరు వస్తోందన్న అంచనాకు వచ్చారు. అమీర్‌పేట ప్రధాన రహదారి వద్ద కల్వర్టులూ మూసుకుపోయాయని తాజాగా పరిశీలనలో గుర్తించారు. ఓ కల్వర్టులో మెట్రోస్టేషన్ పిల్లర్ ఉండడం గమనార్హం. దీంతో పిల్లర్ వద్ద చెత్తాచెదారం పేరుకుపోయి వరద ప్రవాహానికి అడ్డుగా మారుతోందని గుర్తించారు. నాలా దిగువకు వెళ్తున్న చోట మైత్రీవనం భవనం ఉండడమూ ముంపునకు కారణంగా తేల్చారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా కల్వర్టుల నిర్మాణంపై దృష్టి సారించనున్నట్టు అధికారులు చెబుతున్నారు. మెట్రో కారిడార్, స్టేషన్ ఉన్న నేపథ్యంలో భూగర్భంలో తవ్వకాలకు అనుమతినిస్తారా.. లేదా..? అన్నది తేలాల్సి ఉంది.

కరెంట్ సీన్ మారింది!

(5వ పేజీ తరువాయి)

వాడే విద్యుత్ యూనిట్‌పై రూ.20 పైసలు పెంచాలన్నా ప్రజాభిప్రాయం సేకరించి ఈఆర్సీ ఆమోదంతో నిర్ణయాలు తీసుకునే విద్యుత్‌శాఖ ఒకేసారి అపార్ట్‌మెంట్ల కనెక్షన్లకు లోడ్ రెట్టింపు చేయడంతో తమపై అదనపు భారం పడుతుందని అపార్ట్‌మెంట్ల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

5 డబుల్ బెడురూమ్‌లున్నా ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్

గృహాల్లో 20 కిలోవాట్ల లోడ్ దాటిన భవనాలకు ప్రత్యేక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవాలనే నిబంధనలున్నాయి. ఒక్కో డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌కు 5కిలో వాట్ల లోడ్ సామర్థ్యంతో కనెక్షన్ తీసుకోవాల్సిందేనని చెబుతుండటంతో 5 డబుల్ బెడ్‌రూం ఫ్లాట్లు కలిగిన ఏ అపార్ట్‌మెంట్‌కు అయినా ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ లెక్కన శివారు ప్రాంతాల్లో వేలసంఖ్యలో నిర్మాణాలు జరుగుతున్న భవనాల్లో 80 శాతం భవనాలకు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేసుకోవాల్సి వస్తుందని సీనియర్ రిటైర్డ్ విద్యుత్ ఇంజనీర్లు చెబుతున్నారు. కొత్త నిబంధనలపై పలువురు బిల్డర్లు సైతం అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

చార్జీల భారం రెట్టింపు

దక్షిణ డిస్కం ప్రస్తుతం 2కిలో వాట్ల కనెక్షన్‌కు రూ.2,625 చార్జీ వసూలు చేస్తోంది. ఒక్కో ట్రిబుల్ బెడ్‌రూమ్‌కు 10కిలో వాట్ల లోడ్‌తో విద్యుత్‌కనెక్షన్ తీసుకోవాలంటే విద్యుత్‌సంస్థకు రూ.12,225 చెల్లించాల్సి వస్తోంది. అంతేకాకుండా కొత్త నిబంధనలతో సమీపంలోని 11కేవీ లైన్ నుంచి అపార్ట్‌మెంట్ వరకు అండర్ గ్రౌండ్ కేబుళ్లు వేసుకోవాల్సి ఉంటుందని, దీంతో లోడ్ చార్జీలతో పాటు, అండర్ గ్రౌండ్ కేబులు చార్జీల భారం రెట్టింపు అవుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రేటర్‌లో క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేపట్టాలని అపార్ట్‌మెంట్ల వినియోగదారులు కోరుతున్నారు.

5 నిమిషాల్లోనే ఖజానా దోపిడీ

- ఇద్దరిని సూరత్‌లో పట్టుకున్న సైబరాబాద్ పోలీసులు
- ఆరుకు చేరిన అరెస్టులు.. పరారీలో మరో నిందితుడు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బీహార్‌కు చెందిన ఏడుగురు సభ్యులున్న ఘరానా దొంగల ముఠా కేవలం 5 నిమిషాల్లోనే ఖజానా జువెల్లరీలో దోపిడీ పూర్తి చేసి, పారిపోయిందని సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి తెలిపారు. ఈ నెల 12న చందానగర్ ఖజానా జువెల్లరీలో జరిగిన దోపిడీ కేసులో.. మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద ఒక తుపాకీ, సుమారు రెండు కిలోల వెండి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను సీపీ అవినాశ్ మహంతి వెల్లడించారు. దోపిడీకి పాల్పడిన దొంగల ముఠాలో ఇప్పటికే అభిషేక్‌కుమార్ సింగ్, దీపక్ కుమార్ సింగ్, అనీష్ కుమార్ సింగ్, ప్రిన్స్ కుమార్ రజాక్‌లను అరెస్టు చేశామని తెలిపారు. వీరి వద్ద నుంచి రెండు తుపాకులు, 1900 గ్రాముల గోల్డ్‌కోటెడ్ వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. తాజాగా మరో ఇద్దరు నిందితులు ప్రిన్స్‌కుమార్ భరాటీ, రోహిత్‌కుమార్ రజాక్‌లను అరెస్టు చేశామని తెలిపారు. ప్రిన్స్‌కుమార్ భరాటీ ఈ ముఠా నాయకుడు కాగా.. రోహిత్‌కుమార్ రజాక్ దోపిడీ సమయంలో ఖజానా డిప్యూటీ మేనేజర్‌పై కాల్పులు జరిపినట్లుగా గుర్తించామని సీపీ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీపీ అవినాశ్ మహంతి

దోపిడీ జరిగిన 24 గంటల్లోనే..

దోపిడీ జరిగిన 24 గంటల్లోనే బీహార్ దొంగల ముఠాను గుర్తించామని, టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా దొంగలను అరెస్టు చేస్తున్నట్లు సీపీ తెలిపారు. దోపిడీ చేసిన అనంతరం బైక్‌లపై పారిపోయిన దొంగలు వివిధ మార్గాల ద్వారా బీదర్ చేరుకున్నారు. అక్కడి నుంచి వారు నాలుగు బృందాలుగా విడిపోగా మొదటిరోజు నగరంలో ఇద్దరిని, పుణేలో ఇద్దరిని పట్టుకున్నామని తెలిపారు. తాజాగా ఇద్దరు నిందితులు సూరత్‌లో ఉన్నట్లు గుర్తించి లోకల్ పోలీసుల సహకారంతో పట్టుకున్నామని తెలిపారు. నిందితులపై హత్య, హత్యాయత్నం, దోపిడీ కేసులు ఉన్నట్లు సీపీ తెలిపారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడని, అతన్ని త్వరలోనే పట్టుకుంటామని సీపీ తెలిపారు.



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ మను చౌదరి

నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి.. శామీర్‌పేట పెద్ద చెరువు పరిశీలన

శామీర్‌పేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసి నిమజ్జనాలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని అధికారులను కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. ఆయన శనివారం శామీర్‌పేట పెద్ద చెరువును అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, డీసీపీ కోటిరెడ్డితో కలిసి సందర్శించారు. అక్కడ నిమజ్జనం ఘాట్‌లను, క్రేన్‌లను ఏర్పాటు చేసే స్థలం, మెడికల్ క్యాంప్ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాట్లపై అధికారుల, సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెరువు వద్దకు వచ్చే భక్తులకు సరిపడా మొబైల్ టాయిలెట్‌లు, అలాగే నాలుగు క్రేన్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే భక్తులు చెరువు దగ్గరికి వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా బారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, వైద్య సదుపాయం, అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. చెరువు పరిసరాల్లో నీటి మట్టం తక్కువ గా ఉన్నందున నీటి మట్టం ఎక్కువగా ఉన్న మధ్య భాగంలో నిమజ్జనానికి తగు ఏర్పాట్లను చేయాలన్నారు. ఆర్‌అండ్‌బీ, పోలీసు, విద్యుత్ శాఖల అధికారుల సమన్వయంతో నిమజ్జన పనులను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి, ఆర్‌అండ్‌బీ అధికారి శ్రీనివాస్, ఇరిగేషన్ అధికారి రాజీవ్‌కుమార్‌సింగ్, ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, శామీర్‌పేట పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, తదితర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నాభిషేకం

కీసర గుట్టలో ముగిసిన శ్రావణ మాసోత్సవం

కీసర, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కీసరగుట్టలోని శ్రీ రామలింగేశ్వర స్వామికి అన్నాభిషేకం ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసం ముగింపు ఉత్సవంలో భాగంగా శనివారం అమావాస్య సందర్భంగా ఉదయం గర్భాలయంలోని మూలవిరాట్‌కు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులకు అభిషేకాలు, అర్చనలకు అనుమతించారు. అనంతరం ఆలయ చైర్మన్, ఫౌండర్ సభ్యులు కలిసి మహా శివునికి తైలాభిషేకం, వరి అన్నంతో అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నాన్ని భక్తులకు ప్రసాదంగా వితరణ చేసి, ఆలయ ద్వార బంధనం చేశారు. శ్రావణ మాసం చివరి రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేయడంతో కీసరగుట్టపై సందడి నెలకొంది.

బసవరాజుపై చర్యలు తీసుకోండి: శ్రీధర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) సహాయ కార్యదర్శి టి.బసవరాజుపై పరస్పర విరుద్ధ ప్రయోజనాల నిబంధన కింద చర్యలు తీసుకోవాలని ఆ సంఘం మాజీ కార్యవర్గ సభ్యుడు చిట్టి శ్రీధర్ కోరారు. శనివారం హైకోర్టు నియమించిన హెచ్‌సీఏ ఏకసభ్య కమిటీ సభ్యుడు, రిటైర్డ్ జస్టిస్ నవీన్‌రావుకు బసవరాజుపై శ్రీధర్ ఫిర్యాదు చేశారు. 2022లో అమీర్‌పేట క్రికెట్ క్లబ్‌లో ఉపాధ్యక్షుడిగా ఉన్న బసవరాజు, 2023-24లో కమర్షియల్ ట్యాక్సెస్ క్రికెట్ క్లబ్‌లో ప్రధాన కార్యదర్శిగా ఉన్నారని, ఈ రెండు క్లబ్‌ల్లో సభ్యుడిగా ఉన్నందున అతడిపై చర్యలు తీసుకోవాలని తన ఫిర్యాదులో శ్రీధర్ పేర్కొన్నారు. బసవరాజు మాదిరి ఒకటి కంటే ఎక్కువ క్లబ్‌ల్లో సభ్యులుగా ఉన్నందునే గతంలో సుప్రీం కోర్టు రిటైర్డ్ జస్టిస్ లావు నాగేశ్వరరావు 57 క్లబ్‌లపై చర్యలు తీసుకున్నారని ఫిర్యాదులో ఆయన ప్రస్తావించారు.

సొంత భవనాలున్న కాలేజీలకే సై

(5వ పేజీ తరువాయి)

నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ ఆచార్యులు లేక, మౌలిక వసతులు చాలక ఇప్పటికే రెండు బ్యాచ్‌ల విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు చూసి ఈ ఏడాది ఆ కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు మొగ్గుచూపలేదు. కంప్యూటర్ సైన్స్ మినహా మిగిలిన కోర్సులలో చేరిన విద్యార్థుల సంఖ్య సింగిల్ డిజిట్‌ను మించలేదు. ఇప్పటికే చేరిన విద్యార్థులకు బీటెక్ సెకండియర్‌లో ల్యాబ్ ప్రయోగాల కోసం, 10కిలోమీటర్ల దూరంలోని ప్రైవేటు కాలేజీలకు వెళ్లాల్సి రావడం విద్యార్థులను, తల్లిదండ్రులను ఆవేదనకు గురిచేస్తోంది. సిరిసిల్ల, వనపర్తి, మహబూబాబాద్, పాలేరు జేఎన్‌టీయూ కాలేజీల్లో మౌలిక వసతులు, ఆచార్యుల నియామకంపై ప్రభుత్వం దృష్టి సారించాలని, సాధ్యంకాని పక్షంలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆయా కాలేజీలను సమీపంలోని జేఎన్‌టీయూ కాలేజీలోకి విలీనం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

జేఎన్‌టీయూ అనుబంధ కాలేజీల్లో మిగిలిపోయిన సీట్ల లెక్క ఇదీ..

జేఎన్‌టీయూ కాలేజీ	మిగిలిన సీట్లు
(సొంత భవనాలున్నవి)	
జగిత్యాల	0(ఒక్క సీటూ మిగల్లేదు)
సుల్తాన్‌పూర్	15(సివిల్ 3, సీఎస్ఈఎస్ఎఫ్ 4, మెకానికల్ 8)
హైదరాబాద్	23 (బయోటెక్నాలజీ 3, జియో ఇన్ఫర్మాటిక్స్ 6, మెటలర్జీ 13, మెకానికల్ 1)
మంథని	34(ఈఈఈ 1, మెకానికల్ 27, మైనింగ్ 6)
(సొంతభవనాలు లేనివి)	
సిరిసిల్ల	223(సీఎస్ఈ 0, సివిల్ 48, ఈసీఈ 10, ఈఈఈ 45, మెకానికల్ 60, ఫుడ్ టెక్నాలజీ 60)
వనపర్తి	223(సీఎస్ఈ 25, సివిల్ 55, ఏఐఎంఎల్ 34, ఈసీఈ 51, మెకానికల్ 58)
మహబూబాబాద్	227(సీఎస్ఈ 28, డేటాసైన్స్ 35, ఈసీఈ 47, ఈఈఈ 58, మెకానికల్ 59)
పాలేరు	233(సీఎస్ఈ 29, డేటాసైన్స్ 39, మెకానికల్ 60, ఈఈఈ 53, ఈసీఈ 52,)

సార్.. ప్రజెంట్!

(5వ పేజీ తరువాయి)

హడావిడిగా వెళ్తున్నారు. గతానికి భిన్నంగా అందుబాటులో ఉన్న రవాణా వ్యవస్థలతో తమ పాఠశాలలకు చేరుకుంటున్నారు.

కొనసాగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ

హైదరాబాద్ జిల్లాలోని 675 స్కూళ్లలో 5,277 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. అలాగే మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని 497 పాఠశాలల్లో 2955 మంది, రంగారెడ్డి జిల్లాలోని 1272 స్కూళ్లలో 6840 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. అయితే, ఆయా జిల్లాల్లో ఇప్పటివరకు 90 శాతం మంది ఎఫ్ఆర్ఎస్‌లో తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోగా.. 10 శాతం మంది చేసుకోలేదు. ఇందులో కొంతమంది విదేశాల్లో ఉండగా.. మరికొందరు అనారోగ్యంతో ఇంటివద్ద ఉన్నారు. ఇంకొందరు సెలవుల్లో ఉండడంతో ప్రక్రియ వందశాతం పూర్తికాని పరిస్థితి నెలకొంది.

సెప్టెంబర్ 1 నుంచి పకడ్బందీగా..

ఎఫ్ఆర్ఎస్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న టీచర్ల హాజరును సెప్టెంబర్ 1 నుంచి పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారులు తెలిపారు. దీంతో ఇప్పటివరకు పాఠశాలలకు ఆలస్యంగా వచ్చే టీచర్లు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. హైదరాబాద్ లాంటి నగరంలో ట్రాఫిక్ సమస్యలుంటాయని, నిర్ణీత సమయానికి హాజరుకాకుంటే ఆబ్సెంట్ వేస్తే తమ పరిస్థితి ఏమిటని వాపోతున్నారు.

జలమండలిలో ఏకమైన కాంగ్రెస్ అనుబంధ సంఘాలు

- **హెచ్ఎండబ్ల్యూ, ఎస్ఎస్‌బీ ట్రేడ్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడిగా రాజిరెడ్డి**

బర్కత్‌పుర, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డ్ ఉద్యోగుల హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించేందుకు యాజమాన్యంతో సమన్వయంగా పనిచేయడానికి కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘాలు ఐఎన్‌టీయూసీ గొడుగు కింద పనిచేయాలని నిర్ణయించామని హెచ్ఎండబ్ల్యూ, ఎస్ఎస్‌బీ ట్రేడ్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ నూతన అధ్యక్షుడిగా మొగుళ్ల రాజిరెడ్డి ప్రకటించారు. నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో శనివారం జరిగిన కాంగ్రెస్ అనుబంధ జలమండలి కార్మిక సంఘాల సమావేశంలో జాయింట్ యాక్షన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా టీపీ రాఘవేంద్రరాజ్, ఎ.శ్రావణ్‌కుమార్, మహమ్మద్ జహంగీర్, బి.దేవేందర్, చంద్రశేఖర్, సయ్యద్ అక్తర్ అలీ, బి.నర్సింగ్‌రావు, ఎం.రాజా, బి.జైరాజ్, సురేష్‌బాబు, కె.రామరాజు, బి.భూమయ్యలను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ, జలమండలి గుర్తింపు సంఘమైన బీఆర్ఎస్ అనుబంధ బీఆర్‌టీయూ నేతల చేతకాని తనం వల్ల ఓవర్‌టైమ్ చేసిన కార్మికులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. అదనంగా పనిచేసిన కార్మికులకు ఓవర్ టైమ్ (ఓటీ) అలవెన్స్ చెల్లించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి జలమండలి ఎండీ దృష్టికి తీసుకెళ్లి త్వరలో ఇప్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

రాజ్యాధికారంతోనే బీసీల సమస్యలకు పరిష్కారం

బర్కత్‌పుర, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారం సాధిస్తేనే బీసీల సమస్యలు పరిష్కారం అవుతాయని బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాండుయాదవ్ అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో అమలు చేయాలని, బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లపై జీవో జారీచేసిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై ఉన్న శ్రద్ధ పాలకులకు బీసీ రిజర్వేషన్లపై లేదని ఆరోపించారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా బీసీని నియమించకపోవడం అత్యంత శోచనీయమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు, బీసీ మహిళలు స్వతంత్రంగా పోటీ చేయడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు సంధ్యారాణి, కాశీనాథ్ ముదిరాజ్, విజయ్, మహేంద్ర, అరుణ్‌కుమార్, దుర్గాప్రసాద్, నర్సింహులు ముదిరాజ్, భీమేష్, రమేష్, ఆంజనేయులు, సురేందర్, వెంకటేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలి

- **టీ పీఆర్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు రవికుమార్**

బర్కత్‌పుర, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రముఖ న్యాయకోవిదుడు, తెలుగు బిడ్డ, సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి రెండు తెలుగు రాష్ట్రాలు, దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు రాజకీయాలకతీతంగా ఓటు వేసి గెలిపించాలని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్ పిలుపునిచ్చారు. ఉప రాష్ట్రపతిగా విజయం సాధిస్తే తెలుగుతేజం విరాజిల్లుతోందన్నారు. ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. శనివారం బషీర్‌బాగ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నీతి, నిజాయితీ, న్యాయబద్ధతకు జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి నిలిచారని, తెలుగు ప్రజలు ఆయన విజయాన్ని ఆకాంక్షిస్తున్నారని అన్నారు. టీ పీఆర్‌పీ జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు తెలుపుతోందని, ఎంపీలంతా ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

- **జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్**

బర్కత్‌పుర, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ.8,500కోట్లు ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. 14 లక్షల మంది విద్యార్థులు ఈ బకాయిల కోసం ఎదురుచూస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. మోతీ మార్కెట్‌లోని మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడం వల్ల కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు రూ. 5 వేల నుంచి 20 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. 20నెలల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



- పార్కి స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ వ్యవస్థాపకురాలు డాక్టర్ సాయి జీవన శనివారం రాత్రి ఆబిడ్స్‌లోని భారతీయ విద్యా భవన్‌లో భరతనాట్య ప్రదర్శన చేశారు. 'హరి-హర-ఏకం సత్ విప్రా బహుధా వదంతి' నేపథ్యంతో నిర్వహించిన ఈ ప్రదర్శనను 'తాయే త్రిపురసుందరి' అనే కీర్తనతో ప్రారంభించారు. తర్వాత, విష్ణుమూర్తి, శ్రీమహాలక్ష్మికి అంకితమైన మధుర కీర్తనలకు ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.
హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి)

విభిన్న మానవ మనస్తత్వాలు, సామాజిక సమస్యలే రచనల ఇతివృత్తం

రవీంద్రభారతి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మన చుట్టూ ఉన్న సమాజం, మనుషుల స్వభావాలు, సంబంధాలు, మానవ విలువలు, సామాజిక సమస్యలు, అంతర్ బహిర్ సంఘర్షణలు తన రచనలకు ఇతివృత్తాలని సుప్రసిద్ధ సాహితీవేత్త కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత సయ్యద్ సలీం అన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతి సమావేశ మందిరంలో రచయిత సయ్యద్ సలీంతో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ, తన జీవితంలో ఆకలి, అనుమానాలు నేర్పిన పాఠాలే సాహితీ సృజనకు పునాదులుగా మారాయని తెలిపారు. ఓ కుగ్రామంలో నిరుపేద, నిరక్షరాస్యులైన ముస్లిం దంపతులకు పుట్టిన తాను ఈ స్థాయికి చేరుకోవడానికి చాలా పోరాటాలు చేయాల్సిన వచ్చిందని అన్నారు. మొదట కవిత్వంతో మొదలైన సాహితీ ప్రస్థానం తర్వాత కథలతో, నవల వరకు విస్తరించింది. ఇప్పటి వరకు మూడు కవితా సంపుటాలు, పన్నెండు కథా సంపుటాలు, ముప్పై ఏడు నవలలు వెలువరించానని తెలిపారు. ఇంగ్లీష్, హిందీ, కన్నడ, తమిళం, మళయాళం, మరాఠి, ఒరియా భాషల్లో 69 పుస్తకాలు అనువాదమయ్యాయని తెలిపారు. సభా ప్రారంభంలో కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యులు, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ఎస్వీ సత్యనారాయణ రచయితను సభికులకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సి.మృణాళిని, కరిమిండ్ల లావణ్య, నాళేశ్వరం శంకరం, డా.ఎస్.రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్మికుడు బీమా కార్డులు తీసుకోవాలి

రాజేంద్రనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ, ఇతర నిర్మాణ రంగాల్లో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు కార్మిక శాఖ అందజేసే ఇన్సూరెన్స్ కార్డులను తప్పని సరిగా తీసుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుంకర రామ్మోహన్ తెలిపారు. బుద్వేల్, శివరాంపల్లి యూనిట్‌ల భవన నిర్మాణ కార్మిక సంఘాల మహా సభలు శనివారం కార్మిక నాయకుడు బచ్చల కూర స్వామి అధ్యక్షతన జరిగాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు సుంకర రామ్మోహన్ ప్రసంగించారు.

బుద్వేల్ యూనియన్ కమిటీ అధ్యక్షుడిగా శ్రీపాల్‌రెడ్డి

బుద్వేల్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడిగా శ్రీపాల్‌రెడ్డి నియమితులయ్యారు. కార్యదర్శిగా జూట్కూర్ మణ్యం, కోశాధికారి కప్పెట రాజు, ఉపాధ్యక్షులుగా యాదయ్య, రంగస్వామీ, చంద్రశేఖర్, సహాయ కార్యదర్శులు నర్సింగ్, ఈరపోగు స్వామి, వినయ్ కుమార్, మహిళ ఉపాధ్యక్షురాలు కవిత, కప్పెట రాధను ఎన్నుకున్నారు.

శివరాంపల్లి కమిటీ అధ్యక్షుడిగా పి.శ్రీనివాస్

శివరాంపల్లి భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడిగా పి.శ్రీనివాస్, కార్యదర్శిగా రేక్యా నాయక్, కోశాధికారిగా కె.శంకర్, ఉపాధ్యక్షుడిగా రామేశ్వరం అరవింద్, ఆకుల యాదయ్య, వేముల సత్యం, నేనావత్ తిరుపతి, సహాయ కార్యదర్శులుగా కె.ప్రభాకర్, బానోత్ శంకర్, ఆకుల చంద్రకళ, కావలి అమృతను ఎన్నుకోవడం జరిగింది. వట్టెపల్లి అధ్యక్షుడిగా రాముగౌడ్, కార్యదర్శిగా గోపాల్, ఉపాధ్యక్షులుగా సతీష్, కోశాధికారిగా చాంద్ పాష, గౌరవ అధ్యక్షులుగా అక్రమ్, రహీమ్‌ను ఎన్నుకున్నారు. వెంకటయ్య, విజయ్‌కుమార్, బుగ్గయ్య, గడ్డి యాదయ్య, తిమ్మప్ప, బాలస్వామి, జయేందర్, సావిత్రమ్మ, ఆంజనేయులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు సిద్ధం

- **సిద్ధమవుతున్న మండపాలు**
- **నిర్వాహకులతో పోలీసుల సమావేశాలు**

చాంద్రాయణగుట్ట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27న వినాయక చవితిని పురస్కరించుకొని పాత బస్తీలో మండపాల ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. కాలనీలు, బస్తీల్లో గణేష్ మండపాల నిర్మాణాలు దర్శనమిస్తున్నాయి. యువకులు గణనాథులను మండపాలకు తీసుకొస్తున్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి పలు సూచనలు, సలహాలు చేస్తున్నారు.

- ఛత్రినాక ఏసీపీ డివిజన్ పరిధిలోని ఛత్రినాక, శాలిబండ, మొగల్‌పురా పోలీస్‌స్టేషన్ల పరిధిలో అత్యధిక మండపాలు ఉండడంతో దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా, ఏసీపీ చంద్రశేఖర్ ప్రత్యేక దృష్టి సారించి సమావేశాలు నిర్వహిస్తున్నారు. మండపాల నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు.



అమ్మకానికి ఉన్న వినాయక ప్రతిమలు

ఛత్రినాకలో అధిక సంఖ్యలో మండపాలు



ఛత్రినాక ఏసీపీ డివిజన్ పరిధిలో సుమారు వెయ్యి గణేష్ మండపాలు ఉంటాయి. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం. మండపాల నిర్వాహకులకు సూచనలు, సలహాలు చేస్తున్నాం. నిర్వాహకులు, ప్రజలు పోలీస్‌శాఖకు సహకరించి ఉత్సవాలు శాంతియుతంగా జరిగేలా తోడ్పాటునందించాలి.

- చంద్రశేఖర్, ఏసీపీ, ఛత్రినాక

భక్తిభావంతో ఉత్సవాలు జరుపుకోవాలి



ఉత్సవాలను భక్తి భావంతో జరుపుకోవాలి. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మండప నిర్వాహకులకు తోడుగా ఉండి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అండగా ఉంటుంది. అన్ని శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు తలెత్తకుండా చూస్తున్నాం.

- కొడి మహేందర్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శి

అనంత చతుర్ధశిలోపు నిమజ్జనం చేయాలి



11 రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి అనంత చతుర్ధశి తిథిలోపు నిమజ్జనం చేయాలి. ఈ సంవత్సరం గ్రహణం వస్తున్నందున సమయంలోపు నిమజ్జనం పూర్తి చేసుకోవాలి.

- సీహెచ్ రూప్‌రాజ్, సెంట్రల్ కమిటీ సభ్యుడు

డీజేలకు అనుమతి లేదు



గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదు. పోలీస్ స్టేషన్ పరిధిలోని డీజే నిర్వాహకులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. మండపాలు, నిమజ్జనాలలో డీజేలను వాడవద్దు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కేసులు తప్పవు.

- కె.నాగేంద్ర ప్రసాద్ వర్మ, ఛత్రినాక ఇన్‌స్పెక్టర్

నిబంధనలు పాటించాలి

పహాడిషరీఫ్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని మహేశ్వరం జోన్ ఏసీపీ జానకిరెడ్డి అన్నారు. తుక్కుగూడలోని సత్యనారాయణ ఫంక్షన్‌హాల్‌లో గణేష్ మండపాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేష్ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో పహాడిషరీఫ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్‌రెడ్డి, ఎస్ఐ దయాకర్‌రెడ్డి, తుక్కుగూడ పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేశ్వరం జోన్ ఏసీపీ జానకిరెడ్డి



మాట్లాడుతున్న దక్షిణ మండలం డీసీపీ స్నేహామెహ్రా

వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీలను ప్రశాంతంగా జరుపుకోవాలి

చార్మినార్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి, మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఇందుకు కేంద్ర శాంతి, సంక్షేమ సంఘం సభ్యులు సహకరించాలని దక్షిణ మండల డీసీపీ స్నేహా మెహ్రా కోరారు. వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం మీరాలౌక్ సంజరి ఫంక్షన్ హాల్‌లో సౌత్ జోన్ కేంద్ర శాంతి, సంక్షేమ సంఘం (సౌత్‌జోన్ సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డీసీపీ స్నేహ మెహ్రా హాజరై మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణ పోలీసుల బాధ్యతన్నారు. అనుమానాస్పద విషయాలను వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ మహ్మద్ మజీద్, కేంద్ర శాంతి సంఘం ప్రతినిధులు హఫీజ్ ముజఫర్‌ఆలీ ఖాన్ బందనవాజీ, ఖాజా అబ్దుల్ మొయిజ్, ఏసీపీలు పి.చంద్రశేఖర్, ఎంఏ జావీద్, శ్యామ్ సుందర్, సీహెచ్.చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్లు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



- గణేష్ నవరాత్రి ఉత్సవాలు, మీలాద్ ఉన్ నబీ పండుగలను పురస్కరించుకుని దక్షిణ మండలం పోలీసులు ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రాను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీస్ కమిటీ సభ్యులు కాశమోని శ్యామ్‌రావు ముదిరాజ్, దూసరి నర్సింగ్ గౌడ్, వి.సత్యనారాయణ, రామరాజు తదితరులు

- చాంద్రాయణగుట్ట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి)

సీవీ ఆనంద్‌కు వినతి

అఫ్జల్‌గంజ్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 46వ సామూహిక గణేష్ నిమజ్జనం ఉత్సవాలు విజయవంతం అయ్యేందుకు పోలీస్ శాఖ నుంచి తగి న ఏర్పాట్లు చేయాలని ఉత్సవ సమితి ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శనివారం వారు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీని కలిసనవారిలో ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావినూతన శశిధర్, సెక్రెటరీ బుచ్చిరెడ్డి, గౌరవ సలహాదారులు ఎం.రామరాజు, ఆలే భాస్కర్ రాజ్‌తోపాటు కోశాధికారి శ్రీరామ వ్యాస్, మహేందర్, జి.రమేశ్, ఉపాధ్యక్షుడు మెట్టు వైకుంఠం ఉన్నారు.



పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌కు వినిపత్రం అందజేస్తున్న భాగ్యనగర్ ఉత్సవ సమితి ప్రతినిధులు

భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షుడిగా గోవింద్ రాఠీ



భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షుడిగా గోవింద్ రాఠి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం గోవింద్‌రాఠీకి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు జి.రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావినూతల శశిధర్, ఆలే భాస్కర్‌రాజ్, సంజయ్ ఘనాటే పాల్గొన్నారు.

- గోషామహల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి)



- సుల్తాన్‌బజార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతోష్ గుప్తా తదితరులు ఏసీపీ మట్టయ్యకు ఏకో గణపతిని అందజేశారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులు మేలు అని వారు అభిప్రాయపడ్డారు.

- అఫ్జల్‌గంజ్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి)

షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నార్సింగ్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆసిఫ్‌నగర్ మండల కార్యాలయంలో అర్హులైన లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను శనివారం కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్ మొహియుద్దీన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రూ.1,06,12,296లు లబ్ధిదారులకు అందజేశామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో సర్టిఫికెట్ కోర్సు

మదీన, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): హుసేనిఆలం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ప్రత్యామ్నాయ వివాద పరిష్కారం' అనే సర్టిఫికెట్ కోర్సును శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి డాక్టర్ ఎహసాన్ అలీ హమూమి, హైకోర్టు అడ్వకేట్ బర్కత్ అలీఖాన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ కోర్సువల్ల విద్యార్థులకు చట్టాలు, న్యాయ సూత్రాలపై అవగాహన ఏర్పడుతోందన్నారు. కోర్టు బయట ఎలా పరిష్కరించుకోవాలి, ఇరు వర్గాలకు కావాల్సిన న్యాయ సహాయం ఎలా పొందాలనే అంశాలపై ఈ కోర్సు ద్వారా అవగాహన కలుగుతుందన్నారు. విద్యార్థులకు చట్టపరమైన, సామాజిక సమస్యలపై అవగాహన కల్పించడం ఈ సర్టిఫికెట్ కోర్సు లక్ష్యమని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ గౌస్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె.శ్రీదేవి, డాక్టర్ పి.లత, డాక్టర్ జీహెచ్ అనురాధ, డాక్టర్ కె.శ్రీకాంత్, డాక్టర్ ఫర్హానా సుల్తాన, జొహ్రా జబీన్ తదితరులు పాల్గొన్నారు.

లాల్‌దర్వాజ అమ్మవారిని దర్శించుకున్న పోలీసులు

చాంద్రాయణగుట్ట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారికి శనివారం ఛత్రినాక ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర ప్రసాద్ వర్మతోపాటు ఎస్ఐలు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ బి.మారుతీ యాదవ్, మాజీ చైర్మన్ కె.వెంకటేశ్ పోలీస్ అధికారులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కోశాధికారి చంద్రకుమార్, ప్రతినిధులు ప్రకాశ్, విఠల్, యశ్వంత్‌గౌడ్ పాల్గొన్నారు.

'ఆలయానికి స్థలం కేటాయించాలి'

పహాడిషరీఫ్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ మామిడిపల్లిలోని రంగనాయకుల కాలనీలో ప్రాచీనమైన ఈదమ్మ ఆలయానికి స్థలం కేటాయించాలని శనివారం మాజీ కార్పొరేటర్ యాతం పవన్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో బస్తీవాసులు జిల్లెలగూడలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. తమ వినతి పట్ల సబితా ఇంద్రారెడ్డి సానుకూలంగా స్పందించారని పవన్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటయ్య, గండికోట రాము, ఓర్సు శ్రీను, అరుణ్, వంశీ పాల్గొన్నారు.

'పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'

నార్సింగ్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రతి కార్మికుడు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్ అన్నారు. శనివారం గండిపేట్ మండల పరిధిలోని భవన నిర్మాణ కార్మిక సంఘాల మహాసభ కాళీమందిర్ అడ్డాలో నిర్వహించారు. బీసీడబ్ల్యూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు బచ్చలకూర స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి కార్మికుడు లేబర్ ఇన్సూరెన్స్ కార్డులు చేయించుకోవాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.అశోక్, కార్యదర్శిగా నడిమిగిరి ఇంద్రప్ప, కోశాధికారిగా మధు, ఉపాధ్యక్షులుగా కురువ ఉసేనప్ప, సహాయ కార్యదర్శిగా గుండ్లపల్లి వెంకటప్ప, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో లేబర్ కార్మికులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

- **ఆమ్ ఆద్మీ నాయకులు**

రాజేంద్రనగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ హసన్‌నగర్‌లో జలమండలి కార్యాలయం వద్ద ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. హసన్‌నగర్ ప్రాంతంలోని నాలాలను శుభ్రం చేయాలన్నారు. వర్షాకాలంలో రోడ్డుపై పారుతోందని, ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. డ్రైనేజీ నుంచి తొలగించిన వ్యర్థ పదార్థాలను, మట్టిని అక్కడి నుంచి వెంటనే తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు హెమా జిల్లోజు, తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

- **వ్యవసాయ వర్సిటీ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు**

రాజేంద్రనగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఐదు సంవత్సరాలు ఎంపీ, ఎమ్మెల్యేలుగా పనిచేస్తున్న ప్రజా ప్రతినిధులకు జీవితాంతం పెన్షన్ ఇస్తున్న ప్రభుత్వం నలభై సంవత్సరాలు ప్రభుత్వ ఉద్యోగం చేసే వారికి పెన్షన్ ఇవ్వకపోవడం బాధాకరమని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘం నాయకులు ధ్వజమెత్తారు. తెలంగాణలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం భోజన విరామ సమయంలో వర్సిటీలోని ప్రొఫెసర్ జయశంకర్ ప్రాంగణం వద్ద ఉద్యోగులు, అధ్యాపకులు, పెన్షనర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అగ్రికల్చరల్ సైంటిస్ట్ అసోసియేషన్(టాసా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కె.పవన్ చంద్రారెడ్డి, డాక్టర్ సల్లా సౌజన్య, మాజీ అధ్యక్షుడు డాక్టర్ బి.విద్యాసాగర్, వర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఆల్ యూనివర్సిటీస్ ఫెడరేషన్ చైర్మన్ ఎం.శ్రీనివాస్ యాదవ్, వర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.జయరాం, సంయుక్త కార్యదర్శి జి.వరమేశ్, ఉద్యోగ సంఘం మాజీ నేత, కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఏ నయీమ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణలో అధికారంలోకి వస్తే ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని చెప్పిందని గుర్తు చేశారు. దాని ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అములు చేయాలన్నారు.



భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు, అధ్యాపకులు

2019 నుంచి..

సీపీఎస్ ఉద్యోగులకు 2019 నుంచి కేంద్ర ప్రభుత్వ వాటాగా 14 శాతం ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వ వాటాగా కూడా 14 శాతం ఇవ్వాల్సి ఉండగా, కేవలం 10 శాతమే ఇస్తోందని, 2019 నుంచి రావాల్సిన మిగతా నాలుగు శాతం కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలన్నారు.

ప్రభుత్వాలు ఉద్యోగ వ్యతిరేక విధానాలను అవలంబించకూడదన్నారు. పాత పెన్షన్ విధానం సాధనకు ఉద్యోగులతో సెప్టెంబర్ 1న పెద్ద ఎత్తున నిరసన తెలుపనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు ఎం.రాజు, షేక్ నజీర్, ఎస్.యాదయ్య ముదిరాజ్, టాసా ప్రతనిధులు డాక్టర్ జె. కమలాకర్, డాక్టర్ రమేశ్, డాక్టర్ పి.ప్రశాంత్, విశ్రాంత ఉద్యోగ సంఘం నాయకులు జి. అంజయ్య గౌడ్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు టీపీయూఎస్ వినతి

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీపీయూఎస్ ప్రతినిధులు కె.హనుమంతురావు, కోట్ల కాశీరావు, ఎం.బాలక్రిష్ణ, జి.బాలక్రిష్ణ, విజయమ్మ, శ్రీకాంత్, మోహన్ కలిసి రాజేంద్రనగర్ తహసీల్దార్ బి.రాములుకు వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తమకు పాత పెన్షన్ విధానం అమలు జరుగుతోందని, ఎంతో సంతోషపడ్డామని, నేటికీ అమలు కాకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినప్పటికీ ఇంకా అమలు చేయకపోవడం బాధాకరమన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/TDo9df8లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

సంక్షేమ వసతి గృహాల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

రాజేంద్రనగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని ఎస్సీ బాలురు, బాలికలు, బీసీ బాలికల సంక్షేమ వసతి గృహాలలో శనివారం పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. వసతి గృహాలలో సౌకర్యాలు ఎలా ఉన్నాయి.. పరిశుభ్రత పాటిస్తున్నారా... విద్యార్థులకు పెట్టే ఆహారం బాగుందా అనే వాటిని పరిశీలించారు. సివిల్ సప్లై విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ సూర్యనారాయణ, డీఎస్పీ ఎ.రమేశ్, డిప్యూటీ తహసీల్దార్ రామక్రిష్ణ, రమణ, క్రిష్ణ, మోహినుద్దీన్ వసతి గృహాలలోని మరుగుదొడ్లను పరిశీలించారు. ఎస్సీ బాలుర వసతి గృహంలో 430 కిలోల బియ్యం తక్కువగా ఉన్నట్టు విజిలెన్స్ అధికారుల విచారణలో తేలింది. ఈసందర్భంగా అడిషనల్ ఎస్పీ సూర్యనారాయణ మాట్లాడుతూ, ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఇప్పటి వరకు 10 సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేశామన్నారు. త్వరలో రంగారెడ్డి జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేస్తామన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు సరిగ్గా అందుతున్నాయా లేదా అని చూడటానికి ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు.

బంగారు గీత నవల ఆవిష్కరణ

రవీంద్రభారతి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మానవ సమాజంలోని మంచి, చెడులను విశ్లేషిస్తూ రచనలు రావడం అభినందనీయమని విశ్రాంత ఐఏఎస్ డా.కే.వి.రమణాచారి అన్నారు. శనివారం ఏ.సీ. గార్డ్స్‌లోని రమణాచారి క్యాంప్ ఆఫీస్‌లో కమలా కృష్ణ కళాకౌముది సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో వీరపూర్ణచందర్ రచించిన బంగారు తీగ నవల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రమణాచారి పుస్తకాన్ని ఆవిష్కరించి రచయితను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బంగారు తీగ పుస్తకం ప్రతి ఒక్కరూ చదవాల్సిన అవసరముందని అన్నారు. చక్కటి భాషలో అందరికీ అర్థమయ్యే రీతిలో పుస్తకాన్ని రచించారని అన్నారు. ఇలాంటి నవలలు రావాల్సిన అవసరముందని అన్నారు. డా.బ్రాహ్మణపల్లి జయరాములు సభాధ్యక్షత వహించిన పొత్తూరి సుబ్బరావు, పొత్తూరి జయలక్ష్మి, గురజాడ శోభాపేరిందేవి, వీరఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రమణాచారి తదితరులు

ధూల్‌పేటలో ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ ధూల్‌పేటలో భాగంగా వరుస దాడులు నిర్వహిస్తున్న ఎస్‌టీఎఫ్ సిబ్బంది గంజాయి విక్రయిస్తున్న ఇద్దర్ని అరెస్ట్ చేశారు. వారి నుంచి 1.7 కిలోల గంజాయి, బైక్, స్వాధీనం చేసుకున్నారు. ధూల్‌పేట దిల్వార్‌గంజ్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న మహేశ్వరి అనే మహిళను అరెస్ట్ చేశారు. ఆమె నుంచి 1.30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మలక్‌పేట్‌లోని మాదన్నపేట్‌లో గంజాయి అమ్ముతున్న రహీమ్‌ను అరెస్ట్ చేసి 400గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

రాజేంద్రనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఏడుగురు పేకాట ఆడుతుండగా పోలీసులు నలుగురిని పట్టుకున్నారు. మరో ముగ్గురు తప్పించుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 22న రాత్రి మైలార్‌దేవుపల్లి పరిధిలోని అలీనగర్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో సైబరాబాద్ ఎస్ఓటీ టీమ్, మైలార్‌దేవుపల్లి పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో పేకాట ఆడుతున్న ఆసిఫ్‌నగర్ మంగళహాట్‌కు చెందిన వ్యాపారి ఎండీ ఫరీద్(45), రాజేంద్రనగర్‌కు చెందిన వ్యాపారి మహ్మద్ ఖుర్రమ్(43), అత్తాపూర్‌కు చెందిన వ్యాపారి సయ్యద్ అయ్యూబ్(42), చాంద్రాయణగుట్ట, బండ్లగూడకు చెందిన వాచ్‌మన్ ఎ.శివ (29)ను అరెస్ట్ చేశారు. బేగంబజార్‌కు చెందిన ఎండీ రహమాన్, మల్లెపల్లి కి చెందిన ఎండీ ఇర్ఫాన్, మహ్మద్ అనే వ్యక్తులు తప్పించుకున్నారు. వీరి నుంచి రూ.19,500, నాలుగు స్మార్ట్ ఫోన్‌లు, రెండు ద్విచక్ర వాహనాలు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

చిన్నప్పటి నుంచే క్రీడలపై ఆసక్తిని పెంచాలి

● మంత్రి వాకిటి శ్రీహరి

గచ్చిబౌలి, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచే క్రీడలపట్ల ఆసక్తి కలిగించే విధంగా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాటికి శ్రీహరి అన్నారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శనివారం నుంచి 9 రోజుల పాటు జరిగే జాతీయ క్రీడా ఉత్సవాలను స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో క్రీడల పట్ల వసక్తి కలిగించడం, వారిని మైదానాల వైపు ప్రోత్సహించడం , కుటుంబాలకు మాత్రమే కాకుండా దేశానికి, సమాజానికి ఎంతో శ్రేయస్కరమన్నారు. చిన్నప్పటి నుంచే క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్, అనిత, పీఆర్ఓ సురేష్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి టగ్‌ఆఫ్ వార్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో రిషి గ్రూప్ చైర్మన్ డాక్టర్ ఎస్ జిలానీ, సెక్రటరీ రాజశ్రీలు

టగ్ ఆఫ్ వార్ పోటీలకు 'రిషి' విద్యార్థులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నేషనల్ టగ్ ఆఫ్ వార్ చాంపియన్ షిప్ పోటీల్లో రిషి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 9 మంది విద్యార్థినులు ఎంపిక కావడం పట్ల రిషి గ్రూప్ చైర్మన్ డాక్టర్ ఎస్ జిలానీ, సెక్రటరీ రాజశ్రీలు శనివారం హర్షం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి 25 వరకు 27వ సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్, 38వ జూనియర్ గర్ల్స్, సీనియర్ ఉమెన్.. పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు తెలంగాణ టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులను చైర్మన్ ఎస్ జిలానీ, సెక్రటరీ రాజశ్రీ, ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్‌లు జ్యోతిలు అభినందించారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై సమీక్ష

హైదరాబాద్ సిటీ, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): వచ్చే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రీత్యా స్థానిక పరిస్థితులపై శనివారం ప్రజాభవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి, ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్ పెరుమాళ్ సమీక్షించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామిలతో పాటు జూబ్లీహిల్స్ ఇన్‌చార్జీలుగా ఉన్న పలు కార్పొరేషన్ల చైర్మన్‌లకు ఈ ఎన్నికలో వ్యవహరించాల్సిన వ్యూహంపై దిశా నిర్దేశం చేశారు.



రెండు లక్షల ప్రతిమల పంపిణీకి సమాయత్తం

జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో 2 లక్షల మట్టి గణపతి ప్రతిమల పంపిణీకి రంగం సిద్ధమైంది. ఆ మేరకు శనివారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రతిమల పంపిణీని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ప్రారంభించారు. సంస్థలోని ఉద్యోగులకు ప్రతిమలు అందజేశారు. పర్యావరణ పరిరక్షణకు మద్దతుగా గణేష్ నవరాత్రోత్సవాలు జరుపుకోవాలని వారు సూచించారు. వార్డులవారీగా మట్టి ప్రతిమల పంపిణీ ఉంటుందన్నారు.

- హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి)

సమస్యలు పరిష్కరించండి

ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జేఏసీ చైర్మన్ విక్రమ్‌కుమార్, కన్వీనర్ కృష్ణయాదవ్ కోరారు. శనివారం జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో కార్యదర్శి శ్రీనివాస్. టీజీఓ కార్యదర్శి ఎంఏ ఖాదర్, కేంద్ర సంఘ నాయకులు కోటాజీ. హైదరాబాద్ జేఏసీ నాయకులు నర్సింగరావు ఆశన్న, రాజేందర్, వెంకటరమణారెడ్డి, డాక్టర్ రవికుమార్, నర్సింహులు, రమణ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

- హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి)





ఆవిష్కరణ

అత్యాధునిక ప్యాడీ, రైస్ మిల్లింగ్ టెక్నాలజీ ఐమాస్ సహా పలు ఉత్పత్తులను శనివారం ఆవిష్కరించారు. వాటిని ఏపీఐటీ మెషినరీ ప్రైవేట్ లిమిటెడ్ అందుబాటులోకి తీసుకొస్తున్నది. కార్యక్రమంలో పాల్గొని వాటిని తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పలువురు రైస్ మిల్లర్స్ ఆవిష్కరింపజేశారు. ఏపీఐటీ చైర్మన్ రవీంద్రనాథ్ రామయ్య, ఏపీఐటీ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ శశికుమార్ తిమ్మయ్య, వైస్ చైర్మన్ రాజేంద్ర జోగి తదితరులు పాల్గొన్నారు.

- (స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి)

పర్యావరణహిత నగరంగా హైదరాబాద్

ఆ దిశగా తీర్చిదిద్దుతాం

● పెద్దెత్తున చెరువులను పునరుద్ధరిస్తున్నాం

● దక్షిణ మండలి సమావేశంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. ఈ క్రమంలో చెరువుల పునరుద్ధరణను పెద్ద ఎత్తున చేపడుతున్నామన్నారు. పర్యావరణ హితమైన నగరాల అభివృద్ధిని కాంక్షిస్తూ 'బయోఫిలిక్ అర్బనిజం' వైపు అనుసరించాల్సిన విధానాలు, వ్యూహాలు పేరుతో శనివారం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఇండియా ఏర్పాటు చేసిన దక్షిణ మండలి సమావేశంలో హైడ్రా ఉద్దేశాలను ఆయన వివరించారు. నగరంలో గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించి వరదల నివారణతో పాటు.. పర్యావరణ హితమైన నగరంగా తీర్చిదిద్దేందుకు తమ వంతుగా ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈక్రమంలో చెరువులు, నాలాల ఆక్రమణలను తొలగించడంతో పాటు విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రధాన కర్తవ్యం అయినప్పటికీ చెరువుల పునరుద్ధరణ, కాలుష్య నివారణ అంశాలపై తాముూ దృష్టి పెట్టాల్సి వస్తోందన్నారు. ఈ క్రమంలోనే 500 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడామని, పార్కులను పునరుద్ధరించామన్నారు. నగరంలో ఉన్న చెరువులన్నింటినీ పర్యావరణ కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామని కమిషనర్ చెప్పారు. వివిధ రాష్ట్రాలకు చెందిన టౌన్ ప్లానింగ్ అధికారులు, ఆర్కిటెక్ట్ ఇంజినీర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

'ప్రభుత్వం మాలల గొంతు కోసింది'

పంజాగుట్ట, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఇచ్చిన గైడ్ లైన్స్ పాటించకుండా రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాలల గొంతు కోసిందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆరోపించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, నాయకులతో ఆయన మాట్లాడారు. దళితులలోని 41 కులాల వారికి అన్యాయం చేసేలా రోస్టర్ పాయింట్లను కేటాయించిందన్నారు. నవంబరు 2వ తేదీలోగా రోస్టర్ పాయింట్లను సవరించని పక్షంలో ఇదే రోజు చలో హైదరాబాద్ పేరుతో లక్షలాది మందితో మాలల రణభేరి సభ నిర్వహిస్తామని హెచ్చరించారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

గోల్నాక, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులు చదువుతారనే భావనను విడనాడి పట్టుదల క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నతస్థాయికి ఎదగాలని విద్యార్థులకు కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి హితబోధ చేశారు. శనివారం గోల్నాక డివిజన్ తులసీరాంనగర్(లంక)లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాదరక్షలను వారికి పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత విద్యను అభ్యసించిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని, వారు చక్కటి విద్యాబోధనను చేస్తారని కిషన్‌రెడ్డి అన్నారు. విద్యార్థులు తాము పేదలం అనే భావనలో ఉండవద్దని శ్రద్ధతో క్రమశిక్షణతో, పట్టుదలతో చదువుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రమంత్రిగా ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతి విషయంలో తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలోని ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతి కోసం కృషిచేస్తానన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం తాను అన్ని చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఉపాధ్యాయులు కూడా ఉత్తమ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎస్.గౌతమ్‌రావు, కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్, పార్టీ డివిజన్ అధ్యక్షుడు సూదగాని శ్రీధర్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేసరి నర్సింగ్‌రావుయాదవ్, పార్టీ నేతలు ఎం.సామ్రాజ్, కన్నె రమేష్‌యాదవ్, ఎక్కాల నందు, వై.దామోదర్‌నాయుడు, కె.రాంచందర్, మహ్మద్ సలీమ్, గాజుల గోపాల్, టి.శ్రీరామ్, బి.ఈశ్వర్‌రావు, సునీల్, బద్రి, కె.శ్రీకాంత్, రాకేష్, బస్వరాజ్, రాజు, సూర్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థికి పాదరక్షలు పంపిణీ చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ఆకాశవాణి విశ్రాంత అధికారి రామస్వామి కన్నుమూత



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆకాశవాణి వ్యవసాయ కార్యక్రమాల విభాగం విశ్రాంత అధికారి దేవరకొండ రామస్వామి (88) కన్నుమూశారు. వయసు రీత్యా తలెత్తిన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన శనివారం హబ్సీగూడాలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. 1971లో ఆకాశవాణిలో ఫీల్డ్ అసిస్టెంట్ గా చేరి, 1995లో ఫార్మ్ రేడియో అధికారిగా ఉద్యోగ విరమణ చేశారు. రేడియో స్టేషన్లలోని వ్యవసాయ అనుబంధ కార్యక్రమాల విభాగంలో విశిష్ట సేవలు అందించారు. ఆయన అంత్యక్రియలు ఆదివారం ఉదయం హబ్సీగూడా శ్మశాన వాటికలో నిర్వహిస్తామని రామస్వామి కుమారుడు లక్ష్మణ్ తెలిపారు. ఆకాశవాణి, దూరదర్శన్ సిబ్బంది, పలువురు సంతాపం తెలిపారు.

రాహుల్‌గాంధీ... ఉద్యమానికి మద్దతు ఇవ్వాలి

● దేశపౌరులకు వి.హనుమంతరావు పిలుపు

రాంనగర్/అంబర్‌పేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకోవడానికి పార్లమెంటరీ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటానికి దేశ పౌరులందరూ మద్దతు ఇవ్వాలని ఏఐసీసీ నాయకుడు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు పిలుపునిచ్చారు. రాహుల్‌గాంధీ చేపట్టిన ఓటు బచావో యాత్రకు మద్దతుగా శనివారం అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తా నుంచి పటేల్‌నగర్ వరకు ఓటు బచావో ర్యాలీ జరిగింది. బిహార్‌లో 65 లక్షల ఓట్లను అక్రమంగా తొలగించారని, అక్కడ బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ రోహిణ్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు జాహేద్‌ఖీన్ అఫ్సర్, ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు పులి జగన్, దిడ్డి రాంబాబు, గడ్డం శ్రీధర్‌గౌడ్, కోటం అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఎగుమతులకు ప్రాధాన్యం

హైదరాబాద్ సిటీ , ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో పశుపోషణ, వ్యవసాయ రంగాల వృద్ధికి రోడ్ మ్యాప్‌తోపాటు వ్యవసాయ ఎగుమతులకు ప్రాధాన్యం ఇవ్వడమే లక్ష్యం అని వక్తలు తీర్మానించారు. కాంపౌండ్ లైవ్‌స్టాక్ ఫీడ్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (క్లాఫ్మా) ఇండియా రెండు రోజులుగా నిర్వహిస్తున్న 66వ జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. బంజారాహిల్స్‌లోని తాజ్‌దక్కన్ హోటల్‌లో కార్యక్రమం నిర్వహించారు. 'భారతదేశంలో పశు పోషణ- ముందుకు వెళ్లే మార్గం' నేపథ్యంలో సదస్సు నిర్వహించారు. ముందుగా క్లాఫ్మా ఇండియా చైర్మన్ దివ్యకుమార్ గులాటీ ప్రసంగించారు.

రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు

● నిషేధిత జాబితాలో ఉన్న భూమికి రిజిస్ట్రేషన్..

షాపూర్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం సబ్‌రిజిస్ట్రార్ అశోక్‌కుమార్ సస్పెండ్ అయ్యారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లిలోని సర్వేనంబర్ 83లో నిషేధిత భూమిని నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు స్థానికులు ఫిర్యాదుమేరకు ఉన్నత అధికారులు సమగ్ర దర్యాప్తు జరిపి ఆ మేరకు వేటు వేశారు. కోట్లు విలువచేసే భూమికి గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసి, స్టాంపు డ్యూటీ తగ్గించారని, 22ఏ లో నిషేధిత జాబితాలో ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేయడంపై ఐజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈయనతో పాటు ఆయన అసిస్టెంట్‌కు మెమో అందజేసినట్లు తెలుస్తోంది.

దేశరక్షణలో సీఐఎస్ఎఫ్ కృషి భేష్

బిట్స్ పిలానీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దేశరక్షణలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్సు (సీఐఎస్ఎఫ్) చేస్తున్న కృషి అభినందనీయమని అడిషన్ డైరెక్టర్ జనరల్ సుధీర్ కుమార్ అన్నారు. శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా హకీంపేట పరిధిలోని సీఐఎస్ఎఫ్‌కు చెందిన నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ (ఎన్ఐఎస్ఏ)లు సహాయక కమాండెంట్ల 2వ బ్యాచ్‌కు చెందిన 700 మంది అసిస్టెంట్ కమాండెంట్లు, 74 మంది మహిళా సబ్‌ఇన్‌స్పెక్టర్ల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమం జరిగింది. అనంతరం ఇండోర్ అవుట్ డోర్, తుపాకీ కాల్పులతో పాటు ఆల్ రౌండ్ బెస్ట్ విభాగాలలో అగ్రగామిగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు.

రైళ్ల భద్రతపై అప్రమత్తత తప్పనిసరి

● దక్షిణ మధ్య రైల్వే జీఎం శ్రీవాత్సవ

హైదరాబాద్, మార్చి23 (ఆంధ్రజ్యోతి): నాందేడ్- ముధ్ఖేడ్-సికింద్రాబాద్ విభాగంలో రైళ్ల భద్రతపై అప్రమత్తంగా వ్యవహరించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ అధికారులకు సూచించారు. శనివారం హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్ కుమార్ వర్మతో కలిసి ఆయన .. ముధ్ఖేడ్-సికింద్రాబాద్ సెక్షన్‌లో రైల్వే ట్రాక్, సిగ్నల్స్ పనితీరు, వంతెనల వద్ద భద్రతా పరమైన అంశాలపై ఆరా తీశారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద బాసర రైల్వేస్టేషన్‌లో చేపట్టిన పనుల పురోగతిని తెలుసుకున్నారు. నాందేడ్ - ముధ్ఖేడ్ విభాగంలో నాందేడ్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ ప్రదీప్ లక్ష్మణ్‌రావు కమ్లేతో కలిసి ఆయన.. రైల్వే ట్రాక్ భద్రతా అంశాలపై సమీక్ష చేపట్టారు. నాందేడ్‌లో అధికారులతో సమావేశమై రైల్వే కార్యకలాపాలను సైతం సమీక్షించారు. వివిధ ట్రేడ్ యూనియన్ల సభ్యులు, కూలీల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు.

ఆధునిక వైద్యపరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

● 'ఎలివేట్ ఈఎన్‌టీ సమ్మిట్ 2025'లో మెడికవర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శరత్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆధునిక వైద్య పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవడం, నిరంతర విద్యా సంస్కృతిని పెంపొందించడం వల్ల వైద్యులు తమ రంగంలో మరింత రాణించడానికి ఆస్కారముంటుందని, దీంతో రోగులకు చాలా మేలు కలుగుతుందని మెడికవర్ ఆస్పత్రి డైరెక్టర్, కార్డియాలజిస్టు డాక్టర్ ఏ. శరత్‌రెడ్డి పేర్కొన్నారు. 'ఎలివేట్ ఈఎన్‌టీ సమ్మిట్ 2025' రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న రెండవ ఎడిషన్‌ను శనివారం రాయదుర్గంలోని టీ-హబ్‌లో ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు ద్వారకానాథ్, నారాయణ జయశంకర్, నిషిత్ జేషా, అమిత్ కేశ్రీ, డిఎస్ దీనదయాల్, ఎస్.శ్రీనివాస్ కిషోర్, శ్రీకాంత్‌రెడ్డి, వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సహస్ర పేరుతో కొత్త చట్టం తేవాలి

● ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు కేఏ పాల్

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సహస్ర పేరుతో ఒక కొత్త చట్టం తేవాలని, మరో ఘటన పునరావృతం కాకుండా ఇది దోహదపడుతుందని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు కేఏ పాల్ అన్నారు. చట్టం చేసే విషయమై సుప్రీం కోర్టుకు, అవసరమైతే పార్లమెంట్ సైతం ఆమోదించాలన్నారు. కూకట్‌పల్లిలో సహస్ర హత్యకు గురి కాగా ఆమె తల్లిదండ్రులు రేణుక, కృష్ణలను శనివారం ఆయన పరామర్శించారు. వారితో కలిసి ఆయన.. కూకట్‌పల్లి ఎస్‌హెచ్‌వో కేవీ సుబ్బారావును కలిశారు. బాలిక హత్య జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఆమె తల్లిదండ్రులను కోర్టుకు తీసుకెళ్లి వారి బాధను వినిపించేలా చేస్తానన్నారు. బాలుడ్ని మైనర్‌గా కాకుండా మేజర్‌గా గుర్తించి కఠిన శిక్షపడేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై సహస్ర తల్లిదండ్రులకు హామీనిచ్చారు.

ఆడపిల్లలపై కొనసాగుతున్న అణచివేత

రాంనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు తమ జీవితంలో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే హక్కు, స్వేచ్ఛ, సమానత్వపు హక్కులో భాగమేనని పలువురు వక్తలు పేర్కొన్నారు. మన దేశంలో ఉన్న కులం, మతం, కుటుంబ కట్టుబాట్లు, పరువు పేరుతో ఆడపిల్లలపై కుటుంబం, సమాజం అణచివేత కొనసాగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రగతిశీల మహిళా సంఘం తెలంగాణ కమిటీ ఆధ్వర్యంలో 'మహిళల స్వయం నిర్ణయాధికార హక్కులపై సదస్సు జరిగింది. రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ అధ్యక్షతన జరిగిన సభలో పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, నాయకురాలు ఝాన్సీ, స్వరూప, బండారు విజయ, భూమిక ప్రతినిధి కె.సత్యవతి, రచయిత్రులు జ్యోత్స్న, జ్యోతి, ఐఎఫ్‌టీయూ నాయకురాలు అనురాధ, జానకి, కె.జ్యోతి. ఎం.జ్యోతి, పద్మ, భారతిలు మాట్లాడారు. సనాతన ధర్మ పునర్జీవన కార్యక్రమం వేగవంతమై వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తోందన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం తీసుకురావాలి

● విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు

కవాడిగూడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుకు పార్లమెంటులో ప్రత్యేక చట్టం తీసుకురావాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 42శాతం బీసీ రిజర్వేషన్లు పార్లమెంటులో చట్టం చేయాలని డిమాండ్‌తో ధర్నా నిర్వహించారు. తమిళనాడు తరహాలో రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చి బీసీ రిజర్వేషన్లను పటిష్టంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మన్ నల్లా సూర్య ప్రకాష్ మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్ల సాధనకోసం ఎస్సీ ఎస్టీలతో కలిసి బీసీలు ఐక్య పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ వెంకట్, లెఫ్ట్‌ఫ్రంట్ రాష్ట్ర నాయకులు గాదగోని రవి, ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి ప్రసంగించారు. కార్యక్రమానికి బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కె. పర్వతాలు అధ్యక్షత వహించారు. బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ నాయకులు ఎస్ సిద్దిరాములు, సబ్బని రాములు, వస్కుల మట్టయ్య బీసీ ఉద్యమ నాయకుడు నేతాజీ వనం సుధాకర్, కె గోపాల్, వడ్ల సాయి, కృష్ణమాస్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

జర్మన్ ఎంఓయూ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జర్మన్ ఎంఓయూ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని జేఎన్‌టీయూ వర్సిటీ అడ్మిషన్ల విభాగం డైరెక్టర్ బాలునాయక్ తెలిపారు. సెప్టెంబరు 1 నుంచి 4 వరకు ఎంఓయూ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు వివరాలకు జేఎన్‌టీయూ వెబ్‌సైట్ లేదా వర్సిటీ అడ్మిషన్ల విభాగం అధికారులను సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ (టీఎంఆర్) జూనియర్ కళాశాలలో ఐఐటీ/నీట్ ఇంటిగ్రేటెడ్ కోచింగ్ కోసం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఇలియాస్ అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకొని కాలేజీ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపడుతున్నామని పేర్కొన్నారు. వివరాలకు గోల్కొండ గర్ల్స్-2 కాలేజీని సందర్శించవచ్చని తెలిపారు. నాంపల్లిలోని హజ్‌హౌస్ 6వ అంతస్తులో నిర్వహిస్తున్న కార్యాలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.



వింటేజ్ వాచ్‌లతో ట్రెండీగా..

ప్రత్యేకమైన డిజైన్లతో అందరినీ అలరించిన వింటేజ్ వాచ్‌లు మళ్లీ ఇప్పుడు ట్రెండింగ్‌లోకి వచ్చేశాయి. అద్భుతమైన చేతిపని నైపుణ్యం, ఒకప్పటి హస్తకళల వైభవం మేళవించి నట్లుండే ఈ వాచ్‌లు ప్రస్తుతం ఫ్యాషన్ ప్రియులను అలరిస్తున్నాయి. ప్రముఖ సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు, సింగర్లు, వ్యాపారవేత్తలు ఇలా అందరూ ఈ ట్రెండ్‌ను అనుసరిస్తున్నారు. బంగారం, ప్లాటినంతో రూపొందించి వజ్రాలు, రత్నాలు పొదిగి వినూత్నంగా తీర్చిదిద్దిన అలనాటి కళాత్మక గడియారాలు ఎన్నో అందుబాటులోకి వచ్చేస్తున్నాయి. విభిన్నంగా జోడించిన చెయిన్, బెల్ట్‌లతో ఖరీదైన బ్రాస్‌లెట్లను తలపిస్తున్నాయి.

ఇటీవల కరీనా కపూర్ ఖాన్.. అత్యంత అరుదైన జేగర్ లీ కౌల్టర్ వాచ్ ధరించి తళుక్కుమన్నారు. అలాగే అనన్య పాండే కూడా ఆడెమర్స్ పిగ్యుట్ రాయల్ ఓక్ మినీ ఫ్రోస్టెడ్ గోల్డ్ వాచ్ పెట్టుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇది 1997 దశకంలో అత్యంత ప్రజాదరణ పొందిన మోడల్. 18 క్యారెట్ బంగారు కేసు దీని ప్రత్యేకత. డేవిడ్ బెక్‌హామ్.. వజ్రాలతో నిండిన కస్టమ్ ట్యూడర్ బ్లాక్ బే క్రోనోను ఎడమ చేతికి పెట్టుకుని వింబుల్డన్‌లో మెరిశాడు. నిక్ జోనాస్.. 1970 నాటి రోలెక్స్ డే డేట్‌ను ధరించి కనిపించాడు. ఇలా యాభై ఏళ్లనాటి వింటేజ్ వాచ్‌లు మరల కనువిందు చేస్తున్నాయి.

ఎలా ఎంచుకోవాలంటే..!

- క్లాసిక్ గడియారాలకు సంబంధించి ఒకప్పుడు అత్యంత ఆదరణ పొందిన డిజైన్లు, మోడల్స్, బ్రాండ్లను గురించి వివరంగా తెలుసుకోవాలి. వెనక్కి ప్రయాణించి శోధించే కొద్దీ అపురూపమైన వాచ్‌లు వెలుగులోకి వస్తాయి. పాత పుస్తకాలు చదవడం, వెబ్‌సైట్‌లు పరిశీలించడం, అప్పటి ప్రకటనలు లేదా మేగజైన్లు చూడడం లాంటివి ఉపకరిస్తాయి.
- ఈ వింటేజ్ వాచ్‌ల విలువ ఎక్కువగానే ఉంటుంది. కనీసం ముప్పయి వేల నుంచి కొన్ని లక్షల వరకు ఖరీదు ఉండవచ్చు. వింటేజ్ వాచ్‌ను ధరించాలంటే ముందుగా బడ్జెట్‌ను అంచనా వేసుకుని అందుకు తగ్గట్టు నిర్ణయం తీసుకోవాలి. సీకో, లాంగ్నైన్స్, టిస్సోట్ లాంటి బ్రాండ్లు చక్కని స్టయిలిష్ వింటేజ్ వాచ్‌లను అందుబాటులో ఉంచుతున్నాయి. ప్రామాణికత పాటిస్తూ అనుభవం ఉన్న నమ్మకమైన డీలర్ల సలహా ప్రకారం వింటేజ్ వాచ్‌లు కొనుగోలు చేయడం మంచిది.



కీరదోస ప్రయోజనాలెన్నో!

నీటి శాతం ఎక్కువగా ఉండే కీరదోసను సలాడ్‌ల రూపంలో ఎక్కువగా తీసుకుంటాం. ఈ కీరదోస వలన పలు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం...

- ఊబకాయ బాధితులకు కీరదోస దివ్యౌషధం లాంటిది. ఇందులో తక్కువ క్యాలరీలు ఉండడం వలన బరువు తగ్గేందుకు బాగా ఉపయోపడుతుంది.
- కీరదోస మధుమేహాన్ని, రక్త పోటును అదుపులో ఉంచుతుంది.
- దీనిలో దాదాపు 95 శాతం నీరు ఉండడం వలన డీహైడ్రేషన్ బారి నుంచి తప్పించకోవచ్చు.
- ఇందులోని విటమిన్ ఎ, బి, సిలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి.
- కీరదోస శరీరాన్ని నిర్విషికరణ చేస్తుంది.



- కిడ్నీలో రాళ్లను కరిగించడంలో ఉపయోగపడుతుంది.
- శరీర ఉష్ణోగ్రత అదుపులో ఉంచుతుంది.
- ఇందులోని విటమిన్ బి అడ్రినల్ గ్రంథి పనితీరును మెరుగు పరిచి ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది.
- అలాగే కీర ముక్కలను రోజూ కళ్ల మీద పెట్టుకుంటే కళ్ల మంట, నల్లటి వలయాలు తగ్గుతాయి.

తేనె ఎక్కువగా తీసుకుంటున్నారా?



ఏదీ అతి మంచిది కాదు. ఇదే తిండి విషయంలోనూ వర్తిస్తుంది. ఆరోగ్యానికి మంచిది కదా అని ఎక్కువగా తీసుకుంటే అనర్థాలు తప్పవు. తేనెలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. తేనె రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు చర్మానికి పోషణ కూడా కల్పిస్తుంది. కానీ తేనెను అతిగా తీసుకోవడం వలన నష్టాలు కూడా జరుగతాయి. అవేంటో తెలుసుకుందాం...

- తేనె వలన రక్తంలో చక్కెర స్థాయులు పెరిగిపోతాయి. దీని వలన గుండె సంబంధిత వ్యాధులు తలెత్తే ప్రమాదముంది.
- తేనెలో ఫ్రక్టోజ్ అధిక మొత్తంలో ఉంటుంది. ఇది కొందరిలో తొందరగా జీర్ణమవదు. కాబట్టి తేనె ఎక్కువగా తింటే ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు తలెత్తవచ్చు.
- అధిక మొత్తంలో తేనె తీసుకోవడం వలన లోబీపీ బారిన పడే ప్రమాదముంది.
- ఒక టీస్పూన్ తేనెలోనే 64 క్యాలరీలు ఉంటాయి. కాబట్టి అధిక మొత్తంలో తేనె తీసుకుంటే అధిక బరువు పెరుగుతారు.
- తేనె తీసుకోవడం వలన దంత సమస్యలు కూడా వస్తాయి.

'మయసభ'తో మళ్లీ ఆ ఫీలింగ్ వచ్చింది





• సండే సెలబ్రిటీ

చంద్రబాబునాయుడు... వైఎస్ రాజశేఖరెడ్డి మధ్య స్నేహం, వైరంపై కొన్ని సినిమాలు వచ్చాయి. వాటినే నేపథ్యంగా తీసుకొని దర్శకుడు దేవ కట్టా 'మయసభ' అనే వెబ్‌సిరీస్ రూపొందించారు. 'సోనీ లివ్' ఓటీటీలో పలు భాషల్లో అందుబాటులో ఉన్న ఈ వెబ్ సిరీస్‌కు దేశవ్యాప్తంగా మంచి స్పందన లభిస్తోంది. తాజాగా 'ఓర్‌మ్యాక్ మీడియా లిస్ట్'లో ప్రేక్షకులు ఎక్కువగా చూసిన మూడు వెబ్ సిరీస్‌లలో ఒకటిగా నిలిచింది. ఓ తెలుగు వెబ్‌సిరీస్ టాప్3లో చోటు దక్కించుకోవడం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో దేవ కట్టాను 'నవ్య' పలకరించింది.

'మయసభ'కు వస్తున్న స్పందన చూస్తే ఎలా అనిపిస్తోంది?

చాలా ఆనందంగా ఉంది. చాలా లిబరేటింగ్‌గా కూడా ఉంది. దర్శకుడిగా నేను ఎదిగానని అనిపించింది. అన్ని వర్గాల ప్రేక్షకులకూ నేను చెప్పాలనుకున్న విషయాలను ఈ వెబ్ సిరీస్ ద్వారా సూటిగా చెప్పగలిగానని అనిపించింది. సాధారణంగా ఏదైనా సినిమా బాగుంటే, విడుదలైన వెంటనే అందరిలోనూ 'ఈ సినిమా బ్లాక్ బస్టర్' అనే ఫీల్ వస్తుంది. 'ప్రస్థానం' చిత్రం సమయంలో నాకు అలాంటి ఫీలింగ్ కలిగింది. ఇప్పుడు మళ్లీ 'మయసభ' ద్వారా అలాంటి అనుభూతే కలుగుతోంది.

ఈ కథను ఇప్పటిదాకా అనేకమంది దర్శకులు సినిమాల రూపంలో చెప్పారు. మళ్లీ దీన్నే ఎందుకు ఎంచుకున్నారు?

ఇప్పటిదాకా వచ్చిన కథలన్నీ ఒక వ్యక్తి కోణం నుంచి వచ్చాయి. అంటే ఒక వ్యక్తి హీరో అవుతాడు. అతని దృష్టికోణం నుంచి కథ నడుస్తుంది. కొందరు హీరోకి మద్దతు ఇస్తారు. మిగిలిన వారందరూ విలన్లుగా మారతారు. కానీ 'మయసభ'ను జీవిత చరిత్రల్లా చెప్పాలనుకొనలేదు. నా ఉద్దేశంలో ఇది 1970, 1980 దశకాలలో మన తెలుగు రాష్ట్ర చరిత్ర. నా తెలుగు కుటుంబ చరిత్ర. ఈ సమయంలో అనూహ్యమైన రాజకీయ పరిణామాలు ఏర్పడ్డాయి. ఇద్దరు సామాన్యమైన వ్యక్తులు స్నేహంతో కలిసి, రాజకీయంగా వేర్వేరు దారులు పట్టి, ఒకరికొకరు శత్రువులుగా మారినప్పుడు జరిగిన పరిణామాలను ఇందులో స్పృశించాను. దేశ రాజకీయాల్లో కులాన్ని వేరుగా చూడలేం. కానీ కులాన్ని ఎంతవరకు హేతుబద్ధంగా వాడుకోవచ్చు... ఆ తర్వాత అది ఎలా మారుతుందనే విషయాన్ని చెప్పటానికి ప్రయత్నించాను. కులం తప్పా.. ఒప్పా అనే చర్చ ఇందులో లేదు. సైద్ధాంతికంగా ప్రారంభమైన పోరాటం వ్యక్తిగతంగా మారి ఒకరినొకరు నాశనం చేసుకొనే స్థితికి రాకూడదనేది నా ఉద్దేశం.

వెబ్‌సిరీస్‌గా ఎందుకు తీయాల్సివచ్చింది?

మొదట్లో 'మయసభ'ను వెబ్‌సిరీస్‌గా తీయాలనే ఆలోచన లేదు. 'గాడ్ ఫాదర్' మాదిరిగా మూడు పార్టులు ఉంటే బాగుంటుందనుకున్నా. మొదటి పార్టులో ఇద్దరు సమర్థులైన, చురుకైన యువకులు తమ జీవితాన్ని ఎలా ప్రారంభించారు? వేర్వేరు పార్టీలలో చేరి ఎలా ఎదిగారు? అనే విషయం ఉంటుంది. రెండో పార్టులో వారిద్దరూ ఎలా శత్రువులుగా మారారనేది ఉంటుంది. మూడో పార్టులో వారు బద్ధశత్రువులుగా ఎలా మారారు? ఒకరినొకరు ఎలా నాశనం చేసుకోవాలనుకున్నారు? అనేది ఉంటుంది. ఈ మూడు పార్టులనూ రెండుగా కుదించటానికి ప్రయత్నించాను. సినిమాగా తీస్తే వీరిద్దరి కథగానే మిగిలిపోతుందని అనిపించింది. దాంతో ఓటీటీ ఫార్మాట్ అనుకున్నాం. బడ్జెట్ కూడా ఎక్కువే అయింది. 'సోనీ' మాకు కావాల్సిన బడ్జెట్ ఇచ్చింది.

సినిమాలు... వెబ్‌సిరీస్‌లు... రెండిటిలో ఏది బెటర్?

నాకు పెద్దగా తేడా అనిపించలేదు. ఆరున్నర గంటల 'మయసభ'ను 85 రోజుల్లో పూర్తిచేశాం. సాధారణంగా సినిమాల్లో ఎక్కువ వేస్టేజ్ ఉంటుంది. ఎక్కువ తీసి కావాల్సినంతే ఉపయోగించుకుంటారు. కానీ దీనిలో మొత్తం స్క్రిప్ట్ అంతా ముందే చేతులో ఉంది కాబట్టి వేస్టేజ్ సమస్యే లేదు. అంతేకాకుండా ఇందులో విజువల్స్ ఏ కమర్షియల్ సినిమాకూ తీసిపోవు. 'మయసభ' తీసిన తర్వాత రెండు రూపాయల అవుట్‌పుట్‌ను రూపాయితోనే ఇవ్వగలననే నమ్మకం కలిగింది.

> **అందరినీ కలిపే ఏదో ఒక ఎమోషన్ లేకపోతే నేను కథ రాయలేను. మన దేశంలో కులం లేకుండా రాజకీయాలు లేవు. వీటిని సినిమాల్లో నర్మగర్భంగా చూపిస్తారు. కానీ 'మయసభ'లో సూటిగా చూపించాను. అందుకే ప్రారంభంలోనే 'స్టోరీ ఆఫ్ ఇండియా ఈజ్ స్టోరీ ఆఫ్ క్యాస్ట్' అని వస్తుంది. దీనిని ఆరున్నర గంటల సినిమా అనుకోవచ్చు. ఇందులో అందరూ హీరోలే! వారి వారి దృష్టి కోణాల్లో వారు చేసేది ఒప్పే.**

'మయసభ' మీకు నేర్పిన పాఠం ఏమిటి?



నేను నమ్మిన సిద్ధాంతాన్ని చెబితే ప్రజలు ఆదరిస్తారని తెలుసుకున్నా. నా మనసుకు నచ్చింది చేస్తే, అది అందరికీ నచ్చుతుందనే విషయాన్ని తెలుసుకున్నా. కొన్నిసార్లు కమర్షియల్ ఎలిమెంట్స్ ఉండాలని కొందరు చెబుతూ ఉంటారు. వారి మాట విని... ఆ ఎలిమెంట్స్‌ను చొప్పించాల్సి ఉంటుంది. అవి స్టోరీకి అడ్డంకి అయితే ఇబ్బంది అవుతుంది. ఉదాహరణకు కొన్నిసార్లు కమర్షియల్‌గా విజయం సాధించటం కోసం పాటలు పెడతారు. 'మయసభ'లో కూడా పాటలు ఉంటాయి. కానీ అవి కథలో భాగమే.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

ఉదయాన్నే బడికి వెళ్లి సాయంత్రం ఇంటికొచ్చిన పిల్లలను తల్లిదండ్రులు రకరకాల ప్రశ్నలు అడుగుతూ ఉంటారు. ఇవాళ బడిలో ఏ పాఠాలు చెప్పారు..? నోట్స్ రాసుకున్నావా..? హోంవర్క్ ఇచ్చారా..? స్లిప్ టెస్టుల్లో మార్కులు ఎలా వస్తున్నాయి? ఇలా ఎన్ని ప్రశ్నలు అడిగినప్పటికీ పిల్లలు అన్యమనస్కంగా సమాధానాలు ఇవ్వడం మనం గమనిస్తూ ఉంటాం. బడి నుంచి రాగానే.. పిల్లలను తల్లిదండ్రులు ఏమి అడగాలో తెలుసుకుందాం...

పిల్లలు బడి నుంచి రాగానే..!

- పిల్లలు ఇంటికి రాగానే ఆ రోజంతా ఎంత ఆనందంగా గడిపారో అడిగి తెలుసుకోవాలి. స్నేహితులతో కలిసి ఆడిన ఆటలు, ఉపాధ్యాయుల పొగడ్తలు, మధ్యాహ్నం ఎవరితో కలసి భోజనం చేశారు? అన్న అంశాలు అడగాలి. పిల్లలు ఆ విషయాలన్నింటినీ గుర్తుచేసుకుంటూ ఉత్సాహంగా అన్ని విషయాలు చెప్పేస్తారు.



- కొంచెం పెద్ద పిల్లలను మాత్రం.. ఉపాధ్యాయులు లేదా తోటి విద్యార్థులతో ఏవైనా సమస్యలు ఉన్నాయేమో అడగాలి. దీనివల్ల తరగతి గదిలో పిల్లలకు ఎదురవుతున్న పలురకాల ఇబ్బందుల గురించి తెలుస్తుంది. వెంటనే ఉపాధ్యాయులతో చర్చించి పరిష్కారాలు వెతకవచ్చు.
- బడిలో ఎంతమంది స్నేహితులు ఉన్నారు? వాళ్లతో ఎలా సమయం గడుపుతున్నదీ అడగాలి. అలాగే ఉపాధ్యాయులతో అనుబంధం ఎలా ఉన్నదీ అడిగి తెలుసుకోవాలి. తరగతి గదిలో ఒంటరిగా ఉండకుండా టీచర్లకు సహాయం చేస్తూ నాయకత్వ లక్షణాలను పెంచుకునేలా పిల్లలను ప్రోత్సహించాలి.
- ఈ రోజు బడిలో ఏ కొత్త విషయం నేర్చుకున్నావు? అని అడిగితే పిల్లలు కొద్దిగా ఆలోచించడం మొదలుపెడతారు. తమకు ఎదురైన కొత్త అనుభవాలను గుర్తుచేసుకుని మరీ చెబుతారు. దీనివల్ల పిల్లల్లో సంభాషణ సామర్థ్యం పెరుగుతుంది.
- పిల్లలు బడికి వెళ్లడానికి ఇష్టపడకపోతే దానికి కారణం అడిగి తెలుసుకోవాలి. ఉపాధ్యాయులు చెబుతున్న పాఠాలు అర్థం కాకపోవడం, బోర్డు కనిపించకపోవడం, స్నేహితులు లేకపోవడం లాంటి కారణాలు ఉన్నాయేమో గమనించాలి.

• వినూత్నం

సంపాదనలో సగం మూగజీవాలకే..

కళ మీదున్న మక్కువతో ఇంజనీర్ వృత్తి నుంచి పక్కకు తప్పుకుని, ఆకట్టుకునే పింగాణీ వస్తువుల తయారీకి పూనుకుంది హైదరాబాద్‌కు చెందిన గాదిరాజు హరిప్రియ. 'ప్రాణి' స్టూడియో ద్వారా తన ఆదాయంలో సగ భాగాన్ని మూగజీవాల సేవల కోసం ఖర్చు చేస్తూ, సేవా దృక్పథాన్ని కూడా చాటుకుంటోంది. పలు రకాల పింగాణీ కళాకృతులతో వినూత్నమైన గుర్తింపును పొందుతున్న హరిప్రియ 'నవ్య'తో పంచుకున్న కబుర్లివి.

ఇంజనీరింగ్ తర్వాత ఆ రంగంలో ముందుకు వెళ్లాలని అనిపించలేదు. దాంతో మైసూర్‌లో ఎమ్‌బిఎ చేశాను. ఆ తర్వాత హెచ్‌ఆర్‌గా ఉద్యోగం చేశాను. అయినా మనసులో ఏదో వెలితి. చిన్నప్పటి నుంచి కళలంటే ఇష్టం. బొమ్మలు గీయడమంటే ఇష్టం. ఒక సందర్భంలో మట్టితో బొమ్మలు తయారు చేసే పాటరీ కళ నన్ను ఆకర్షించింది. అలా మూడేళ్ల క్రితం పాటరీ క్లాసులకు హాజరైనప్పుడు నాకు తగిన రంగం అదేనని అనిపించింది. ఆ కళలో ఎదగాలనే కోరికతో మహారాష్ట్రలో ఎంతో ప్రసిద్ధి పొందిన అన్వి పాటరీ లెర్నింగ్ సెంటర్‌లో చేరిపోయి, పాటరీలో పట్టు సాధించాను. ఆ తర్వాత ముంబయిలో సెరామిక్స్‌కు సంబంధించిన ఇంటర్న్‌షిప్ కూడా చేశాను. ఇంటికి చేరుకున్న తర్వాత చిన్న చిన్న సెరామిక్ కప్పులు, బొమ్మలు లాంటివి తయారుచేయడం మొదలుపెట్టాను. మొదట్లో స్నేహితులు, బంధువులు వాటినెంతో ఆదరించి, ప్రోత్సహించారు. మగ్స్, టేబుల్ మీద అమర్చుకునే అలంకరణ వస్తువులు, గోడకు వేలాడదీసే అలంకరణ వస్తువులు లాంటి వాటిని తయారుచేసేదాన్ని. అలా రెండేళ్ల పాటు సాధన చేసి, గత ఏడాదిగా సామాజిక మాధ్యమాల ద్వారా పూర్తి స్థాయిలో సెరామిక్ వేర్‌ను విక్రయించడం మొదలు పెట్టాను.





> మాది భీమవరం దగ్గరున్న జల్లి కాకినాడ. వ్యాపారరీత్యా చిన్నప్పుడే కుటుంబంతో పాటు హైదరాబాద్ వచ్చేశాను. నా చదువంతా ఇక్కడే సాగింది. నాన్న గాదిరాజు ప్రసాదరాజు పౌల్ట్రీ వ్యాపారం చేస్తారు. అమ్మ కుమారి, గృహిణి. మూగజీవాల పట్ల ప్రేమ ప్రతిబింబించేలా నా పాటరీ స్టూడియోకు 'ప్రాణి' అనే పేరు పెట్టుకున్నాను. ఇంజనీరింగ్ చదివేటప్పటి నుంచి జబ్బుపడిన, గాయపడిన వీధి కుక్కలకు చికిత్సలు చేయడం, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించడం లాంటివి చేస్తున్నాను. నిధులు సేకరించి వాటికి ఆహారం అందిస్తూ ఉంటాను. వేసవిలో కుక్కల కోసం నీటి పాత్రలు అందుబాటులో ఉంచుతూ ఉంటాను. కొవిడ్ సమయంలో ఇస్కాన్, కుక్కల కోసం ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రోగ్రామ్స్‌లో పాల్గొన్నాను. అలాగే నిష్కామకర్మ సంస్థ తరపున నిధులు సేకరించడంతో పాటు, పాటరీ ద్వారా ప్రతి నెలా నాకొచ్చే సంపాదనలో సగ భాగాన్ని మూగ జీవాల సేవలకే వినియోగిస్తూ ఉంటాను.

గిరాకీ ఎక్కువే!

పాటరీ క్లిష్టమైన కళ. ఎంతో మక్కువ ఉంటే తప్ప ఈ కళలో, రంగంలో రాణించడం సాధ్యపడదు. మరీ ముఖ్యంగా ముడిసరుకు, రంగులు, బట్టీలను సమకూర్చుకోవడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. కాబట్టి ప్రారంభంలో స్వయంగా ఉత్పత్తులను తయారుచేసినా, వాటిని కాల్చడం కోసం పాటరీ స్టూడియోల్లో ఉండే బట్టీలను అద్దెకు తీసుకునేదాన్ని. కొంత డబ్బు చెల్లించి వాళ్ల దగ్గరుండే బట్టీలో మన ఉత్పత్తులను కాల్చుకోవచ్చు. ఆ తర్వాత కొంత కాలానికి సొంత బట్టీ కొనుక్కోగలిగాను. అప్పటి నుంచి ఆర్డర్లు కూడా పెరిగాయి. ఇంటీరియర్ డిజైనర్లు లోగో మగ్స్, కార్పొరేట్ గిఫ్టింగ్ కోసం నా చేత ఆయా ఉత్పత్తులను తయారుచేయించుకుంటూ ఉంటారు. ఇంకొందరు పెంపుడు జంతువుల బొమ్మలు, అలంకరణ వస్తువులు తయారుచేయించుకుంటూ ఉంటారు. అలాగే కెఫేలు, రెస్టారెంట్లు టేబుల్ వేర్ పట్ల ఆసక్తిని కనబరుస్తూ ఉంటాయి. పాటరీ వర్క్‌షాప్స్ కూడా కండక్ట్ చేస్తూ ఉంటాను. నాకు ప్రకృతి అంటే ఇష్టం. కాబట్టి నేను తయారుచేసే ఉత్పత్తులు ప్రకృతిని ప్రతిబింబించేలా ఉంటాయి.

సవాళ్లూ లేకపోలేదు

ఆర్డర్లు అందుకోవడం ఒక ఎత్తైతే, వాటికి రూపాన్నిచ్చి, అంతిమ ఉత్పత్తిని రూపొందించడం మరో ఎత్తు. ఒక్కోసారి మనం అనుకున్న రూపం వచ్చిందనుకుంటాం. కానీ బట్టీలో కాల్చిన తర్వాత దాని రూపం మారిపోవచ్చు. సంతృప్తిని కలిగించకపోవచ్చు. ఒక్కో సందర్భంలో ఉత్పత్తే పగిలిపోయి, శ్రమంతా వృథా కావచ్చు. అలా ప్రారంభంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నాను. ప్రస్తుతం సెరామిక్ వేర్‌కు ఆదరణ పెరిగింది. ఇంటీరియర్ డిజైనర్లు, ఆధునిక మహిళలు, పింగాణీ పాత్రలు, వస్తువులు, బహుమతుల పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. హోటల్ రంగం కూడా వినూత్నమైన డిజైనర్ వేర్‌ను కోరుకుంటోంది. ఆహార పరిశ్రమ, ఇంటీరియర్ డెకరేషన్, డెకర్‌వేర్‌తో దగ్గరి సంబంధం ఉన్న రంగం కాబట్టి పాటరీ రంగంలో మంచి అవకాశాలున్నాయి. ఈ రంగాలు మనుగడ సాగించినంత కాలం పాటరీకి కూడా మనుగడ ఉంటుంది. ఆసక్తి, సృజనాత్మకత కలిగిన వారు ఈ రంగాన్ని ఎంచుకోవచ్చు. ఉత్పత్తులు ఎంత వినూత్నంగా ఉంటే, వాటికి ఆదరణ కూడా అంతే ఎక్కువగా ఉంటుంది. మన ఉత్పత్తులు మార్కెట్‌లో గుర్తింపు పొందేవరకూ కష్టపడగలిగితే, ఈ రంగానికి కచ్చితంగా మంచి భవిష్యత్తు ఉంటుంది.

• గోగుమళ్ల కవిత



ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీల్లో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
అబిగైల్	తెలుగు డబ్బింగ్	ఆగస్టు 26
మెట్రో ఇన్ డినో	హిందీ చిత్రం	ఆగస్టు 29
కరాటే కిడ్: లెజెండ్స్	హాలీవుడ్ మూవీ	ఆగస్టు 30
అమెజాన్ ప్రైమ్		
అప్‌లోడ్ 4	వెబ్‌సిరీస్	ఆగస్టు 25
హాఫ్ సీఏ 2	హిందీ సిరీస్	ఆగస్టు 27
సాంగ్స్ ఆఫ్ ప్యారడైజ్	హిందీ చిత్రం	ఆగస్టు 29
జియో హాట్‌స్టార్		
రాంబో ఇన్ లవ్	తెలుగు చిత్రం	ఆగస్టు 29

430 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఎఫ్ఆర్ఎస్ ప్రారంభం

» 63,587 మంది విద్యార్థుల రిజిస్ట్రేషన్ పూర్తి

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 430 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ముఖ గుర్తింపు విధానం (ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్-ఎఫ్ఆర్ఎస్) శనివారం ప్రారంభమైంది. ఇంటర్ విద్యలో ఇది డిజిటల్ దిశగా కీలక ముందడుగు అని విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా పేర్కొన్నారు. రాష్ట్రంలోని మొత్తం 1,64,621 మంది విద్యార్థుల్లో 63,587 మంది విద్యార్థుల ఎఫ్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ పూర్తయిందని, మిగిలిన వారికి సోమవారం పూర్తి చేయనున్నట్టు ఇంటర్ విద్య సంచాలకుడు కృష్ణ ఆదిత్య తెలిపారు. కేవలం 10 సెకన్లలోనే హాజరు పూర్తవుతుందని, గైర్హాజరైన విద్యార్థి వివరాలు వెంటనే వారి తల్లిదండ్రులకు వాట్సాప్ ద్వారా వెళ్తుందన్నారు. ఎఫ్ఆర్ఎస్ విజయవంతానికి ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు సహకరించాలని కోరారు.

తెలంగాణ వచ్చాక అధికారుల్లో పెరిగిన అవినీతి

» అరికట్టాలని సీఎంకు ఎఫ్‌జీజీ లేఖ

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావం తర్వాత ప్రభుత్వ అధికారుల్లో అవినీతి పెరిగిపోయిందని, తప్పు చేస్తే శిక్ష పడుతుందన్న భయం వారిలో లేకుండా పోయిందని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) ఆందోళన వ్యక్తం చేసింది. ఏ కార్యాలయంలోనైనా లంచం ఇవ్వనిదే పని జరగడం లేదని తెలిపింది. ఈ మేరకు ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి శనివారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. లంచం తీసుకుంటున్న వారిని ఏసీబీ అధికారులు పట్టుకుని, కేసు నమోదు చేసి, విచారణకు కోరుతున్నా... ప్రభుత్వం నుంచి అనుమతులు లభించడం లేదని ఎఫ్‌జీజీ వివరించింది. కేసులను నిర్వీర్యపరిచేందుకు వీలుగా అధికారులు వాటిలో కొన్నింటిని శాఖాపరమైన విచారణకు పంపిస్తూ, మరికొన్నింటిని ఉపసంహరిస్తున్నారని ఆరోపించింది. ఇటీవల హైదరాబాద్ జిల్లా డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ మోహన్ రావు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారని తెలిపింది. ఈ కేసులో సత్యనారాయణపై అధికారులు కేసును ఉపంసహరించారని, మోహన్‌రావును ప్రాసిక్యూట్ చేయాలంటూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారని వివరించింది. పౌరసరఫరాల శాఖ అధికారి రాము నాయక్, రంగారెడ్డి జిల్లా జాయింట్ సబ్ రిజిస్ట్రార్ సహదేవ్ 2011లో ఏసీబీకి చిక్కారని, వారి విచారణకు ప్రభుత్వం ఇప్పటివరకు అనుమతి ఇవ్వలేదని తెలిపింది. 2013లో పట్టుబడిన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ వనజ కుమారి కేసును అధికారులు మూసివేశారని ఆరోపించింది. ఇలా చాలా ఏసీబీ కేసులు ప్రాసిక్యూషన్ వరకు వెళ్లడం లేదని, కేవలం శాఖాపరమైన విచారణతో సచివాలయం అధికారులు వాటిని ముగించేస్తున్నారని తెలిపింది. పర్యవసానంగా ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల పర్వం విచ్చలవిడిగా కొనసాగుతోందని, దీనిని అరికట్టాలని ఎఫ్‌జీజీ కోరింది.

హుక్కా వినియోగదార్లకు పరీక్షలు చేస్తున్నారా?

» కేవలం తనిఖీలతో సరిపెడుతున్నారా?

» పోలీసులకు హైకోర్టు ప్రశ్న

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): హుక్కా కేంద్రాలపై దాడులు చేసి కేసులతో వదిలేస్తున్నారా? వినియోగదార్లకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారా? అని హైకోర్టు పోలీసులను ప్రశ్నించింది. హుక్కా వినియోగదార్లకు ఆరోగ్యంపై అవగాహన కలిగిస్తున్నారా అని అడిగింది. తమ వ్యాపార కార్యకలాపాల్లో పోలీసులు జోక్యం చేసుకోవడాన్ని సవాలు చేస్తూ మాదాపూర్ గుట్టల బేగంపేటలోని స్మోకీ టేల్స్ కేఫ్ అండ్ గ్రిల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ ఎన్వీ శ్రావణ్‌కుమార్ ధర్మాసనం పోలీసులకు ఈ ప్రశ్నలు వేసింది. హుక్కా సెంటర్లపై దాడులకు సంబంధించిన వివరాలు అందజేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 26కు వాయిదా వేసింది.

శ్రీశైలం ప్రాజెక్టుకు అదే ఉధృతి

» 4.69 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

» 10 గేట్లు ఎత్తి నీటి విడుదల

» సాగర్‌కు వచ్చిన వరద వచ్చినట్టే 26 గేట్ల ద్వారా దిగువకు విడుదల

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

శ్రీశైలం ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. శనివారం 4.69 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో ప్రాజెక్టు అధికారులు పది గేట్లు ఎత్తి 4.19 లక్షల క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 61,402 క్యూసెక్కులు వదిలారు. ప్రాజెక్టు సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 197.46 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఆల్మట్టి ప్రాజెక్టుకు 2.65 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 2 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 2.10 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, అంతే ఔట్ ఫ్లో ఉంది. భీమా నదిపై ఉన్న సన్నతి బ్యారేజీ నుంచి 2.20 లక్షల క్యూసెక్కులను జూరాలకు విడుదల చేశారు. ప్రస్తుతం జూరాలకు 4.18 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 44 గేట్లను ఎత్తి 4.16 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి 60 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 54 వేల క్యూసెక్కులను శ్రీశైలంకు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు నుంచి 4.09 లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా శనివారం సాయంత్రం 584.50 అడుగులు ఉంది. ఇదిలా ఉండగా, భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం మరింత తగ్గుముఖం పడుతోంది. శుక్రవారం అర్ధరాత్రి 41.8 అడుగులు ఉన్న నీటిమట్టం శనివారం సాయంత్రం 6 గంటలకు 36.2 అడుగులకు తగ్గింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి 5.25 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85 గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 6.30 మీటర్లు ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మిడ్‌మానేరు ప్రాజెక్టు నుంచి కరీంనగర్ లోయర్ మానేరు డ్యాంకు శనివారం నీటిని విడుదల చేశారు.



సాగర్ నుంచి 26 గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

వేల ఎకరాల్లో పంట నష్టం

(మొదటిపేజీ తరువాయి)

రోజుల తరబడి నిలుస్తున్న నీటితో పచ్చని పంటలు నల్లగా మారిపోయాయి. మరికొన్ని చోట్ల వర్షం కారణంగా పంటలకు తెగుళ్లు అంటుకున్నాయి. ఇలాంటి చోట్ల.. పూత దశలో ఉన్న పత్తి, పెసర, మొక్కజొన్న తదితర పంటలకు కాత నిలుస్తుందన్న నమ్మకం సన్నగిల్లుతోంది. ఈ విధంగా రాష్ట్రవ్యాప్తంగా కొన్ని వేల ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం జరిగింది. వేలు, లక్షల్లో పెట్టిన పెట్టుబడి.. రెక్కల కష్టం మట్టిపాలైందని.. మిత్తికి తెచ్చిన అప్పులు మెడకు చుట్టుకున్నాయని, వరదకు పొలాలు, చేల గెట్లు కొట్టుకుపోయి.. ఎక్కడికక్కడ భారీగా ఇసుక మేటలు వేయడంతో అదంతా తొలగించడం అదనపు భారం అని.. ఇది తమకు భారీ నష్టం అని, దీన్నుంచి తాము కోలుకునేదెన్నడు? అని రైతులు తలపట్టుకుంటున్నారు. వర్షం, వరద కారణంగా జరిగిన పంట నష్టంపై క్షేత్రస్థాయిలో పరిస్థితులను 'ఆంధ్రజ్యోతి' పరిశీలించింది. పంట నష్టంపై వ్యవసాయశాఖ అధికారులు జిల్లాల వారీగా లెక్కలు తీసేపనిలో పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు ఉండటంతో అక్కడికి వెళ్లి సర్వే చేయలేకపోతున్నారు. 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో, అలాగే అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం..

ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 19,791 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం జరిగింది. ఇందులో 14,532 ఎకరాల్లో పత్తి పంట నీట మునిగింది. 1823 ఎకరాల్లో కంది, 625 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి, నారాయణపేట జిల్లాలో 5395 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. ఇందులో ఒక్క వరి పంట వాటే 2,687 ఎకరాలు. గద్వాల జిల్లా మానవపాడు పెద్దవాగు, షేక్‌పల్లి-ఆర్‌గార్లపాడు మధ్యలోని మూడు వాగులు, వడ్డేపల్లిలోని జూలకల్లు వాగు పొంగడంతో దిగువన పంటలకు భారీ నష్టం వాటిల్లింది. జనగామ జిల్లాలో ఎక్కువగా పెసర పంటకు నష్టం జరిగింది. ములుగు జిల్లా ఏటూరునాగారం, మంగపేట మండలాల్లో 710 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలంలో 200 ఎకరాల్లో, పలిమెల మండలంలో 100 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. కొత్తపేట, మహదేవ్‌పూర్, బొమ్మాపూర్, బ్రాహ్మణపల్లిలో పంట నష్టం ఎక్కువగా ఉంది. ఆసిఫాబాద్ జిల్లాలో 6,453 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేసినా ఈ నష్టం 10వేల ఎకరాల వరకు ఉంటుందని భావిస్తున్నారు. పెన్‌గంగా, ప్రాణహిత, పెద్దవాగు పరీవాహక మండలాలైన కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్, దహెగాంలో ఎక్కువ దెబ్బతిన్నాయి. మంచిర్యాల జిల్లాలో 3,230 ఎకరాల్లో వరి, 4,832 ఎకరాల్లో పత్తి సహా మొత్తంగా 8,086 ఎకరాల్లో పంట వరదపాలైంది. ఖమ్మంజిల్లాలో కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, కారేపల్లి, ఏన్కూరు, కొనిజర్ల మండలాల్లో పత్తి 2,500 ఎకరాల్లో, వరి 3023 ఎకరాలు సహా 5,600 ఎకరాల్లో పంటలు దెబ్బతినట్లు అధికారులు అంచనా వేశారు. నల్లగొండ జిల్లాలో 5,200 ఎకరాల్లో, సూర్యాపేట జిల్లాలో 4,800 ఎకరాల్లో వరి, పత్తి పంటలకు నష్టం జరిగింది. తుంగతుర్తి నియోజకవర్గంలో 1000 ఎకరాల్లో పంటనష్టం జరిగింది. యాదాద్రి జిల్లాలో 200 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 3,817 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఇందులో సోయాపంట వాటే 3,355 ఎకరాలు. వికారాబాద్ జిల్లాలో 5వేల ఎకరాలకు పైగా వివిధ పంటలు నీట మునిగాయి. ఇందులో పూల తోటలూ ఉన్నాయి.



నాగర్‌కర్నూలు జిల్లా తాడూరు మండలం సిర్సవాడలో నీట మునిగిన పత్తి పంట



దిగువకు వృథాగా పోతున్న నీరు

మంజీరా గేట్ల మొరాయింపు

» వృథాగా దిగువకు నదీ జలాలు

సంగారెడ్డి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సంగారెడ్డి జిల్లాలోని మంజీరా రిజర్వాయర్ గేట్లు మొరాయిస్తుండటంతో నీరంతా వృథాగా పోతోంది. ఇటీవలి భారీ వర్షాలతో సింగూరు ప్రాజెక్టు నుంచి పోటెత్తిన వరదతో మంజీరా బ్యారేజీ జలకళ సంతరించుకుంది. వరద ఎక్కువ కావడంతో బ్యారేజీ 4 గేట్లు ఎత్తారు. వరద తగ్గుముఖం పట్టడంతో శుక్రవారం రాత్రి గేట్లు మూయడానికి ఇంజనీర్లు ప్రయత్నించారు. ఒక గేటు పూర్తిగా కిందకు దిగగా, మూడు గేట్లు అడుగుల దూరంలో ఆగిపోయాయి. శనివారం ఉదయం నుంచి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో నిపుణులను రప్పించి గేట్లకు మరమ్మతు చేసి కిందకు దింపేందుకు ప్రయత్నిస్తున్నా.. ఫలించకపోవడంతో నీళ్లన్నీ వృథాగా పోతున్నాయి. 1.5 టీఎంసీల సామర్థ్యం గల మంజీరా రిజర్వాయర్ నిండుకుండలా ఉంటేనే రోజూ హైదరాబాద్‌కు 40 మిలియన్ లీటర్ల మంచినీరు ఏడాది పొడవునా పంపే అవకాశముంటుంది. వరద తగ్గడంతో సింగూరు గేట్లు మూసేయగా, మంజీరా బ్యారేజీ గేట్లు కిందకు దిగక బ్యారేజీ ఖాళీ అవుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. మంజీరా రిజర్వాయర్‌లో పలు లోపాలున్నాయని ఇటీవల బ్యారేజీని సందర్శించిన ప్రాజెక్టుల భద్రతా మండలి పేర్కొంది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

సితార పాత్రలో



సుధీర్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న మైథలాజికల్ థ్రిల్లర్ 'జటాధర'. వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ సంయుక్త దర్శకత్వంలో ఉమేశ్ కుమార్, ప్రేరణ అరోరా నిర్మిస్తున్నారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. సోనాక్షి సిన్హా కథానాయిక. నటి దివ్యా ఖోస్లా కీలకపాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో సితార అనే పాత్రలో ఆమె కనిపించనున్నారు. శనివారం చిత్రబృందం దివ్యా ఖోస్లా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. సంప్రదాయ వస్త్రధారణలో అలరించారు దివ్య. 'భారీ బడ్జెట్, హై టెక్నికల్ వాల్యూస్‌తో గ్రాండియర్‌గా నిర్మిస్తున్నాం, ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని ఇచ్చే చిత్రమిది' అని మేకర్స్ తెలిపారు.

విలన్‌గా అక్షయ్



అక్షయ్ కుమార్, సైఫ్ అలీ ఖాన్ ప్రధాన తారాగణంగా ప్రియదర్శన్ తెరకెక్కిస్తున్న బాలీవుడ్ చిత్రం 'హైవాన్'. థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కుతోంది. కేవీఎన్ ప్రొడక్షన్స్, తెస్పియన్ ఫిల్మ్స్ నిర్మిస్తున్నాయి. అక్షయ్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ శనివారం కొచ్చిలో మొదలైంది. 'అక్షయ్, సైఫ్ 17 ఏళ్ల తర్వాత కలిసి నటిస్తున్న చిత్రమిది. ఈ కథ చాలా కొత్తగా ఉంటుంది. ఊటీ, ముంబైలో వరుస షెడ్యూల్స్‌లో చిత్రీకరణ పూర్తి చేస్తాం' అని మేకర్స్ తెలిపారు. ప్రేక్షకులు ఆశించే అన్ని అంశాలతో సినిమాను ఆసక్తికరంగా రూపొందిస్తున్నామని ప్రియదర్శన్ తెలిపారు.

ఒక వారం ముందుగానే...



మౌళి తనుజ్, శివానీ నాగరం ప్రధాన పాత్రలు పోషించిన 'లిటిల్ హార్ట్స్' చిత్రం సెప్టెంబర్ 5న విడుదల కానుంది. ఈటీవీ విన్ ఒరిజనల్ ప్రొడక్షన్స్ బేనరుపై దర్శకుడు సాయిమార్తాండ్ రూపొందించారు. ఆదిత్య హాసన్ నిర్మించిన ఈ చిత్రాన్ని బన్నీ వాసు, వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. 'లిటిల్ హార్ట్స్' చిత్రం సెప్టెంబర్ 12న విడుదల కావాలి. కానీ వారం రోజుల ముందుగానే దీన్ని రిలీజ్ చేస్తున్నట్లు నిర్మాత ప్రకటించారు.'ప్రేక్షకులను నవ్వించడానికి ముందుగానే వస్తున్నాం' అని వెల్లడించారు. టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ రావడంతో థియటర్స్‌లో సినిమాకూ అదే ఆదరణ లభిస్తుందన్న నమ్మకంతో మూవీ టీమ్ ఉంది.

సూపర్ యోధుని సాహసం!



'హను-మాన్' చిత్రంతో దేశవ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షించిన యువ కథానాయకుడు తేజ సజ్జా ఇప్పుడు 'మిరాయ్' సినిమాతో సూపర్ యోధగా అలరించనున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేతలు విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. హీరో తేజ పుట్టినరోజు సందర్భంగా శనివారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. కూలిపోతున్న వంతెన మీద కేవలం చేతిలో ఒక స్టిక్‌తో నిలబడి పోరాడుతున్న తేజ లుక్ ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో రితికా నాయక్ హీరోయిన్. మంచు మనోజ్ విలన్‌గా నటిస్తున్నారు. శ్రియ శరణ్, జయరామ్, జగపతిబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'మిరాయ్' చిత్రం 2డి, 3 డి ఫార్మెట్స్‌లో ఎనిమిది భాషల్లో సెప్టెంబర్ 5న విడుదల కానుంది. బాలీవుడ్ టాప్ ఫిల్మ్ మేకర్ కరణ్ జోహార్ ఉత్తరాదిలో ఈ సినిమాను విడుదల చేయనున్నారు.

తేజ సజ్జాతో మరో సినిమా

'మిరాయ్' చిత్రం తర్వాత తేజ సజ్జా హీరోగా మరో కొత్త చిత్రాన్ని నిర్మించనున్నట్లు నిర్మాతలు విశ్వప్రసాద్, కృతిప్రసాద్ ప్రకటించారు. తేజ పుట్టిన రోజు సందర్భంగా ఈ కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటిస్తూ విడుదల చేసిన పోస్టర్‌లో ఉన్న 'ఫ్రమ్ రాయలసీమ టు ద ఎండ్ ఆఫ్ ద వరల్డ్' అనే ట్యాగ్‌లైన్ ఆకట్టుకుంటోంది. భారీ బడ్జెట్‌తో, టాప్ క్లాస్ ప్రొడక్షన్ వాల్యూస్‌తో రూపుదిద్దుకొనే ఈ చిత్రాన్ని 2027 సంకాంత్రికి విడుదల చేయనున్నట్లు నిర్మాతలు వెల్లడించారు.

హాయిగా నవ్విస్తాం

వెంకటేశ్ నిమ్మలపూడి



'చాలా మంచి కుటుంబ వినోదాత్మక చిత్రమిది. సినిమా చూస్తున్నంతసేపూ ప్రేక్షకులు హాయిగా నవ్వుతూనే ఉంటారు' అని చెప్పారు దర్శకుడు వెంకటేశ్ నిమ్మలపూడి. నారా రోహిత్ హీరోగా ఆయన తెరకెక్కించిన చిత్రం 'సుందరకాండ'. సంతోశ్ చిన్న పొల్ల, గౌతమ్‌రెడ్డి, రాకేశ్ మహంకాళి నిర్మించారు. సినిమా ఈనెల 27న విడుదలవుతోంది. ఈ సందర్భంగా వెంకటేశ్ నిమ్మలపూడి విలేకరులతో మాట్లాడారు. 'నాకు ఫ్యామిలీ కథలు అంటే ఇష్టం. 'కలిసుందాం రా' నా ఫేవరేట్ సినిమా. అలాంటి ఒక అందమైన కుటుంబ కథా చిత్రాన్ని తీయాలనే నా కల 'సుందరకాండ'తో నెరవేరింది. తను కోరుకునే సుగుణాలున్న అమ్మాయి కోసం పట్టుపట్టి వెతికే అబ్బాయికి, అతని కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయి అనే పాయింట్ ఆధారంగా రాసుకున్న కథ ఇది. శ్రీదేవీ విజయ్‌కుమార్, వృతి వాఘాని నటన అద్భుతంగా ఉంటుంది.' అని అన్నారు.



గ్లామర్ విందుకు నేను రెడీ!

'నువ్విలా', 'రామ్‌లీల' వంటి చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన యువ కథానాయకుడు హవీష్ తాజా చిత్రం 'నేను రెడీ'. నక్కిన త్రినాథరావు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కావ్య థాపర్ కథానాయిక. నిఖిల కోనేరు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'నేను రెడీ' చిత్రం నుంచి కావ్య థాపర్ బర్త్‌డే పోస్టర్ ను విడుదల చేశారు. ఇందులో తన పాత్ర ప్రేక్షకులను మెప్పిస్తుందని కావ్య చెప్పారు. ప్రస్తుతం షూటింగ్ జరుగుతోంది, ప్రేక్షకులను ఆకట్టుకొనే హంగులతో ఈ చిత్రం రూపొందుతోంది అని నిర్మాత నిఖిల చెప్పారు.

చాలా క్రూరమైన పాత్ర చేశా

చైతన్య రావు




"'ఘాటీ'లో నా పాత్ర రెగ్యులర్ విలన్‌లా ఉండదు. 'విలన్‌గా కాకుండా ఒక మెయిన్ క్యారెక్టర్‌గా నిన్ను చూస్తున్నాను' అని డైరెక్టర్ క్రిష్ నాతో చెప్పారు. ఐకానిక్ క్యారెక్టర్ అవుతుందనే నమ్మకం నాకుంది.' అని అన్నారు నటుడు చైతన్య రావు. అనుష్కశెట్టి, విక్రమ్‌ప్రభు ప్రధాన పాత్రధారులుగా క్రిష్ జాగర్లమూడి తెరకెక్కించిన చిత్రం 'ఘాటి'. రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. ఈ చిత్రంలో చైతన్య రావు కీలక పాత్రలో నటించారు. సినిమా సెప్టెంబరు 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ 'క్రిష్ కథను అద్భుతంగా చెప్పారు. అసలు ఆ క్యారెక్టర్‌లో నన్ను ఎలా ఊహించుకున్నారో అర్థం కాలేదు. చాలా క్రూరమైన పాత్ర అది. లుక్ కోసం చాలా టైం పట్టింది. 'ఘాటీ' 'మయసభ' ఈ రెండూ కూడా నా కెరీర్‌కు గట్టి పునాదులు కాబోతున్నాయి' అని అన్నారు.

మంచి సందేశం ఇవ్వాలనుకుంటున్నా



మోహన్ శ్రీవత్స

'ఈ సినిమాలో హీరో, విలన్ అంటూ ప్రత్యేకంగా ఉండరు. అన్ని పాత్రల్లో అన్ని కోణాలుంటాయి' అని అన్నారు దర్శకుడు మోహన్ శ్రీవత్స. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన 'త్రిబాణధారి బార్బరిక్' సినిమా ఈనెల 29న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో చిత్ర విశేషాలు పంచుకున్నారు. 'మారుతి జానర్‌లో ఉండే సినిమా కాదిది. కానీ ఈ కథను పర్‌ఫెక్ట్‌గా నెరేట్ చేశాను. 'అన్ని పాత్రల్లోనూ అంతర్గత సంఘర్షణ ఉంటుంది. తెలిసో తెలియకో అందరం తప్పులు చేస్తుంటాం. అన్ని రకాల భావోద్వేగాలను నియంత్రణలో పెట్టుకునే వాడు గొప్ప మనిషి అని చెప్పదల్చుకున్నాను' అని అన్నారు.



ఐటీపీఐ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మూసీ ప్రక్షాళనపై తగ్గేదే లేదు

» భావితరాల కోసం చేసి తీరుతాం: మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాల కోసం మూసీ నదిని ప్రక్షాళన చేస్తామని, ఈ విషయంలో వెనకడుగు వేసేది లేదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. నీటి వనరుల పరిరక్షణలో తెలంగాణను ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుపుతామని ఆయన అన్నారు. 'పాలసీస్ అండ్ స్ట్రాటజీస్ టువర్డ్స్ బయోఫిలిక్ అర్బనిజం' అనే అంశంపై ఇనిస్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఇండియా (ఐటీపీఐ) ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని పార్క్ హయాత్‌లో జరిగిన సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరాల అభివృద్ధికి సరైన ప్రణాళిక చాలా ముఖ్యమని అన్నారు. ఆర్థికాభివృద్ధి పర్యావరణ పరిరక్షణతో ముడిపడి ఉంటుందని, కేవలం భవనాలను నిర్మించడమే అభివృద్ధి కాదని పేర్కొన్నారు. నగరాల ప్రణాళికలు రూపొందించేటప్పుడు వాతావరణ మార్పులు, వరదలు, పర్యావరణ కాలుష్యం, భూగర్భ జలాల తరుగుదల వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు.

మట్టి గణపతులనే పూజిద్దాం: మంత్రి సురేఖ

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ అనుకూలంగా గణేశ్ చతుర్థిని జరుపుకుందామని మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఈసారి పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీఓపీ) విగ్రహాలకు దూరంగా ఉందామని సూచించారు. కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) తయారు చేసిన పర్యావరణ హిత మట్టి గణేశ్ విగ్రహాలను సచివాలయంలో మంత్రి కొండా సురేఖ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... భక్తులు మట్టి గణేశ్ విగ్రహాల్నే పూజించాలని, నదులు, సరస్సులకు హాని కలిగించే పీఓపీతో తయారు చేసిన విగ్రహాల వాడకానికి దూరంగా ఉండాలని సూచించారు. పీసీబీ రూపొందించిన పర్యావరణహిత మట్టి గణేశ్ విగ్రహాల వాడకాన్ని ప్రోత్సహించే పోస్టర్‌ను ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ ఆవిష్కరిచాఆరు. పీసీబీ సభ్య కార్యదర్శి రవి, చీఫ్ ఇంజనీర్ రఘు ఇతర ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా విద్యార్థులకు మట్టి విగ్రహాల తయారీపై వర్క్‌షాప్, ఆటో రిక్షాలపై అవగాహన పోస్టర్లు, 3.24 లక్షలకుపైగా మట్టి విగ్రహాల పంపిణీ తదితర కార్యక్రమాల్ని ఈ సంవత్సరం గణేశ్ చతుర్థి సందర్భంగా పీసీబీ చేపట్టింది. కాగా, దేవాదాయ శాఖలో పరిధిలోని ఆలయాల్లో పని చేస్తున్న 10 మంది అర్చక, సిబ్బందికి పదోన్నతులు కల్పించారు. వేదపారాయణం చేసే అర్చకులకు గ్రేడ్-3 నుంచి గ్రేడ్-2కు, గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1కు పదోన్నతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, ఈవో స్థాయిలో గ్రేడ్-3 నుంచి గ్రేడ్-2కు, మోఫిసిల్ సీనియర్ అసిస్టెంట్ నుంచి ఈవో గ్రేడ్-2కు, దేవస్థానం జూనియర్ అసిస్టెంట్ నుంచి కన్వర్షన్ ఆఫ్ సర్వీసెస్ కింద ముగ్గురికి ఈవో గ్రేడ్-3 పదోన్నతి కల్పించారు. పదోన్నతి పత్రాలను సచివాలయంలో దేవాదాయ మంత్రి కొండా సురేఖ అర్చకులు, సిబ్బందికి శనివారం అందించారు.

భాషా సాంస్కృతిక వికాసానికి ప్రోత్సాహం

» వివిధ సంస్థలకు రూ.45 లక్షలు మంజూరు: జూపల్లి

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ భాషావ్యాప్తికి, సాంస్కృతిక వికాసానికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణలో దశాబ్దాల కాలం నుంచి భాషా, సాహిత్య సాంస్కృతిక, కళల పరిరక్షణకు కృషి చేస్తున్న సంస్థల సేవలను మరింత ప్రోత్సహించేందుకు ఆయా సంస్థలకు రాష్ట్రప్రభుత్వం చేయూతను అందించాలని నిర్ణయించిందని తెలిపారు. ఈ క్రమంలోనే తెలంగాణ సారస్వత పరిషత్‌కు రూ.20లక్షలు, సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణదేవరాయ భాషానిలయానికి రూ.10 లక్షలు, చిక్కడపల్లిలోని త్యాగరాయగాన సభకు రూ.10 లక్షలు, వరంగల్‌లోని పోతన విజ్ఞాన పీఠానికి రూ.5 లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఆయన తెలిపారు.

బెల్లం వ్యాపారి నుంచి 30వేల లంచం డిమాండ్

» ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన డోర్నకల్ సీఐ

డోర్నకల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బెల్లం వ్యాపారం చేస్తున్న మహబూబాబాద్ జిల్లా కేంద్ర వాసి నుంచి రూ.30 వేల లంచం తీసుకుంటున్న డోర్నకల్ సీఐ భూక్య రాజేశ్‌ను శనివారం ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సదరు వ్యక్తి బొలెరో వాహనంలో బెల్లం తరలిస్తుండగా గత మే నెలలోనూ, ఈ నెల మొదటి వారంలోనూ డోర్నకల్ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కేసులో హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ తెచ్చుకున్న సదరు వ్యక్తికి సీఐ రాజేశ్, ఆయన గన్‌మన్ రవి ఫోన్ చేసి.. తమకు రూ.50 వేలు లంచమివ్వక పోతే వ్యాపారం చేయలేవని బెదిరించాడు. తాను అంత మొత్తం ఇవ్వలేనని, రూ.30 వేలు ఇవ్వగలనని చెప్పాడు. దీంతోపాటు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు శనివారం సాయంత్రం డోర్నకల్‌లోని సీఐ రాజేశ్ ఇంట్లో ఆయనకు, ఆయన గన్‌మన్ రవికి రూ.30 వేల డబ్బు ఇస్తుండగా.. వారిద్దరినీ ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం సీఐ ఇంట్లో జరిపిన సోదాల్లో లెక్క తేలని రూ.1,25,050 నగదు లభ్యమయ్యాయి.

వెంకన్న భక్తులకు ఆర్టీసీ టిక్కెట్ ధరల్లో రాయితీలు

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వెంకన్న భక్తులకు టీజీఎస్‌ఆర్టీసీ బస్సు టిక్కెట్ ధరల్లో రాయితీ ప్రకటించింది. హైదరాబాద్-తిరుపతి రూట్‌లో లహరి, రాజధాని ఏసీ బస్సుల్లో 10%, సూపర్ లగ్జరీ బస్సుల్లో 15% టిక్కెట్ ధరల్లో రాయితీ ప్రకటించింది. అంతేకాదు హైదరాబాద్ నుంచి ఏపీలోని రాజమండ్రి, నెల్లూరు, విశాఖపట్నంతో సహా మరి కొన్ని ముఖ్య ప్రాంతాలకు నడిచే లహరి నాన్‌ఏసీ, సూపర్ లగ్జరీ బస్సుల్లో 15%, లహరి ఏసీ, రాజధాని ఏసీలో10% టిక్కెట్ ధరల్లో తగ్గింపు ఇచ్చింది.

పోలీసింగ్‌కు సైబర్ క్రైం ప్రధాన సవాల్: డీజీపీ

» ఐఎస్‌బీ- రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో మధ్య అవగాహనా ఒప్పందం

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పోలీసింగ్‌కు పెరుగుతున్న సైబర్ నేరాలు ప్రధాన సవాల్ అని డీజీపీ జితేందర్ తెలిపారు. ఇందుకోసం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లోని డేటా సైన్స్ ఇనిస్టిట్యూట్, రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా డీజీపీ జితేందర్ మాట్లాడుతూ.. ఐఎస్‌బీ- సైబర్ సెక్యూరిటీ బ్యూరో మధ్య ఒప్పందంతో సైబర్ నేరగాళ్ల నుంచి పౌరులను కాపాడి డిజిటల్ తెలంగాణగా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఈ మేరకు రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ షికా గోయల్ ఓ ప్రకటన చేస్తూ.. సైబర్ నేరాలు, ముఖ్యంగా ఆర్థిక మోసాలను ఎదుర్కొనేందుకు పరిశోధన, సాంకేతికత ఆధారిత సాధనాలు, విధాన ఫ్రేమ్‌వర్క్‌ల రూపకల్పనలో ఇరు సంస్థలు కలిసి పని చేస్తాయని తెలిపారు. రెండు సంస్థలూ డిజిటల్ మోసాల నివారణ, సైబర్ నేరాల ప్రాసిక్యూషన్‌కు ఫ్రేమ్‌వర్క్ రూపకల్పనతోపాటు ఏఐ ఆధారిత నేరాలపై ముందస్తు చర్యలకు విధి విధానాలను ఖరారు చేస్తాయన్నారు. మ్యూల్ ఖాతాల నెట్‌వర్క్, డిజిటల్ మనీ లాండరింగ్, డీప్ ఫేక్, ఫైనాన్షియల్ మానిప్యులేషన్స్‌పై దృష్టి పెడతారన్నారు.

నాగార్జునసాగర్‌ను సందర్శించిన ప్రముఖులు

నాగార్జునసాగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌ను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, సినీ నటుడు అశోక్ కుమార్ సందర్శించారు. గంటాకు స్థానిక విజయ విహార్ అతిథి గృహంలో ప్రొటోకాల్ ఆర్‌ఐ దండా శ్రీనివాస్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఏపీ పల్నాడు జిల్లాలో ఉన్న ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు. సాయంత్రం హిల్‌కాలనీలో బుద్ధవనం ప్రాజెక్టును సందర్శించారు.

హాస్టల్‌లో విషప్రయోగం

» విద్యార్థులు తాగే నీటిలో గడ్డి మందు కలిపిన ఉపాధ్యాయుడు

» తనతో పడని ప్రత్యేక అధికారిని ఇరికించేందుకు కుట్ర

» విధుల నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు, వంట కార్మికురాలి తొలగింపు

భూపాలపల్లి టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులకు దూరంగా హాస్టల్‌లో ఉండే విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకోవాల్సిన ఉపాధ్యాయుడు.. కర్కోటకుడిగా మారాడు. తనతో విభేదాలు నెలకొన్న ప్రత్యేకాధికారిని ఇరికించేందుకు విద్యార్థుల ప్రాణాలు తీయాలని చూశాడు. హాస్టల్‌లో విద్యార్థులు వినియోగించే నీళ్లలో విషం కలిపాడు. దీంతో 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకోగా.. శనివారం విచారణలో విస్తుపోయే విషయాలు వెల్లడయ్యాయి. ఐదు నుంచి ఎనిమిదో తరగతి వరకు చదువుతున్న 30 మంది విద్యార్థులు ఈ స్కూల్‌లో ఉన్నారు. శుక్రవారం ఉదయం అల్పాహారం చేసిన తర్వాత 11 మంది విద్యార్థులు నీటిని తాగి అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఉపాధ్యాయులు వారిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే.. విద్యార్థులు తాగే నీటిలో పాఠశాలలో విధులు నిర్వర్తించే ఓ ఉపాధ్యాయుడే గడ్డిమందు కలిపినట్లు తేలింది. మందు కలిపిన సీసా కూడా తమ గదిలో దొరికినట్లు విద్యార్థులు తెలిపారు. ఈ ఘటనకు ఓ ఉపాధ్యాయుడు, ప్రత్యేక అధికారి మధ్య ఉన్న గొడవే కారణమని విద్యార్థులు అంటున్నారు. ప్రత్యేక అధికారిని ఇరికించేందుకు ఆ ఉపాధ్యాయుడు నీళ్లల్లో గడ్డి మందు కలిపాడని ఆరోపిస్తున్నారు. గడ్డి మందు నీళ్లలో కలిపిన ఆ ఉపాధ్యాయుడు తమ దుప్పట్లపై కూడా దానిని చల్లి ఆ నెపాన్ని తమపై నెట్టేసే ప్రయత్నం చేశాడని చెబుతున్నారు. శనివారం ఉదయం హాస్టల్‌ను సందర్శించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, డీఎస్పీ సంపత్‌రావుకు ఈ విషయాలను విద్యార్థులు వెల్లడించారు. పాఠశాలలో పనిచేస్తున్న ఎస్‌వో, మరో ముగ్గురు ఉపాధ్యాయులకు తరచుగా గొడవలు జరుగుతున్నాయని తెలిపారు. ముగ్గురు ఉపాధ్యాయులు తరచూ తమను తరచూ వేధిస్తున్నారని చెప్పారు.

విధుల నుంచి నలుగురి తొలగింపు..

కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే హాస్టల్‌కు చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి దీనికి కారణమైన ఉపాధ్యాయుడు రాజేందర్‌తోపాటు మరో ఇద్దరు ఉపాధ్యాయులు వేణు, సూర్యకిరణ్, వంట కార్మికురాలు రాజేశ్వరిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు పేర్కొంటూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

హైదరాబాద్ భవిష్యత్తు కోసం హైడ్రా

సంస్థ ఏం చేస్తుందో కాలమే చెబుతుంది.. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకర పరిస్థితులు

నాడు దూషించిన వారినుంచి నేడు జేజేలు

దావూద్ ఇబ్రహీం తరహాలో బెదిరింపులు

ఫాతిమా కాలేజీపైనా చర్యలు!!

'మీట్ ది ప్రెస్'లో హైడ్రా కమిషనర్ రంగనాథ్



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): "హైడ్రా ఏం చేస్తుందన్నది ఏడాదిలో అందరికీ అర్థమవుతుంది. కాలగమనంలో హైడ్రా విశిష్టత తెలుస్తుంది. వంద, రెండు వందల ఏళ్ల హైదరాబాద్ భవిష్యత్తు కోసం.. భవిష్యత్ తరాల ఆరోగ్య జీవనం కోసం సంస్థ పని చేస్తోంది" అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. గతంలో చెరువుల్లో ఆక్రమణలు తొలగించినప్పుడు శాపనార్థాలు పెట్టిన వారే.. దూషించిన వారే.. ఇప్పుడు చెరువుల వద్ద జరుగుతున్న అభివృద్ధిని చూసి జేజేలు కొడుతున్నారని, కూకట్‌పల్లిలోని నల్లచెరువు ఇందుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. "పర్యావరణ పరిరక్షణ, ప్రభుత్వ ఆస్తుల రక్షణ, విపత్తుల నిర్వహణ కోసం హైడ్రా ఏర్పాటైంది. దీనిని జాగ్రత్తగా ముందుకు తీసుకెళ్లాలి. సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దాలి. సంస్థ ప్రారంభమైన తొలినాళ్లలో కొన్ని పొరపాట్లు జరిగాయి. వాటినిదిద్దుకుంటూ ముందుకు వెళ్తున్నాం" అని స్పష్టం చేశారు. ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు విరాహత్ అలీ ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన 'మీట్ ది ప్రెస్'లో రంగనాథ్ పలు అంశాలపై మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా హైడ్రా పనిచేస్తుందని, ఈ సంస్థ ఎప్పటికీ ఉంటుందని స్పష్టంచేశారు. హైడ్రా వల్ల ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందా? లేదా? అన్నది కాలమే నిర్ణయిస్తుందని రంగనాథ్ పేర్కొన్నారు. హైడ్రాకు 25వేల ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై చర్యలుతీసుకుంటామని చెప్పారు. మీట్ ద ప్రెస్ వివరాలు ఆయన మాటల్లోనే..

16 నుంచి 28 ఎకరాలకు..

మొదటివిడతగా ఆరు చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టాం. ఇందులో కూకట్‌పల్లి నల్లచెరువు ఒకటి. గతంలో ఈ చెరువు వద్ద 16 నివాసేతర ఆక్రమణలను తొలగించినప్పుడు విమర్శలు వచ్చాయి. ఇటీవల ఆ చెరువు వద్దకు వెళ్తే.. స్థానికులు వచ్చి, సంతోషం వ్యక్తంచేశారు. ఆక్రమణల తొలగింపుతో కొందరికి ఇబ్బంది కలగొచ్చు.. కానీ చాలా మందికి ఉపయుక్తంగా ఉంది. 16 ఎకరాలు ఉన్న ఆ చెరువు విస్తీర్ణం ఇప్పుడు 28 ఎకరాలకు పెరిగింది. ఆదివారం చెరువు పరిసరాల్లో పిక్నిక్ వాతావరణం ఉంటోంది.

ఏ కాలేజీ అయినా చట్టప్రకారమే...

ఫాతిమా కాలేజీ భవనాలకు మినహాయింపు లేదు. అక్కడి సల్కం చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారణ పూర్తయ్యాక చట్ట ప్రకారం ముందుకెళ్తాం. విద్యాసంవత్సరం మధ్యలో కూల్చివేతలు చేపడితే విద్యార్థులకు ఇబ్బంది అవుతుందని భావించాం. ఫాతిమా కాలేజీ అయినా మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి విద్యాసంస్థలైనా చట్ట ప్రకారం వ్యవహరిస్తాం. గండిపేటలో ప్రజాప్రతినిధుల అతిథి గృహాలు, ఇతర ఆక్రమణలను కూల్చివేశాం. హిమాయత్‌సాగర్‌కు సంబంధించి ప్రాథమిక ఎఫ్‌టీఎల్ ప్రకటన వెలువడాల్సి ఉన్నందున.. చర్యలు తీసుకోలేకపోయాం. వాతావరణ సమాచారంలో కొంత అస్పష్టత ఉందని, క్షేత్రస్థాయిలో తగిన సదుపాయాలతో ఈ సమస్యను అధిగమించవచ్చు. ఇటీవల భారీ వర్షాలు పడతాయని అప్రమత్తమైనా.. ఆ స్థాయిలో వానపడలేదు.

ఇప్పటి వరకు రూ.30 వేల కోట్ల విలువైన 500ఎకరాలకుపైనా ప్రభుత్వ భూములు, పార్కులు, చెరువుల ఆక్రమణ స్థలాలను స్వాధీనం చేసుకున్నాం. భవిష్యత్‌లో కబ్జా అయ్యే అవకాశాలున్న స్థలాల చుట్టూ కంచె వేస్తున్నాం. ఈ క్రమంలో బెదిరింపులు వస్తున్నాయి. బతుకమ్మ కుంట విషయంలో దావూద్ ఇబ్రహీం తరహాలో కొందరు భయపెట్టే ప్రయత్నాలు చేశారు. ఇప్పటి వరకు 80%చెరువులకు ప్రాథమిక నోటిఫికేషన్ మాత్రమే విడుదలైంది. ఎఫ్‌టీఎల్‌ను ఇంకా నిర్ధారించలేదు. శాస్త్రీయంగా, సాంకేతికంగా, చట్టపరంగా.. సర్వే ఆఫ్ ఇండియా టోపోషీట్స్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ మ్యాపులు, రెవెన్యూ, నీటిపారుదల రికార్డుల ఆధారంగా ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారిస్తాం. ఎన్‌జీఆర్‌ఐ సహకారంతో ఏయే ప్రాంతాల్లో ఎక్కువ నీరు భూమిలోకి ఇంకే అవకాశముందో గుర్తించి.. తొలుత అక్కడి చెరువులను పునరుద్ధరిస్తాం. తద్వారా భూగర్భ జలాలు పెరిగే అవకాశముంటుంది. చాలా చెరువుల్లో ప్రతీ 100 లీటర్ల వర్షపు/వరద నీటిలో 2-3లీటర్లే భూమిలోకి ఇంకుతున్నాయి. చెరువుల తరహాలో నాలాలనూ నోటిఫై చేస్తాం. గతంలో నాలాల వెడల్పు, లోతు ఎంత ఉండేది? ఇప్పుడు ఎంత ఉందన్న లెక్కలు తీస్తున్నాం. నివాసాల జోలికి వెళ్లకుండా.. ఇతర ఆక్రమణలను తొలగిస్తాం. 55 కిలోమీటర్ల మేర ఉన్న బుల్కాపూర్ నాలా.. కొన్ని చోట్ల మూసుకుపోయింది. దాన్ని పునరుద్ధరిస్తున్నాం. సున్నం చెరువు, ఇతర జల వనరుల్లో నీటి నమూనాలను పరీక్షించాం. క్యాన్సర్ కారకాలు, సంతానోత్పత్తిపై ప్రభావం చూపే, ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే అవశేషాలు ఉన్నట్లు గుర్తించాం. హుస్సేన్‌సాగర్‌లో నీటి నాణ్యత మెరుగుపడాలని ఆకాంక్షిస్తున్నాం. హైదరాబాద్‌ను ప్లాస్టిక్-ఫ్రీ మార్చాలని నిర్ణయించాం.

రేపు ఓయూకి రేవంత్‌రెడ్డి

» రెండు దశాబ్దాల తర్వాత వర్సిటీలో సీఎం కార్యక్రమాలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఉద్యమాలకు ఊపిరి పోసిన ఉస్మానియా యూనివర్సిటీలో రెండు దశాబ్దాల తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమాలు జరగనున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం (ఈ నెల 25న) ఓయూకు రానున్నారు. రాష్ట్ర విద్యారంగంలో సమూల మార్పులపై ఈ సందర్భంగా సీఎం ప్రసంగించనున్నారు. సీఎం రాక నేపథ్యంలో సుదీర్ఘకాలంగా వర్సిటీలో నెలకొని ఉన్న అనేక సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నంలో విద్యార్థులు ఉన్నారు. వాస్తవానికి ఉస్మానియా వర్సిటీలో టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను ఎప్పుడో ఉమ్మడి రాష్ట్ర హయాంలో భర్తీ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఒక్క ఖాళీ పోస్టునూ భర్తీ చేయలేదు. ఇంజనీరింగ్, సైన్స్, ఆర్ట్స్ ఇలా అనేక కోర్సులకు సంబంధించి పెద్ద ఎత్తున ఖాళీలున్నాయి. ఇంజనీరింగ్ కోర్సుల్లో ఒక్క ప్రొఫెసర్ కూడా లేరు. కాంట్రాక్టు, గెస్ట్ లెక్చరర్లతోనే కోర్సును కొనసాగిస్తున్నారు. ఉర్దూ డిపార్ట్‌మెంట్‌లో 19 మంది అధ్యాపకులకుగాను నలుగురే ఉన్నారు. సైకాలజీలో, ఫిలాసఫీలో ఇద్దరు మాత్రమే ప్రొఫెసర్లున్నారు. వర్సిటీలో 1400 టీచింగ్ పోస్టులకుగాను ప్రస్తుతం వెయ్యి వరకు ఖాళీగా ఉన్నాయి. నాన్‌టీచింగ్ పోస్టులు 2300 వరకు ఖాళీగా ఉన్నాయి. దీంతో అకాడమిక్ నిర్వహణ పూర్తిగా దెబ్బతిన్నది. ఉస్మానియా యూనివర్సిటీని 1917లో స్థాపించినప్పుడు నిజాం రాజు పెద్ద ఎత్తున భూసేకరణ చేపట్టి ఎకరాకు రూ.2 చొప్పున సుమారు 2200 ఎకరాల మేర సేకరించి వర్సిటీ పేరుమీద రాసిచ్చారు. అయితే 1950లో ఉస్మానియా యూనివర్సిటీ భూమి 1627 ఎకరాలున్నట్లుగా ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఆ తర్వాత కాలంలో రాజకీయ ప్రాబల్యంతోనే యూనివర్సిటీల భూములు కబ్జాకు గురయ్యాయి. వివాదంలో ఉన్న 251.64 ఎకరాలపై కోర్టు విచారణ సందర్భంలో సరైన పత్రాలను అందించడంలోనూ వర్సిటీ అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. వర్సిటీ భూములను సర్వే చేసి హద్దులు నిర్ణయించాల్సిన అవసరం ఉంది. ఉస్మానియా యూనివర్సిటీ ఎన్నికల్లో గెలిచిన ఎంతో మంది రాష్ట్ర స్థాయి నేతలుగా ఎదిగారని, దీన్ని దృష్టిలో పెట్టుకొని యూనివర్సిటీలో ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

రేపు ఓయూలో సీఎం కార్యక్రమాలివే..!

ఉస్మానియా వర్సిటీలో రూ.80 కోట్ల వ్యయంతో నిర్మాణమై 1200 మంది విద్యార్థులకు వసతి కల్పించే రెండు హాస్టళ్లను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆర్థిక సహాయంతో మరో 300 మంది విద్యార్థులకు వసతి కల్పించే రెండు కొత్త హాస్టళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. రూ.10 కోట్ల వ్యయంతో డిజిటల్ లైబ్రరీ రీడింగ్ రూం పనులను ప్రారంభించనున్నారు. ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో 'తెలంగాణ విద్యా రంగంలో మార్పులు ప్రభుత్వ ప్రణాళిక' అనే అంశంపై సీఎం ప్రసంగించనున్నారు.

సౌర కారిడార్‌గా ఓఆర్ఆర్

» వంద మెగావాట్ల విద్యుదుత్పత్తికి ప్రణాళిక

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరానికి మణిహారంగా ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) సౌర కారిడార్‌గా మారనుంది. ఇప్పటికే దీని వెంట సుమారు 21 కిలోమీటర్ల మేర ఉన్న సైకిల్ ట్రాక్‌పై సౌర రూఫ్‌టాప్ ఏర్పాటు చేయడంతో 16 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. అలాగే 158 కిలోమీటర్ల పొడవున ఉన్న ఓఆర్ఆర్ సెంట్రల్ మీడియన్‌లో సౌర రూఫ్‌టాప్ ఏర్పాటు చేసి 100 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి హెచ్ఎండీఏలోని హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్(హెచ్‌జీసీఎల్) ప్రణాళికలు రూపొందిస్తోంది. ఓఆర్ఆర్‌ను సౌర కారిడార్‌గా మార్చేందుకు డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్) తయారు చేయడానికి కన్సల్టెన్సీ నియామకానికి చర్యలు చేపడుతోంది. దక్షిణ కొరియా దేశంలోని ప్రధాన రోడ్డుపై సైక్లింగ్ ట్రాక్‌తో పాటు సెంట్రల్ మీడియన్‌లో సౌర విద్యుత్ ప్యానళ్లను ఏర్పాటు చేశారు. ఇలా ఉత్పత్తి అయ్యే సౌర విద్యుత్‌తో అక్కడ రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలుగుతుంటాయి. అదే తరహాలో ఇక్కడ ఓఆర్ఆర్‌పై చేపట్టాల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందించేందుకు కన్సల్టెన్సీ నియామకానికి హెచ్‌జీసీఎల్ టెండర్లను ఆహ్వానించింది.

వాట్సాప్ సందేశాల ఆధారంగా అట్రాసిటీ కేసు చెల్లదు

» బహిరంగంగా దూషిస్తేనే కేసు: హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్, ఈ-మెయిల్ వంటి ప్రైవేటు సందేశాల ఆధారంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం చెల్లదని హైకోర్టు స్పష్టం చేసింది. అవమానించే ఉద్దేశంతో అందరి ముందు బహిరంగంగా కులం పేరుతో దూషించినప్పుడు మాత్రమే ఆ కేసు వర్తిస్తుందని పేర్కొంది. కులాంతర వివాహం చేసుకున్న క్రాంతికిరణ్ (ఎస్సీ), నిరుపమ దాడి(ఓసీ) తర్వాత పొరపొచ్చాలు రావడంతో వైవాహిక బంధం నుంచి విడిపోయారు. విడాకులు కావాలని బెదిరించడంతోపాటు సందేశాల ద్వారా కులం పేరుతో దూషించారని క్రాంతికిరణ్ ఫిర్యాదు చేయడంతో నిరుపమ, వారి కుటుంబసభ్యులపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ కేసు కొట్టివేయాలని నిరుపమ కుటుంబ సభ్యులు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఇ.వి. వేణుగోపాల్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. కుటుంబ వివాదంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్లు వర్తించవని పేర్కొన్నారు. ఫిర్యాదుదారు క్రాంతి తరఫు న్యాయవాది వాదిస్తూ.. ఎస్సీ పేరుతో ఎలా దూషించారు? ఎలా అవమానించారనే విషయాలు దర్యాప్తులో తేలుతాయని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం... కులం పేరుతో దూషించడం బహిరంగంగా జరిగినట్లు ఆధారాలు లేవని, ఇది కుటుంబ వివాదం మాత్రమేనని అభిప్రాయపడింది. కుటుంబ వివాదంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును కొనసాగించడం చట్టపరమైన ప్రక్రియను దుర్వినియోగం చేయడం కిందకే వస్తుందని పేర్కొంటూ పిటిషనర్లపై కేసును కొట్టేసింది.

యూరియా కోసం పడిగాపులు

నిద్రాహారాలు మాని బారులు తీరిన అన్నదాతలు.. కరీంనగర్ జిల్లాలో చెప్పులు క్యూలో పెట్టి జాగారం

» మహబూబ్‌నగర్‌లోని కేంద్రం వద్ద రిక్షా కార్మికుడు మూర్ఛపోవడంపై వివాదం

» సిద్దిపేట జిల్లాలో క్యూలో ఖాళీ మద్యం సీసా పెట్టి రైతు నిరసన

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



నల్లగొండ జిల్లా నిడమనూరులో రైతుల క్యూ

రాష్ట్రంలో రైతులను యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి. అరకొరగా వస్తున్న యూరియాను అధికారులు టోకెన్లు జారీ చేసి.. పోలీసుల బందోబస్తు మధ్య పంపిణీ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తిలో యూరియా కోసం రైతులు జాగరణ చేస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున యూరియా వస్తుందనే సమాచారంతో రైతులు శనివారం రాత్రే చెప్పులు క్యూలో పెట్టి అక్కడే నిద్రిస్తున్నారు. మహబూబ్ నగర్‌లో యూరియా కేంద్రం వద్ద మూడు రోజులుగా రైతులు పడిగాపులు కాస్తున్నారు. ఈ కేంద్రాన్ని శనివారం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించారు. ఆ సమయంలో ఓ వ్యక్తి సొమ్మసిల్లిపడిపోగా అతన్ని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అతన్ని రైతుగా భావించిన శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులకు ఇలాంటి దుస్థితి ఎదురైందని విమర్శించారు. అయితే, సొమ్మసిల్లి పడిపోయిన వ్యక్తి రిక్షా కార్మికుడని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. హన్వాడలో రైతులు రోడ్డుపై బైఠాయించారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామ రైతు వేదిక వద్దకు యూరియా వచ్చిందని తెలియడంతో శనివారం రైతులు భారీగా వచ్చారు. వ్యవసాయాధికారులను రైతు వేదికలో నిర్బంధించారు. అంతకుముందు రైతులు క్యూలో పాస్ బుక్‌లు, ఖాళీ మద్యం సీసా పెట్టారు. రాష్ట్రంలో యూరియా దొరకడం లేదని, మద్యం ఏరులై పారుతోందని విమర్శించారు. పోలీసు బందోబస్తు మధ్య యూరియా పంపిణీ చేశారు. రాయపోల్ మండలం అంకిరెడ్డిపల్లి, మెదక్ జిల్లా హవేళిఘణపూర్, పెద్దశంకరంపేటలో రైతులు భారీగా బారులుతీరారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నిడమనూరు పీఏసీఎస్ కార్యాలయం ఎదుట టోకెన్ల కోసం రైతులు గంటలకొద్దీ ఎదురుచూశారు. పోలీసు పహారాలో యూరియా పంపిణీ చేశారు. కొండమల్లేపల్లి, పెద్ద అడిశర్లపల్లి, కనగల్, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో శనివారం ఉదయం 6 గంటల నుంచే యూరియా కోసం వేచిచూశారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లిలో రైతులు గంటల తరబడి నిరీక్షించారు. యూరియా దక్కకపోవడంతో వనపర్తి జిల్లా ఆత్మకూరులో ఓ రైతు మండల వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంపై అధికారులు లేని సమయంలో రాళ్లు రువ్వాడు. మహబూబాబాద్ సొసైటీకి 660 బస్తాల యూరియా రావడంతో 5 రోజుల క్రితం ఇచ్చిన టోకెన్ల ప్రకారం పోలీసు బందోబస్తు నడుమ పంపిణీ చేశారు. మరిపెడలో ఉదయం 6 గంటల నుంచి రాత్రి వరకు పడిగాపులు కాసారు. మొత్తం 763 బస్తాల యూరియా రాగా, 2 వేలకు పైగా రైతులు వచ్చారు. గూడూరు సొసైటీకి 650 బస్తాల యూరియా రాగా 1,200 మందికి పైగా రైతులు చేరుకున్నారు. పలువురు రైతులు సొసైటీ గేటు వద్ద ఆందోళన చేపట్టారు. కొత్తగూడ మండలం పొగుళ్లపల్లి సొసైటీకీ రైతులు భారీగా తరలివచ్చారు. ఆధార్, పట్టా పత్రాలను క్యూలైన్‌లో పెట్టారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్‌లోని వెన్కేపల్లి సొసైటీకి 450 బస్తాల యూరియా రావడంతో ఒక్కొక్కటి చొప్పున పంపిణీ చేశారు. అయినా లైన్‌లో చివరి రైతులకు యూరియా అందలేదు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం సనుగుల సొసైటీలో శనివారం రైతులకు టోకెన్లను జారీ చేసి 225 యూరియా బస్తాలు పంపిణీ చేశారు. సాంకేతిక సమస్యతో రైతులు రెండు గంటల పాటు పడిగాపులు కాయాల్సి వచ్చింది. కరీంనగర్ జిల్లా గంగాధరలో, చిగురుమామిడిలో ప్రధాన రహదారిపై శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఖమ్మం జిల్లాలోని కారేపల్లిలో రైతులు బస్టాండ్ సెంటర్ రోడ్డుపై బైఠాయించారు.

సుప్రీంకోర్టును అవమానపర్చిన అమిత్ షా

» జస్టిస్ సుదర్శన్ రెడ్డిపై విమర్శలు సరికాదు: మల్లు రవి

» ఆయన ఆదరణను బీజేపీ తట్టుకోలేకపోతోంది: జీవన్‌రెడ్డి

» రేవంత్ సర్కారుపై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు: చిన్నారెడ్డి

న్యూఢిల్లీ/హైదరాబాద్/నార్కట్‌పల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి, జస్టిస్ సుదర్శన్‌రెడ్డిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా విమర్శలు చేయడం సరికాదని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. సల్వాజుడుంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఇచ్చిన తీర్పును విమర్శించడం.. ఆయన నక్సలిజాన్ని ప్రోత్సహించారనడం.. సుప్రీంకోర్టును అవమానపర్చడమేనని చెప్పారు. శనివారం ఢిల్లీలో మల్లు రవి మీడియాతో మాట్లాడుతూ.. అన్ని వ్యవస్థలతో పాటు సుప్రీంకోర్టు ప్రమాణాలను దిగజార్చడమే కేంద్రం లక్ష్యంగా కనిపిస్తోందని విమర్శించారు. ఆదివాసీలను ఆదివాసీలతో హత్య చేయించేందుకు ప్రభుత్వమే ప్రైవేట్ సేనను ప్రోత్సహించడం రాజ్యాంగ విలువలకు వ్యతిరేకమని జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారని.. చట్ట ప్రకారమే ఆనాడు తీర్పునిచ్చారని చెప్పారు. కాంగ్రెస్ కూడా నక్సలిజాన్ని సమర్థించబోదని స్పష్టం చేశారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి బెంబేలెత్తిన బీజేపీ నేతలు.. ఆయనపై నక్సల్ సానుభూతిపరుడిగా ముద్ర వేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డి మండిపడ్డారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. సుదర్శన్‌రెడ్డి.. రాజ్యాంగ విలువలకు కట్టుబడ్డ వ్యక్తి అని, ఆయన అభ్యర్థిత్వం పట్ల హర్షం వ్యక్తం చేయాల్సింది పోయి ఆరోపణలు చేయడం విచారకరమన్నారు. సోషలిస్టు భావాలు గల సుదర్శన్‌రెడ్డికి ఇండియా కూటమి పార్టీలతో పాటుగా ఇతర పార్టీల వారూ మద్దతు తెలపాలని కోరారు. రేవంత్ సర్కారును బద్నాం చేసేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు పన్నుతున్నాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి మండిపడ్డారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ఈ ఆగస్టు వరకు 8.30 లక్షల టన్నుల యూరియా కేంద్రం నుంచి రావాల్సి ఉండగా... ఇప్పటివరకు 5.36లక్షల టన్నుల యూరియానే వచ్చిందని ఓ ప్రకటనలో తెలిపారు.

కేసీఆర్‌లో వణుకు: చామల

కాళేశ్వరం పేరు చెబితేనే కేసీఆర్‌లో వణుకు పుడుతోందని ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. నార్కట్‌పల్లిలో రూ.18 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం చామల మాట్లాడుతూ.. కాళేశ్వర నివేదికను అసెంబ్లీలో చర్చకు పెడతామంటే.. కేసీఆర్, హరీశ్ కోర్టు కెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

ఈ ఏడాది ఆదాయంలో 20 శాతం వృద్ధి

భారత బీమా రంగంలో అపార అవకాశాలున్నాయి. అయితే ప్రజల్లో ఇప్పటికీ బీమా పట్ల అవగాహన చాలా తక్కువ. దేశంలో నూటికి 83 శాతం మందికి బీమా రక్షణ లేదు. ప్రజల్లో కొద్దిగా అవగాహన కల్పిస్తే బీమా రంగం దూసుకుపోవటం ఖాయమంటున్నారు టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఎండీ, సీఈఓ వెంకీ అయ్యర్. బీమా రంగ పనితీరు, తెలుగు రాష్ట్రాల్లో టాటా ఏఐఏ లైఫ్ కార్యకలాపాల గురించి ఆయన 'ఆంధ్రజ్యోతి బిజినెస్'తో ఇష్టాగోష్ఠిగా ముచ్చటించారు. ఆ వివరాలు..



- ఏపీ, తెలంగాణ నుంచి 7% ఆదాయం
- రూ.1.22 లక్షల కోట్లకు ఏయూఎం
- టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈఓ వెంకీ అయ్యర్

దేశంలో చాలా మందికి బీమా రక్షణ లేకపోవటానికి కారణం?

ప్రజలకు పాలసీల ప్రీమియం అందుబాటులో లేకపోవటం కంటే సరైన అవగాహన లేకపోవటం ఇందుకు ప్రధాన కారణం. ఒకవేళ అవగాహన ఉన్నా పాలసీలు తీసుకునేలా చేయటం చాలా కష్టం. అందుకే బీమా పట్ల అవగాహన కల్పించేందుకు బీమా కంపెనీలన్నీ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. భారత బీమా నియంత్రణ అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) కూడా ఇందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.

భారత జీవిత బీమా పరిశ్రమ భవిష్యత్‌పై మీ అంచనా?

దేశంలో బీమా పరిశ్రమ అభివృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయి. మన జనాభాలో ఇప్పటికీ 83 శాతం మందికి బీమా రక్షణ లేదు. ఇది బీమా రంగానికి పెద్ద అవకాశం. అయితే ఇందు కోసం కొన్ని సంస్కరణలు కూడా అవసరం. అంతేకాదు ప్రజల్లో బీమా తప్పనిసరిగా తీసుకోవాలన్న ఆలోచన వస్తే బీమా రంగం మరింత వృద్ధి పథంలోకి దూసుకుపోవటం ఖాయం. ప్రస్తుతం దేశీయ బీమా పరిశ్రమ ఏటా రెండంకెల వృద్ధి రేటు నమోదు చేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) ముగిసే నాటికి బీమా రంగ మార్కెట్ రూ.20 లక్షల కోట్లకు చేరుకోవచ్చని అంచనా. ఇక జీవిత బీమా రంగం కూడా రెండంకెల వృద్ధిని నమోదు చేస్తూ వస్తోంది.

2024-25లో బీమా కంపెనీల ప్రీమియం వసూళ్లు?

2024-25 ఆర్థిక సంవత్సరంలో జీవిత బీమా కంపెనీల మొత్తం ప్రీమియం వసూళ్లు రూ.1.49 లక్షల కోట్ల నుంచి రూ.1.66 లక్షల కోట్ల వరకు ఉంది. అందులో ప్రైవేట్ కంపెనీల వాటా రూ.92,000 కోట్ల నుంచి రూ.1.04 లక్షల కోట్ల వరకు ఉంది.

గత ఆర్థిక సంవత్సరం సంస్థ ప్రీమియం వసూళ్లు?

మార్చితో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో టాటా ఏఐఏ లైఫ్ ప్రీమియం ఆదాయం రూ.31,000 కోట్ల వరకు ఉంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఇది 20 శాతం ఎక్కువ. ఇందులో రూ.9,200 కోట్ల వరకు తొలిసారిగా పాలసీలు తీసుకున్న వారి నుంచి వచ్చింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సంస్థ వృద్ధి రేటు అంచనా?

ప్రీమియం ఆదాయ వృద్ధి రేటు ఈసారి కొంత స్తబ్ధుగా ఉండవచ్చని భావిస్తున్నాం. గత ఆర్థిక సంవత్సరం వృద్ధి రేటు 20 శాతంగా ఉంది. ఈ ఏడాది కూడా అదే స్థాయిలో ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం సంస్థ క్లెయిమ్స్ సెటిల్మెంట్ నిష్పత్తి 99.3 శాతం వరకు ఉంది. ప్రస్తుతం సంస్థ నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎం) రూ.1.22 లక్షల కోట్లుగా ఉంది.

కొత్త పాలసీలు ఏమైనా తీసుకువస్తున్నారా?

మార్కెట్ అవసరాలను బట్టి పాలసీలు మారుతుంటాయి. ప్రస్తుతం ప్రొటెక్షన్, చిల్డ్రన్స్, సేవింగ్స్, వెల్త్ క్రియేషన్, రిటైర్మెంట్, హెల్త్‌తో సహా అన్ని రకాల పాలసీలను అందిస్తున్నాం. మహిళల కోసం ఈ మధ్యనే శుభ శక్తి పేరుతో కొత్త పాలసీ ప్రారంభించాం. మహిళల జీవిత అవసరాలు, ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పాలసీని రూపొందించాం. ప్రజల దీర్ఘకాలిక పొదుపు, రక్షణ అవసరాలను తీర్చేందుకు వీలుగా కొత్త పాలసీలు తీసుకొస్తాం.

మొత్తం ప్రీమియం వసూళ్లలో తెలుగు రాష్ట్రాల వాటా?

టాటా ఏఐఏ లైఫ్ మొత్తం ప్రీమియం వసూళ్లలో తెలుగు రాష్ట్రాల వాటా 5 నుంచి 7 శాతం వరకు ఉంది. ఏపీతో పోలిస్తే తెలంగాణ నుంచి వసూళ్లు ఎక్కువ. 2024-25 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణలో ప్రీమియం ఆదాయం 40 శాతం వృద్ధితో రూ.1,040 కోట్ల నుంచి రూ.1,460 కోట్లకు పెరిగింది. ఏపీలో 34 శాతం వృద్ధి చెంది రూ.503 కోట్ల నుంచి రూ.675 కోట్లకు చేరుకుంది. కొత్త ప్రీమియం ఆదాయం తెలంగాణలో 61 శాతం వృద్ధితో రూ.627 కోట్లకు చేరుకోగా, ఏపీలో 31 శాతం వృద్ధి చెంది రూ.266 కోట్లకు పెరిగింది. ఈ ఏడాది జూలై నాటికి తెలంగాణలో 21,744 మంది ఏజెంట్లు ఉండగా ఏపీలో 18,801 మంది ఏజెంట్లు ఉన్నారు.

ఈక్విటీ క్యాష్ మార్కెట్లో సీఏఎస్‌కు కొత్త నియమావళి

సెబీ ప్రతిపాదన

ఈక్విటీ క్యాష్ మార్కెట్లో క్లోజింగ్ యాక్షన్ సెషన్ (సీఏఎస్)కు సెబీ కొత్త నియమావళిని ప్రతిపాదించింది. దశల వారీగా అమలు చేయనున్న కొత్త విధానంలో తొలుత అధిక లిక్విడిటీ కలిగిన డెరివేటివ్ స్టాక్స్ ముగింపు ధరను నిర్ణయించనున్నారు. తద్వారా గడించే అనుభవం ఆధారంగా అన్ని స్టాక్స్‌కు ఈ విధానాన్ని వర్తింపజేయాలని సెబీ ప్రతిపాదించింది. మార్కెట్లో ఒడుదుడుకులు తగ్గించేందుకు, పారదర్శకత పెంచేందుకు, పెద్ద ఇన్వెస్టర్లు సులువుగా ట్రేడింగ్ చేపట్టేందుకు ఇది దోహదపడవచ్చని సెబీ భావిస్తోంది. ఏదైనా షేరు ముగింపు ధరను నిర్ణయించేందుకు చివర్లో నిర్వహించే స్వల్పకాలిక ట్రేడింగ్ సెషనే సీఏఎస్. గతంలో ప్రతిపాదించిన 3.30-3.45 గంటల మధ్య 15 నిమిషాల పాటు కాకుండా ఈ సెషన్‌ను 3.15-3.35 గంటల మధ్య 20 నిమిషాల పాటు నిర్వహించాలని సెబీ తాజాగా ప్రతిపాదించింది.

బ్లాక్ డీల్ కనీస సైజు రూ.25 కోట్లకు పెంపు

బ్లాక్ డీల్ విండో ద్వారా చేపట్టే ట్రేడింగ్ కనీస ఆర్డర్ సైజును ప్రస్తుత రూ.10 కోట్ల నుంచి రూ.25 కోట్లకు పెంచాలని సెబీ ప్రతిపాదించింది. ప్రస్తుత పరిమితి 2017 నుంచి కొనసాగుతోంది. స్టాక్ ఎక్స్ఛేంజీలో కొనుగోలుదారు, విక్రేత మధ్య ఒకే లావాదేవీ ద్వారా భారీ సంఖ్యలో జరిగే షేర్ల విక్రయాన్నే బ్లాక్ డీల్ అంటారు. స్టాక్ ఎక్స్ఛేంజీలు రోజులో రెండుసార్లు కల్పించే 15 నిమిషాల ప్రత్యేక ట్రేడింగ్ విండో ద్వారానే ఈ బ్లాక్ డీల్స్ చేపట్టేందుకు వీలుంటుంది. ఇందుకోసం ఎక్స్ఛేంజీలు ఉదయం 8.45-9 గంటల మధ్య, మధ్యాహ్నం 2.05-2.20 గంటల మధ్య మరో సెషన్‌ను నిర్వహిస్తాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (ప్రతి 100 గుడ్లు)


24 తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	535
వరంగల్	497	గోదావరి	530
చిత్తూరు	558	విశాఖపట్నం	530
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	95	విజయవాడ	109
వరంగల్	95	గుంటూరు	109
కరీంనగర్	95	ఒంగోలు	109
మహబూబ్‌నగర్	95	చిత్తూరు	83
కర్నూలు	95	నెల్లూరు	88
విశాఖపట్నం	113	అనంతపురం	88
గోదావరి	109		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,620 ▲	93,150 ▲	1,30,000 ▲
విజయవాడ	1,00,700 ▲	96,500 ▲	1,12,000 ▼
విశాఖపట్నం	1,00,690 ▼	92,300 ▼	1,30,000 ▲
రాజమండ్రి	1,01,620 ▲	93,150 ▲	1,17,500 ▲
ప్రొద్దుటూరు	1,01,750 ▲	93,610 ▲	1,18,500 ▲
ముంబై	99,360 ▲	91,010 ▲	1,13,900 ▲

ఐటీసీతో పన్ను చెల్లింపులు.. వడ్డీ మినహాయింపు ఎప్పుడు?

ఇదీ GST



రాంబాబు గొండాల

జీఎస్‌టీలో నమోదై రిటర్న్ దాఖలు చేస్తూ పన్ను చెల్లించే వారిలో చాలా మందికి ఉండే ఆలోచన ఏమిటంటే పన్ను చెల్లింపు ఆలస్యమైనప్పటికీ ఆ మొత్తాన్ని నగదు ద్వారా కాకుండా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) ద్వారా చెల్లిస్తే ఎలాంటి వడ్డీ చెల్లించనవసరం లేదని. కానీ, ఇది కొంతవరకే నిజం. ఈ అవగాహన లోపంతో చాలా మంది పొరపాట్లు చేస్తున్నారు. ఇలాంటి వారికి వడ్డీ చెల్లించమని నోటీసులు వస్తున్నాయి. అసలు ఈ విషయాన్ని ఎలా అర్థం చేసుకోవాలో చూద్దాం.

ఇంతకు ముందు ఉన్న విధానంతో పోలిస్తే జీఎస్‌టీలో రిటర్న్ దాఖలు చేసే పద్ధతి కొంచెం భిన్నంగా ఉంటుంది. అంటే ఆ నెలకు చెల్లించాల్సిన మొత్తం చెల్లిస్తే గానీ రిటర్న్ దాఖలు కాదు. ఉదాహరణకు ఒక వ్యక్తి రూ.50,000 పన్ను చెల్లించాల్సి ఉండగా రూ.40,000 ఐటీసీ ఉందనుకుందాం. అంటే మిగతా రూ.10,000 నగదు ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. కానీ, సమయానికి రూ.10,000 లభించక రిటర్న్ వాయిదా పడింది. ఒక నాలుగు నెలల తర్వాత తనకు నగదు సర్దుబాటు అయిన తర్వాత మొత్తం రూ.50,000తో రిటర్న్ దాఖలు చేశాడు, సకాలంలో రిటర్న్ దాఖలు చేయనందుకు తాను లేట్ ఫీజు కూడా చెల్లించాడు. అయితే ప్రభుత్వానికి సకాలంలో పన్ను చెల్లించలేదు కాబట్టి పన్ను చెల్లించాల్సిన తేదీ నుంచి చెల్లింపు జరిగిన తేదీ వరకు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. మరి ఈ వడ్డీ ఎంత మీద చెల్లించాలనే దాని మీద మొదట్లో కొంత గందరగోళం ఉండేది. చెల్లించాల్సిన మొత్తం రూ.50,000 కాబట్టి ఆ మొత్తం మీద వడ్డీ చెల్లించాలి అని ఒక వాదన కాగా, రూ.40,000 సదరు వ్యక్తికి ఐటీసీ రూపంలో నిర్ణీత గడువు నాటికే అందుబాటులో ఉంది కాబట్టి నగదు రూపంలో చెల్లించిన రూ.10,000 మీద మాత్రమే వడ్డీ వర్తిస్తుందని మరొక వాదన. మొత్తానికి దీనికి సంబంధించి ప్రభుత్వం కొంత వివరణ ఇచ్చింది. సంబంధిత సెక్షన్‌ను సవరించింది. దీని ప్రకారం రిటర్న్ ఆలస్యంగా దాఖలు చేసిన సందర్భంలో ఐటీసీ ద్వారా చెల్లించిన పన్ను మేరకు ఎలాంటి వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదు. అంటే నగదు ద్వారా చెల్లించిన పన్నుకు మాత్రమే వడ్డీ వర్తిస్తుంది. పై ఉదాహరణలో రూ.40,000 ఐటీసీ ద్వారా చెల్లించటం జరిగింది కాబట్టి దాని మీద వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదు. కేవలం రూ.10,000 మీద మాత్రమే వడ్డీ చెల్లించాలి.

కానీ ఇక్కడ కొన్ని షరతులు ఉన్నాయి. రిటర్న్ దాఖలు చేయటం ఆలస్యమైనప్పటికీ ఆ రిటర్న్ పీరియడ్‌కు సంబంధించిన వివరాలు అన్ని ఆ రిటర్న్‌లో కచ్చితంగా చూపాలి. ఉదాహరణకు ఒక వ్యాపారస్తుడు జనవరి నెలలో రూ.లక్ష అమ్మకాలు జరిపాడు. దానికి గాను రూ.12,000 పన్ను చెల్లించాలనుకుందాం. ఈ రూ.12,000కు గాను తన దగ్గర రూ.14,000 ఐటీసీ ఉంది. పన్ను చెల్లింపు మొత్తానికి ఐటీసీ సరిపోతుంది కాబట్టి నగదులో ఎలాంటి చెల్లింపులు అవసరం లేదు. అయితే జనవరి నెల రిటర్న్ ఏదో కారణంతో సకాలంలో ఫైల్ చేయకుండా ఒక రెండు నెలల తర్వాత వేసాడనుకుందాం. అయినప్పటికీ, ఆ రిటర్న్‌లో జనవరిలో జరిపిన రూ.లక్ష అమ్మకాలు మొత్తం చూపి, దానికి సంబంధించిన పన్నును నగదు ఉపయోగించకుండా ఐటీసీ ద్వారా చెల్లిస్తే ఎలాంటి వడ్డీ కట్టనవసరం లేదు. అలాకాకుండా అదే జనవరి రిటర్న్ సకాలంలో దాఖలు చేసి రూ.లక్షకు గాను రూ.60,000 అమ్మకాలు మాత్రమే చూపి మిగతా రూ.40,000 అమ్మకాలు ఫిబ్రవరి నెల రిటర్న్‌లో కలిపి చూపితే ఐటీసీ సరిపోను ఉన్నప్పటికీ వడ్డీ మినహాయింపు రాదు.

ఎందుకంటే రూ.40,000 జనవరికి సంబంధించినవి కాబట్టి. అంటే పన్ను చెల్లింపు ఆలస్యమైనప్పటికీ సంబంధిత రిటర్న్ ఏ పీరియడ్‌కు అయితే దాఖలు చేస్తున్నారో, ఆ పీరియడ్‌లో జరిపిన సరఫరాల వివరాలు అన్నీ చూపి తగిన పన్ను చెల్లించాలి. అలా చెల్లించినప్పుడు మాత్రమే ఐటీసీ ద్వారా జరిపిన చెల్లింపునకు వడ్డీ మినహాయింపు లభిస్తుంది. ఇంకొక షరతు ఏమిటంటే, రిటర్న్ దాఖలు చేయటమనేది అధికారులు చర్యలు తీసుకోవటానికి పూర్వమే జరిగి ఉండాలి. అప్పుడు మాత్రమే ఈ వడ్డీ మినహాయింపు లభిస్తుంది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

స్పోర్ట్స్

నార్త్ ఈస్ట్ నయా చరిత్ర



వరుసగా రెండోసారి డ్యూరాండ్ కప్ కైవసం

కోల్‌కతా: డిఫెండింగ్ చాంపియన్ నార్త్ ఈస్ట్ యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ స్థాయికి తగ్గ ఆటతీరుతో చెలరేగింది. డ్యూరాండ్ కప్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో యునైటెడ్ జట్టు 6-1 తేడాతో డైమండ్ హార్బర్ ఎఫ్‌సీని చిత్తు చేసింది. దీంతో 34 ఏళ్ల తర్వాత వరుసగా రెండుసార్లు టైటిల్ నెగ్గిన జట్టుగా నార్త్ ఈస్ట్ నయా చరిత్ర సృష్టించింది. తొలి అర్ధగంటపాటు ఇరు జట్లు హోరాహోరీగా పోరాడడంతో ఒక్క గోల్ కూడా నమోదు కాలేదు. చివరికి అషీర్ అక్తర్ (30వ నిమిషంలో) నార్త్ ఈస్ట్‌కు బోణీ చేశాడు. ఆ తర్వాత చెలరేగిన నార్త్ ఈస్ట్ ఆటగాళ్లు పార్థిబ్ (45), థోయ్ (50), జైరో (81), గైతాన్ (86), అజరే (90) తమ జట్టుకు గోల్స్ అందించారు. అటు డైమండ్ హార్బర్‌కు లభించిన ఏకైక గోల్ 68వ నిమిషంలో మైకేల్ కొర్తజార్ అందించాడు.



ముంబైలోని వాంఖడే స్టేడియంలో శరద్ పవార్ క్రికెట్ మ్యూజియం ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన తన విగ్రహం వద్ద దిగ్గజ బ్యాటర్ సునీల్ గవాస్కర్

రాష్ట్ర ఫెన్సింగ్ చీఫ్‌గా జ్వాల



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): మాజీ షట్లర్ గుత్తా జ్వాల తెలంగాణ రాష్ట్ర ఫెన్సింగ్ అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికైంది. కార్యదర్శిగా శ్రీనివాసరావు, సీనియర్ ఉపాధ్యక్షుడుగా శివయ్య, ఉపాధ్యక్షులుగా డీఎస్ కుమార్, ప్రభాకర్, ప్రవీణ్, నీరజ్, సహాయ కార్యదర్శిగా సందీప్ ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం 2029 వరకు కొనసాగనుంది.

మిక్స్‌డ్‌లో భారత్‌కు స్వర్ణం

ఆసియా షూటింగ్

షిమ్‌కెంట్ (కజకిస్థాన్): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో శనివారం భారత్‌కు స్వర్ణం లభించింది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఈవెంట్ ఫైనల్లో ఎలవెనిల్ వలరివన్/అర్జున్ ద్వయం 17-11తో చైనా జోడీ డింగ్/జిన్‌లూ పెంగ్‌ను ఓడించింది. జూనియర్ విభాగం10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ కేటగిరీలో శాంభవి/నరేన్ ద్వయం స్వర్ణం నెగ్గింది.

దక్షిణాఫ్రికాలో 44 మ్యాచ్‌లు

వన్డే వరల్డ్‌కప్ వేదికల ఖరారు

జొహెన్నెస్‌బర్గ్: రెండేళ్ల తర్వాత జరిగే పురుషుల వన్డే వరల్డ్‌కప్ వేదికలను క్రికెట్ సౌతాఫ్రికా (సీఎస్ఏ) ఖరారు చేసింది. 2027లో జరిగే ఈ మెగా టోర్నీకి దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. దీంట్లో భాగంగా మొత్తం 54 మ్యాచ్‌లు జరుగుతాయి. అయితే అత్యధికంగా 44 మ్యాచ్‌లకు సౌతాఫ్రికాలోని జొహెన్నెస్‌బర్గ్, ప్రిటోరియా, కేప్‌టౌన్, డర్బన్, గెబెరా, బ్లూమ్‌ఫోంటీన్, ఈస్ట్ లండన్, పార్ల్ వేదికలుగా ఉండనున్నాయి. మిగిలిన పది మ్యాచ్‌లు జింబాబ్వే, నమీబియాలో నిర్వహిస్తారు.

ఆదుకొన్న రాఘవి, షఫాలీ

- భారత్-ఎ రెండో ఇన్నింగ్స్ 260/8
- ఆసీస్-ఎ 305 ఆలౌట్

బ్రిస్బేన్: రాఘవి బిస్త్ (86), షఫాలీ వర్మ (52) అర్ధ శతకాలతో ఆదుకోవడంతో.. ఆస్ట్రేలియా-ఎతో అనధికార టెస్టులో భారత్-ఎ మహిళల జట్టు 254 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. మూడో రోజైన శనివారం ఆట ముగిసేసరికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 260/8 స్కోరు చేసింది. జోషిత (9), టిటాస్ సాధు (2) క్రీజులో ఉన్నారు. అమీ ఎడ్గర్ నాలుగు వికెట్లు పడగొట్టింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 158/5తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆస్ట్రేలియా-ఎ 305 పరుగులకు ఆలౌటైంది. మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ (299) స్కోరుకు ఆరు పరుగుల ఆధిక్యం నమోదు చేసింది. సియన్నా జింజర్ (103) సెంచరీ సాధించగా.. సైమా 3 వికెట్లు పడగొట్టింది.

ప్రేమ ప్రయాణం అలా మొదలైంది..



న్యూఢిల్లీ: టీమిండియా క్రికెటర్ రింకూసింగ్, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన లోక్‌సభ సభ్యురాలు ప్రియా సరోజ్‌ల ఎంగేజ్‌మెంట్ జూన్ 8న లఖ్‌నవూలో ధూంధాంగా జరిగింది. అయితే వీరిద్దరి పరిచయం ఎలా ఏర్పడిందనే విషయం ఇప్పటివరకు ఎవరికీ తెలియదు. కానీ ఆ సస్పెన్స్‌కు రింకూనే స్వయంగా తెరదించాడు. 'కొవిడ్ సమయంలో 2022 ఐపీఎల్ ముంబైలో జరిగిన సందర్భంగా ప్రియతో పరిచయం ఏర్పడింది. నాకో ఫ్యాన్ పేజీ ఉండేది. తన గ్రామంలో ఓటింగ్‌కు సంబంధించిన ఓ ఫొటోను ప్రియ అందులో పోస్ట్ చేసింది. ఆ ఫొటో చూడగానే..నాకు ఆమె పర్‌ఫెక్ట్‌గా మ్యాచ్ అవుతుందని భావించా. దాంతో ఆమెకు మెసేజ్ చేయాలని అనుకున్నా. కానీ బాగుండదని ఆ ఆలోచన విరమించుకున్నా. అయితే తర్వాత ఇన్‌స్టాలో నా ఫొటోలను చూసి ఆమె ఇష్టపడింది. దాంతో నేను ఆమెకు మెసేజ్ చేశా. క్రమంగా మాటలు మొదలయ్యాయి. అలా మా ఇద్దరి మధ్య ప్రేమ మొదలైంది' అని రింకూ వివరించాడు.

ఎవరిదో ఆఖరి పంచ్?



రాత్రి 8.30 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో..



సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ యూఎస్ ఓపెన్ నేటినుంచే

- ఫేవరెట్లు సినర్, అల్కారజ్
- 25వ గ్రాండ్‌స్లామ్‌పై జొకోవిచ్ గురి

న్యూయార్క్: పురుషుల డిఫెండింగ్ చాంపియన్ యానిక్ సినర్, రెండో సీడ్ కార్లోస్ అల్కారజ్ యూఎస్ ఓపెన్‌లో మరోసారి ఫేవరెట్‌లుగా బరిలోకి దిగనున్నారు. ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో సినర్‌పై అల్కారజ్ గెలిస్తే.. వింబుల్డన్‌లో అల్కారజ్‌కు సినర్ షాకిచ్చాడు. మరి.. ఆదివారం నుంచి జరిగే ఈ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్‌లో ఎవరిది పైచేయిగా అవుతుందో చూడాలి. అయితే, రెండో పార్శ్వంలో ఉన్న అల్కారజ్‌కు మెద్వెదెవ్, నొవాక్ జొకోవిచ్ రూపంలో కఠిన సవాల్ ఎదురవనుంది. మెయిన్ డ్రాలో తొలి రౌండ్‌లో రిల్లీ ఓప్లేకాతో కార్లోస్ తలపడనున్నాడు. క్వార్టర్స్‌లో మాజీ చాంపియన్ మెద్వెదెవ్‌ను ఎదుర్కోవాల్సి రావచ్చు. మరోవైపు ఏడోసీడ్ జొకోవిచ్ తన 25వ గ్రాండ్‌స్లామ్ కలను నెరవేర్చుకోవాలనే పట్టుదలతో ఉన్నాడు. ఒకవేళ జొకో, అల్కారజ్ ఇద్దరూ ముందుకు సాగితే.. సెమీస్‌లో ఒకరితో ఒకరు తలపడాల్సి ఉంటుంది. గతంలో ఇద్దరి ముఖాముఖిలో జొకో 5-3తో కార్లోస్‌పై పైచేయిగా నిలిచాడు. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్స్‌లో కూడా అల్కారజ్‌ను నొవాక్ ఓడించాడు. మరోవైపు టాప్ సీడ్ సినర్.. తొలి రౌండ్‌లో విట్ కోప్రివా (చెక్)తో ఆడనున్నాడు. అయితే, క్వార్టర్స్‌లో గతేడాది సెమీఫైనలిస్ట్ జాక్ డ్రేపర్‌తో ఆడే చాన్సున్న సినర్‌కు సెమీస్‌లో మూడో సీడ్ జ్వెరెవ్ రూపంలో ముప్పుపొంచి ఉండొచ్చు. నాలుగో సీడ్ టేలర్ ఫ్రిట్జ్, ఐదో సీడ్ డ్రేపర్, బెన్ షెల్టన్, కచనోవ్ కూడా టైటిల్ వేటలో ఉన్నారు.

సబలెంక టైటిల్ నిలబెట్టుకొనేనా?



మహిళల సింగిల్స్ డిఫెండింగ్ చాంప్ అరియానా సబలెంక సరికొత్త రికార్డు సృష్టించాలనుకొంటోంది. 2014లో సెరెనా విలియమ్స్ తర్వాత వరుసగా రెండోసారి యూఎస్ ఓపెన్ నెగ్గిన క్రీడాకారిణిగా నిలవాలనే పట్టుదలతో ఉంది. అయితే, రెండో సీడ్ స్వియటెక్, మూడో సీడ్ కొకొ గాఫ్ నుంచి సబలెంకకు సవాల్ ఎదురవనుంది. మిగతా సీడెడ్ స్టార్లు జెస్సికా పెగుల, ఆండ్రీవ, పవోలిని, రిబకినా గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. వింబుల్డన్ నెగ్గిన జోరు మీదున్న స్వియటెక్ మరో గ్రాండ్‌స్లామ్‌తో సీజన్‌ను ఘనంగా ముగించాలనుకొంటోంది. మొదటి రౌండ్‌లో రెబెక్కాతో సబలెంకా, ఎమిలియానాతో స్వియటెక్ ఆడనున్నారు. కొకొ గాఫ్ కూడా సొంతగడ్డపై గ్రాండ్‌స్లామ్‌తో మెరవాలనుకొంటోంది. ఇక, వైల్డ్‌కార్డ్‌తో ఎంట్రీ ఇస్తున్న 45 ఏళ్ల వీనస్ విలియమ్స్ తొలి రౌండ్‌లో ముచోవాతో తలపడనుంది.

ఏపీఎల్ విజేత వారియర్స్

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ట్రోఫీని తుంగభద్ర వారియర్స్ కైవసం చేసుకుంది. ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో శనివారం జరిగిన ఫైనల్లో తుంగభద్ర వారియర్స్ ఐదు వికెట్ల తేడాతో అమరావతి రాయల్స్‌పై గెలుపొందింది. తొలుత రాయల్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 194 పరుగులు చేసింది. కెప్టెన్ విహారి (51) అర్ధ సెంచరీ సాధించగా.. ప్రణీత్ (47) పర్వాలేదనిపించాడు. శశికాంత్ 3, స్టీఫెన్ 2 వికెట్లు తీశారు. ఛేదనలో వారియర్స్ 18 ఓవర్లలో 5 వికెట్లకు 195 పరుగులు చేసి గెలుపొందింది. జ్ఞానేశ్వర్ (66), రోహిత్ (63) అర్ధ సెంచరీలతో చెలరేగారు. విజేతకు రూ.35 లక్షలు, రన్నరప్‌నకు రూ.20 లక్షలు లభించాయి.

లార్డ్స్‌లో విరాట్ ప్రాక్టీస్



లండన్: స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ప్రస్తుతం కుటుంబంతో కలిసి లండన్‌లో గడుపుతున్నాడు. అయితే అక్టోబరులో భారత వన్డే జట్టు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. ఈ నేపథ్యంలో విరాట్ తీవ్రంగా ప్రాక్టీస్ సాగిస్తున్నాడు. శనివారం అతను ప్రఖ్యాత లార్డ్స్ మైదానంలోని ఇండోర్ నెట్స్‌లో రెండు గంటలపాటు సాధన చేశాడు. ఈ క్రమంలో విరాట్ స్పిన్, పేస్ బౌలింగ్‌ను ఎదుర్కొన్నాడు. టీ20, టెస్టుల నుంచి వైదొలిగిన కోహ్లీ కేవలం వన్డేలకు పరిమితమైన విషయం తెలిసిందే.

తెలంగాణకు కాంస్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తొలిసారిగా జరిగిన ఖేలో ఇండియా వాటర్ స్పోర్ట్స్‌లో తెలంగాణకు కాంస్య పతకం లభించింది. శనివారం శ్రీనగర్‌లో ముగిసిన ఈ పోటీల్లో పురుషుల రోయింగ్ కాక్స్‌లెస్ టీమ్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన నవదీప్-హర్దీప్ ద్వయం కాంస్యం దక్కించుకుంది. కనోయింగ్-కయాకింగ్ కెనో స్లాలోమ్ కె1 విభాగంలో ఏపీకి చెందిన గాయత్రి రజతం, రాజేష్ కాంస్యం సాధించారు.

భారత్‌లో మెస్సీ విన్యాసాలు కేరళలో అర్జెంటీనా జట్టు పోరు



న్యూఢిల్లీ: ఫుట్‌బాల్ సూపర్ స్టార్ లియోనెల్ మెస్సీ అద్భుత విన్యాసాలను భారత ప్రేక్షకులు ప్రత్యక్షంగా చూసే అవకాశం రానుంది. ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్ కోసం నవంబరులో అర్జెంటీనా జట్టు కేరళకు రాబోతోంది. ఈ విషయాన్ని అర్జెంటీనా ఫుట్‌బాల్ సంఘం కూడా ధ్రువీకరించింది. అయితే, ఆ జట్టు ఎవరితో మ్యాచ్ ఆడుతుందనేది స్పష్టం చేయలేదు. కాగా, నవంబరు 10-18 మధ్య అర్జెంటీనా మ్యాచ్ ఉండే అవకాశముందని కేరళ క్రీడామంత్రి అబ్దుర్ రహిమాన్ వెల్లడించారు. 'లియోనెల్ మెస్సీ నేతృత్వంలో అర్జెంటీనా జట్టు ఈ ఏడాది అక్టోబరులో యూఎస్‌ఏ, నవంబరులో భారత్ పర్యటనలో రెండు ఫ్రెండ్లీ మ్యాచ్‌లను ఆడనుంది' అని అర్జెంటీనా ఫుట్‌బాల్ సమాఖ్య పేర్కొంది. మరోవైపు మెస్సీ మూడు రోజుల పర్యటన కోసం డిసెంబరులో భారత్‌కు రానున్నాడని ఇటీవల వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే, అర్జెంటీనా ఫుట్‌బాల్ సమాఖ్య తాజా ప్రకటనతో అంతకంటే ముందే మెస్సీ భారత్ రావడం ఖాయమైంది.

షరపోవాకు అరుదైన గౌరవం



టెన్నిస్ మాజీ స్టార్ మరియా షరపోవా, డబుల్స్ మాజీ నెంబర్‌వన్ జోడీ, బ్రయాన్ బ్రదర్స్‌కు టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కింది. ఆదివారం జరిగే కార్యక్రమంలో వీరి పేర్లను దిగ్గజాల సరసన చేర్చనున్నారు. 2004 వింబుల్డన్‌లో సెరెనాను ఓడించి ఓవర్‌నైట్ స్టార్‌గా మారిన షరపోవా.. 2006లో యూఎస్ ఓపెన్, 2008లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌తోపాటు రెండు ఫ్రెంచ్ ఓపెన్ టైటిళ్లు సాధించింది. నెం.1 ర్యాంక్‌ను అందుకొన్న తొలి రష్యన్ ప్లేయర్‌గా చరిత్ర సృష్టించింది. 2020లో రిటైర్మెంట్ ప్రకటించింది. డబుల్స్ సోదరులు బాబ్, మైక్ బ్రయాన్‌లు 2012 ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించారు. 438 వారాలపాటు నెం.1 ర్యాంక్‌లో నిలిచారు.

మూసీ అభివృద్ధికి రూ.375 కోట్లు

» ఎంఆర్‌డీసీఎల్‌కు రెండో త్రైమాసికం నిధులు

» విడుదల చేస్తూ పురపాలక శాఖ జీవో

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మూసీ నది అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత నిధులు విడుదల చేసింది. నది అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన 'మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్)'కు 2025-26 ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన నిధుల్లో రెండో విడత కింద రూ.375 కోట్లు విడుదల చేస్తూ శనివారం పురపాలక శాఖ జీవో జారీ చేసింది. మూసీ నది అభివృద్ధి కోసం బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం రూ.1500 కోట్లు కేటాయించింది. తొలి త్రైమాసికంలో రూ.375 కోట్లను విడుదల చేసింది. రెండో త్రైమాసికానికి సంబంధించి తాజాగా మరో రూ.375 కోట్లను విడుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.750 కోట్లు విడుదల చేసింది.

దేవాదుల, ఎస్సారెస్పీపై 3న ప్రధాని సమీక్ష

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సత్వర సాగునీటి ప్రయోజన పథకం(ఏఐబీపీ)లో భాగంగా ఉన్న రాష్ట్రంలోని జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం, రాజీవ్‌బీమా ఎత్తిపోతల పథకం, శ్రీరామ్‌సాగర్ రెండో దశ ప్రాజెక్టుల పనుల పురోగతిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సెప్టెంబరు 3న సమీక్ష నిర్వహించనున్నారు. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఉన్న క్యాబినెట్ సచివాలయంలో సెప్టెంబరు 3వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ప్రగతి సమావేశంలో తెలంగాణ అధికారులతో ప్రధాని మోదీ సమావేశమవుతారు. దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని 2006 ఏప్రిల్ 3న ఏఐబీపీలో చేర్చగా, రాజీవ్ బీమా ఎత్తిపోతల పథకాన్ని 2008 జనవరి 1న చేర్చారు. ఎస్సారెస్పీ రెండో దశను 2005 ఏప్రిల్ 1న ఏఐబీపీలో చేర్చారు. ఈ మూడు పథకాలను 2019 డిసెంబరు 31 కల్లా పూర్తి చేయాలని గడువు పెట్టగా పనులు పూర్తి కాలేదు. ఆ తర్వాత దేవాదులను 2025 డిసెంబరు 31, రాజీవ్ బీమాను 2026 మార్చి 31 నాటికి పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తెలియజేసింది. దీనికి అనుగుణంగా భూసేకరణకు భారీగా నిధులు కూడా విడుదల చేసింది. ఈ మూడు ప్రాజెక్టులకు సంబంధించి ఐదు సమస్యలు ఉన్నాయని గుర్తించగా.. సెప్టెంబరు 3న జరిగే సమీక్షలో ప్రధాని ఆయా అంశాలపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు.

రాష్ట్రాభివృద్ధికి బీజేపీ ఎంపీల సహకారం

» యూరియా కొరతపై రాజకీయం వద్దు

» రూ.5లక్షల్లో ఇంటి నిర్మాణం సాధ్యంకాదు

» నిబంధనలను సడలించి సాయం అందించాలి: ఈటల

» సచివాలయంలో మంత్రి పొంగులేటితో భేటీ

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సమగ్రాభివృద్ధికి రాష్ట్ర బీజేపీ ఎంపీల సహకారం ఉంటుందని ఆ పార్టీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. యూరియా కొరతపై రాజకీయం చేయొద్దని, బాధ్యతగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. రాష్ట్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సమస్యలపై శనివారం ఈటల సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో సమావేశమై, వినతిపత్రాలు అందించారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏ సీజన్‌కు ఎంతమేర ఎరువులు అవసరమవుతాయి? అందులో యూరియా ఎంత కావాలనేది రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసి కేంద్రానికి ఇండెంట్ పెట్టుకుని ముందుగానే స్టాక్ తెప్పించి నిల్వలు ఉంచుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణలో ఈ రకమైన ప్రణాళిక ఎక్కడ కొరవడిందోనని అన్నారు. యూరియా విషయంలో రాజకీయం కాకుండా రైతులకు దానిని ఎలా అందించాలనే అంశంపై ఆలోచన చేయాలని, కేంద్రంపై నెపం నెట్టడం మంచిదికాదన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ నిర్వహణ బాధ్యత రాష్ట్రప్రభుత్వానిదేనని చెప్పారు. రాష్ట్రాల వారీగా కేంద్రం ఇళ్లను మంజూరు చేస్తుందని, అర్హుల వారీగా నిబంధనలను పరిశీలించాల్సింది రాష్ట్ర ప్రభుత్వమేనని పేర్కొన్నారు. ఇళ్ల మంజూరు విషయంలో కఠిన నిబంధనలు ఉంటే వాటిని సులభతరం చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తామన్నారు. ఇళ్ల నిర్మాణ సామాగ్రి ధరలు పెరిగాయని, రూ.5 లక్షలతో ఇంటి నిర్మాణం సాధ్యం కాదన్నారు. కొన్ని నిబంధనలు సడలించి ఇల్లు నిర్మించుకునే వారికి సాయం అందించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో స్థానిక ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను తీసుకోలేదని, అర్హులకు కొన్నిచోట్ల ఇళ్లు మంజూరు కాలేదని, దీనికి సంబంధించిన జాబితాను కూడా మంత్రికి అందజేసినట్టు తెలిపారు.

నేటి నుంచి ఆలిండియా స్పీకర్స్ కాన్ఫరెన్స్

» ఢిల్లీకి చేరుకున్న తెలుగు రాష్ట్రాల స్పీకర్లు

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో ఆది, సోమవారాల్లో ఆలిండియా స్పీకర్స్ కాన్ఫరెన్స్ జరగనుంది. ఆదివారంఅక్కడి అసెంబ్లీ భవనంలో సదస్సును కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రారంభించనున్నారు. ముగింపు కార్యక్రమానికి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా అసెంబ్లీల స్పీకర్లు, పలువురు డిప్యూటీ స్పీకర్లు, మండలి చైర్మన్లు, డిప్యూటీ చైర్మన్లు ఇందులో పాల్గొంటారు. రెండు తెలుగు రాష్ట్రాల శాసనసభల స్పీకర్లు శనివారం రాత్రే ఢిల్లీకి చేరుకున్నారు. తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో పాటు మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు.. ఇటు ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు తరలివెళ్లారు. తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి కంటి శస్త్ర చికిత్స జరిగినందున ఈ సమావేశాలకు హాజరు కావట్లేదు.

మహిళా జైలు సూపరింటెండెంట్ సస్పెన్షన్

» రిమాండ్ ఖైదీ మృతికి నిర్లక్ష్యమే కారణం!

» అంతర్గత విచారణలో తేల్చిన అధికారులు

» సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసిన సౌమ్యమిశ్రా

నర్సంపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా నర్సంపేట మహిళా జైలు సూపరింటెండెంట్ కే.ఎన్.ఎస్.లక్ష్మీశ్రుతిని సస్పెండ్ చేస్తూ జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్రా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న పెండ్యాల సుచరిత మృతికి సంబంధించి.. సూపరింటెండెంట్ నిర్లక్ష్యమే కారణమని అంతర్గత విచారణలో తేలడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. కడుపు నొప్పితో బాధపడిన సుచరిత ఆస్పత్రికి తీసుకెళ్లకపోగా.. ఆమెను మానసికంగా హింసించారనే ఆరోపణలు వెలువడ్డాయి. దళిత సంఘాలు కూడా జైలు అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా శుక్రవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించాయి. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాయి. దీంతో అంతర్గత విచారణ జరిపినట్లు జైళ్ల శాఖ అధికారి పరావస్తు వెంకటేశ్వరస్వామి తెలిపారు. మహిళా సూపరింటెండెంట్ లక్ష్మీశ్రుతి నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ప్రాథమిక సమాచారంతో ఆమెను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. పూర్తి విచారణ తర్వాత శాఖాపరమైన చర్యలు ఉంటాయని వివరించారు. లక్ష్మీశ్రుతి స్థానంలో స్రవంతిని సూపరింటెండెంట్‌గా నియమించినట్లు తెలిపారు.

కేసీఆర్‌కు మళ్లీ అస్వస్థత

(మొదటిపేజీ తరువాయి)

అనారోగ్యం గురించి తెలియగానే మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా కారు నడుపుతూ కుమారుడు హిమాన్షుతో కలిసి ఫాంహౌస్‌కు వచ్చినట్లు సమాచారం. మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి సైతం ఫాంహౌస్‌కు వచ్చి కేసీఆర్‌ను పరామర్శించినట్లు తెలిసింది. వైద్య బృందం అక్కడే ఉండి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. ప్రశాంత్‌రెడ్డి ఫాంహౌస్‌లోనే ఉండి కేసీఆర్‌కు అందుతున్న వైద్యాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిసింది. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడకపోతే ఆయన్ను హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉందని సమాచారం.



టీపీసీసీ పీఏసీ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రులు, నాయకులు

బీసీ కోటాపై కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్, మంత్రులు, పీఏసీ, సలహా కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

బీసీ బిల్లులపై లాయర్లను నియమించాం

విద్య, ఉద్యోగాలు.. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన రెండు బిల్లులూ రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న అంశంపై ప్రభుత్వం తరఫున సుప్రీం కోర్టులో వాదన వినిపించేందుకు ప్రముఖ న్యాయవాదులు అభిషేక్ సింఘ్వి, నిరంజన్‌రెడ్డిలను నియమించినట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్రాలు పంపిన బిల్లులను రాష్ట్రపతి 90 రోజుల్లో పరిష్కరించాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ప్రస్తుతం రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న బీసీ బిల్లులపై సుప్రీం కోర్టులో పిటిషన్ వేయాలన్న అంశం పీఏసీలో చర్చకు వచ్చింది. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ.. 90 రోజుల్లో రాష్ట్రపతి బిల్లులను ఆమోదించాలన్న అంశంపైన సుప్రీంకోర్టులో మన వాదనలు వినిపించడానికి ఇద్దరు న్యాయవాదులను నియమించామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అభిప్రాయం చెప్పే క్రమంలోనే రాష్ట్రపతి వద్ద ఉన్న బీసీ బిల్లుల అంశాన్నీ ప్రస్తావించనున్నట్లు తెలిపారు. ప్రత్యేక పిటిషన్ వేస్తే కేసు లిస్ట్ కావడానికి ఎక్కువ సమయం పడుతుందన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే అంశంలో ప్రభుత్వం ముందున్న మూడు ప్రత్యామ్నాయాలను పీఏసీ సభ్యులకు సీఎం వివరించారు. రాహుల్‌గాంధీ, పార్టీ ఆదేశం మేరకు రాష్ట్రంలో కులగణన చేపట్టి.. విద్య, ఉద్యోగాలు, స్థానిక ఎన్నికల్లోనూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీ ఆమోదించిన రెండు బిల్లులూ ప్రస్తుతం రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అలాగే స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా కేసీఆర్ చట్టం తీసుకొస్తే, అడ్డంకిని తొలగించడానికి పంచాయతీరాజ్ చట్టానికి సవరణ ఆర్డినెన్సును తీసుకువచ్చామని తెలిపారు. కేసీఆర్ తెచ్చిన చట్టం ప్రకారం బీసీలకు ఒక్క శాతం రిజర్వేషన్ కూడా పెరగదన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ముందు మూడు ప్రత్యామ్నాయాలు ఉన్నాయని రేవంత్ వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బీసీలకు మేలు జరగాల్సిందేనన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచుతూ జీవో తీసుకురావడం ఒకటి కాగా.. పార్టీ పరంగా బీసీలకు 42 శాతం టికెట్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకుని సెప్టెంబరు 30లోగా ఎన్నికలకు వెళ్లడం రెండోదని చెప్పారు. రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న రెండు బిల్లులను ఆమోదించుకోవడం కోసం న్యాయపోరాటం చేయడం, కేంద్రంపై ఒత్తిడి తేవడం మూడో ప్రత్యామ్నాయమని తెలిపారు. ఈ మూడు అంశాలను పీఏసీలో చర్చకు పెట్టారు. వీటిపై సభ్యులు విస్తృతంగా మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో పార్టీకి మంచి వాతావరణం ఉందని, వెంటనే స్థానిక ఎన్నికలకు వెళ్లడం మేలని 90 శాతానికి పైగా సభ్యులు అభిప్రాయపడ్డారు. అయితే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చట్ట పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చాకే ఎన్నికలకు వెళ్లాలన్న అభిప్రాయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, సీనియర్ నేత వి.హన్మంతరావు, ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ తదితరులు వినిపించారు. అందరి అభిప్రాయాలనూ పరిగణనలోకి తీసుకున్న పీఏసీ.. న్యాయనిపుణుల అభిప్రాయాలు తీసుకోవాలన్న నిర్ణయానికి వచ్చింది. అందుకోసం మంత్రులతో కమిటీ వేయాలని నిర్ణయించింది.

జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇవ్వండి

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థి.. తెలుగువాడైన జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి తెలుగు రాష్ట్రాలకు చెందిన అన్ని పార్టీలూ మద్దతు తెలిపి గెలిపించాలని కోరుతూ పీఏసీ తీర్మానించింది. తెలంగాణకు చెందిన ప్రజాస్వామ్య వాది, రాజ్యాంగ నిపుణుడు జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఇండి కూటమి తరఫున అభ్యర్థిగా ఎంపిక చేయడం పట్ల పీఏసీ హర్షం వ్యక్తం చేసింది.

యూరియాపై బీఆర్ఎస్, బీజేపీ డ్రామా

రాజ్యాంగ పరిరక్షణతోపాటు పౌర హక్కులను కాపాడడం కోసం జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పని చేశారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. యూరియా ఇచ్చే పార్టీకే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇస్తామని కేటీఆర్ అనడంతోనే వారి వైఖరి ఏంటో అర్థమవుతోందని చెప్పారు. యూరియాపై బీఆర్ఎస్, బీజేపీ కలిసి డ్రామా ఆడుతున్నాయని ఆరోపించారు. యూరియా కోసం నాలుగు సార్లు కేంద్ర మంత్రులను కలిశానన్నారు. యూరియా పంపిణీపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను విస్తృతం చేయాలని పేర్కొన్నారు.

నిమజ్జనంలోపు

నామినేటెడ్ పదవుల భర్తీ!

» టీపీసీసీ కోర్ కమిటీ నిర్ణయం

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అతి త్వరలో నామినేటెడ్ పదవులను భర్తీ చేయనున్నారు. వినాయక చవితి పండగ నేపథ్యంలో.. నిమజ్జన కార్యక్రమంలోపే ఈ పదవులను భర్తీ చేయాలని టీపీసీసీ కోర్ కమిటీ సమావేశం నిర్ణయించింది. గాంధీభవన్‌లో శనివారం టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ(పీఏసీ) సమావేశం ప్రారంభానికి ముందు.. సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో కోర్ కమిటీ భేటీ అయింది. ఇందులో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో స్థానిక ఎన్నికలు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలపై చర్చించారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంశంపై పీఏసీలో చర్చించాల్సి ఉండడంతో దానికి సంబంధించిన అజెండాను ఖరారు చేశారు. ఈ అంశంలో ప్రభుత్వం ముందున్న ప్రతిపాదనలను సిద్ధం చేశారు. అలాగే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా తీసుకోవాల్సిన చర్యలపైనా చర్చించారు. ఇన్‌చార్జి బాధ్యతల్లో ఉన్నవారి పనితీరును సమీక్షించారు. నామినేటెడ్ పదవులను వినాయక నిమజ్జన కార్యక్రమంలోపే భర్తీ చేయాలన్న నిర్ణయం జరిగింది. ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు ఇవ్వడంపై మంత్రి శ్రీధర్‌బాబు, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్‌తో సీఎం రేవంత్ సమావేశమై సమీక్షించారు. ఆ ఎమ్మెల్యేలకు ఎలా సహాయం చేయగలమనే అంశంపై న్యాయనిపుణులతో చర్చించాల్సిందిగా శ్రీధర్‌బాబుకు సీఎం సూచించినట్లు సమాచారం.

26న బిహార్‌కు సీఎం, మంత్రులు: భట్టి

ఓట్ చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ బిహార్‌లో చేపట్టిన పాదయాత్రలో ఈ నెల 26న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, ఇతర ముఖ్యనాయకులు హాజరు కావాలని పీఏసీ భేటీలో నిర్ణయించినట్లు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క వెల్లడించారు. పీఏసీ భేటీ అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి మరణం పట్ల పీఏసీ దిగ్భ్రాంతి వ్యక్తం చేసిందన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని తీర్మానించినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఆదివారం సుధాకర్‌రెడ్డి పార్థివదేహానికి నివాళులు అర్పించనున్నట్లు తెలిపారు.

ఓట్ చోరీ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి: మహేశ్‌గౌడ్

ఓట్ చోరీతోనే బీజేపీ మూడోసారి గెలిచిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. రాహుల్‌గాంధీ ఈ అంశంపై సమగ్ర సమాచారాన్ని ప్రజలకు తెలియజేసి, ఉద్యమాన్ని చేపట్టారని చెప్పారు. దీన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పీఏసీ సభ్యులకు సూచించారు. రాష్ట్రంలో ప్రజాపాలన అద్భుతమైన ఫలితాలను ఇస్తోందని, రైతు భరోసా, రుణమాఫీ, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం లాంటి కార్యక్రమాలకు మంచి స్పందన వస్తోందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించేందుకు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికను కూడా ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని చెప్పారు. కాగా, ఓట్ చోరీకి సంబంధించిన ప్రచార లోగోను పీఏసీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మీనాక్షి నటరాజన్, మంత్రులు భట్టి, ఉత్తమ్, పీఏసీ సభ్యులతో కలిసి సీఎం ఈ లోగోను విడుదల చేశారు.

మంత్రుల తీరు వల్లే యూరియా పాట్లు

» కొరత ఉందంటూ పదే పదే ప్రకటనలు

» కంగారులో పెద్దఎత్తున రైతుల కొనుగోలు

» కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఈ దుస్థితి

» కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 11 ఏళ్లుగా లేని యూరియా కొరత కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎందుకు వచ్చిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. యూరియా కొరత ఉందంటూ రాష్ట్ర మంత్రులు పదే పదే చెప్పడం వల్లే రైతులు పెద్ద ఎత్తున కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అడిగిన 50 వేల టన్నుల యూరియాను వెంటనే సమకూర్చాలని కేంద్ర ఎరువుల శాఖ మంత్రి నడ్డాకు చెప్పానని.. రాష్ట్ర ప్రభుత్వం అడిగినంత యూరియాను కేంద్రం సరఫరా చేస్తుందని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు హరీశ్‌రావు ఫామ్‌హౌస్‌లో యూరియా తయారు చేశారా? అని ఎద్దేవా చేశారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. హైదరాబాద్ మెట్రో అభివృద్ధికి కేంద్రం వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. మెట్రో కొత్త లైన్ల నిర్మాణాలపై ప్రస్తుతం ఉన్న కంపెనీ ముందుకు రావడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో కొత్త లైన్ల నిర్మాణం ఎవరు చేపడతారు? ప్రస్తుత నష్టాలను ఎవరు భరిస్తారు? అన్న విషయాలపై స్పష్టత రావాల్సి ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అధికార దుర్వినియోగం జరిగాయని ఆరోపించారు. సీబీఐ దర్యాప్తునకు తాము కట్టుబడి ఉన్నామని అన్నారు. తాము ఎవరి మీద చర్య తీసుకోవాల్సిన అవసరం లేదని సీఎం అంటున్నారని.. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరి మార్చుకుందని విమర్శించారు. అమెరికా టారిఫ్‌లు బొగ్గు గనుల శాఖపై ప్రభావం చూపవన్నారు. బీజేపీ నేతలు రేవంత్‌రెడ్డిని తిట్టడం లేదని ఇటీవల కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కిషన్‌రెడ్డి స్పందించారు. హౌలా అని తిట్టాలా..? అని అన్నారు. రాజకీయ ప్రత్యర్థులను తిట్టడం, అభ్యంతరకరమైన భాష వాడటం తగదని అన్నారు. 'రేవంత్‌రెడ్డి నన్ను సైంధవుడు అని అన్నారు. బట్టలు విప్పుతా.. లాగులో తొండలు వదులుతా అనడం ఏం భాష. మన శత్రువు పాకిస్థాన్. రాజకీయ పార్టీలు కాదు. మనం ప్రత్యర్థులం మాత్రమే' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నిక కోసం బీఆర్ఎస్ మద్దతు కోరే విషయంలో ఇంకా నిర్ణయం తీసుకోలేదని కిషన్‌రెడ్డి తెలిపారు. బీజేపీకి మద్దతు ఇవ్వడం వైఎస్సార్‌సీపీ స్వచ్ఛంద నిర్ణయమని చెప్పారు. కాంగ్రెస్ గెలిచే వీలుంటే సుదర్శన్‌రెడ్డిని నిలబెట్టేది కాదని, ఆయన్ను బలీ కా బకరా చేసిందని విమర్శించారు. బీజేపీలో చేరాలంటే ఎవరైనా రాజీనామా చేసి రావాల్సిందేనన్నారు. అన్ని పార్టీల్లో మంచివారు, అవినీతిపరులు ఉంటారని, పార్టీల్లో చేర్చుకోవడం కొత్తేమీకాదన్నారు.

యూరియాపై ఆందోళన వద్దు

సరఫరా పెంచేందుకు చర్యలు

» 42వేల టన్నుల యూరియా ఉంది

» మంత్రులు తుమ్మల, శ్రీధర్ బాబు

» ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్ఎఫ్‌సీఎల్ ప్రతినిధులతో భేటీ



హైదరాబాద్/కోల్‌సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): యూరియా విషయంలో రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 42 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, ఆగస్టు చివరి వరకు 37,877 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చే అవకాశం ఉందని చెప్పారు. యూరియా సరఫరా పెంచేందుకు కేంద్రంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. శనివారం సచివాలయంలో రామగుండం ఫెర్టిలైజర్, కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) సీఈవో అలోక్ సింఘాల్, నాగార్జున ఫెర్టిలైజర్ కెమికల్స్ లిమిటెడ్ (ఎన్ఎఫ్‌సీఎల్)తెలంగాణ సేల్స్ మేనేజర్ రాజేశ్‌తో మంత్రులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి రాష్ట్రానికి రావాల్సిన యూరియా కోటాలో ఇంకా 62,473 మెట్రిక్ టన్నులు అందలేదని మంత్రులు సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. సరఫరా ఆలస్యమవడంతో రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటోందని చెప్పారు. పంటలపై ప్రతికూల ప్రభావం పడకముందే, సమయానికి యూరియా అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్ఎఫ్‌సీఎల్స్ నుంచి రావాల్సిన వాటాలో 50% యూరియాను ఈ వారంలోనే అందించేలా చూడాలన్నారు. స్పందించిన ఆర్ఎఫ్‌సీఎల్ సీఈవో మాట్లాడుతూ.. రాష్ట్రానికి అందించాల్సిన యూరియాను త్వరలోనే సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.

నర్మెట పామాయిల్ ఫ్యాక్టరీ పనులను త్వరగా పూర్తి చేయాలి

సిద్దిపేట జిల్లా నర్మెటలో నిర్మాణంలో ఉన్న పామాయిల్ ఫ్యాక్టరీ పనులను త్వరగా పూర్తి చేయాలని మంత్రి తుమ్మల ఆయిల్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. సీఎం రేవంత్ చేతుల మీదుగా ఆ ఫ్యాక్టరీని ప్రారంభించనున్నామని సమయానికి పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. సచివాలయంలో ఆయిల్ పామ్ పంట, మిల్లుల నిర్మాణాలు సహా పలు అంశాలపై అధికారులతో ఆయన సమీక్షించారు. కల్లూరుగూడెంలో నిర్మించే ఫ్యాక్టరీ పనులను 2026 జూన్ వరకు పూర్తిచేయాలని, బీచుపల్లి ఫ్యాక్టరీ పనుల కోసం టెండర్లను ఆహ్వానించాలని సూచించారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ అనుకున్న స్థాయిలో జరగడంలేదని, లక్ష్యాన్ని పూర్తి చేయడానికి హార్టికల్చర్, సెరికల్చర్, అగ్రికల్చర్ శాఖల సిబ్బందిని వినియోగించుకోవాలన్నారు.

మేం పార్టీ మారలేదు!

(మొదటిపేజీ తరువాయి)

చర్చ సర్వత్రా జరుగుతోంది. తాము పార్టీ మారలేదని, నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశామని పలువురు ఎమ్మెల్యేలు ఇప్పటికే ప్రకటించారు. అయితే ఆయా ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్న నేపథ్యంలో స్పీకర్ వద్ద జరిగే విచారణలో ఏమని సమాధానం ఇస్తారన్నది ఆసక్తికరంగా మారింది. తాము పార్టీ మారలేదని, అసెంబ్లీ రికార్డుల్లోనూ బీఆర్ఎస్ సభ్యులుగానే కొనసాగుతున్నామని వివరణ ఇవ్వనున్నట్లు చెబుతున్నారు. కానీ, బీఆర్ఎస్ నాయకత్వం ఏ విషయంలోనూ తమను కలుపుకొనిపోవడంలేదని, ఈ నేపథ్యంలో తమను ప్రత్యేక గ్రూపుగా గుర్తించాలని విచారణ సందర్భంగా స్పీకర్‌కు విజ్ఞప్తి చేసే ఆలోచన కొందరు ఎమ్మెల్యేలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ మేరకు స్పీకర్‌ను కోరే అవకాశం ఉందా.. అన్నదానిపై వారు న్యాయ నిపుణులను సంప్రదిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసిన దానం నాగేందర్.. దీనికి ఏం సమాధానం ఇస్తారన్నదీ ఆసక్తికరంగా మారింది.

బీఆర్ఎస్‌లోనే ఉన్నా: బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మహబూబ్‌నగర్: తాను పార్టీ మారలేదని, బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నానని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం మాత్రమే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని చెప్పారు. శనివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. స్పీకర్‌ను కలిసి నోటీసులు తీసుకుంటానని, ఆయన నిర్దేశించిన సమయంలోపు న్యాయనిపుణులను సంప్రదించి సమాధానం ఇస్తానన్నారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు మినహా ఇటు కాంగ్రెస్ కార్యక్రమాల్లో గానీ, అటు బీఆర్ఎస్ కార్యక్రమాల్లో గానీ ఆయన పాల్గొనడంలేదు. కాంగ్రెస్ నేతలు తన ఫొటోలను తన అనుమతి లేకుండా ఫ్లెక్సీల్లో వాడుతున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు.

ప్రభుత్వం స్పందించకుంటే నేతన్నలకు ఆత్మహత్యలే శరణ్యం

విద్యుత్ బ్యాక్ బిల్లింగ్ బకాయిలు 35.48 కోట్లు మాఫీ చేయాలి

డిప్యూటీ సీఎం భట్టికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ లేఖ




సిరిసిల/హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే సిరిసిల్ల నేతన్నలకు ఆత్మహత్యలే శరణ్యమంటూ మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ శనివారం డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు సుదీర్ఘ లేఖ రాశారు. సిరిసిల్లలోని పవర్‌లూమ్ కార్మికులు ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలన్నారు. పవర్‌లూమ్ కార్మికులపై పడుతున్న రూ.35.48 కోట్ల విద్యుత్ బ్యాక్ బిల్లింగ్ బకాయిలను మాఫీ చేసి, వారికి రావాల్సిన రూ.101.77 కోట్ల విద్యుత్ సబ్సిడీని వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు.. భారతదేశంలో త్వరలో కార్యాలయం ఏర్పాటు చేస్తామని చెప్పిన ఒపెన్ ఏఐ సీఈవో సామ్ ఆల్ట్‌మన్‌కి హైదరాబాద్ నుంచి కంపెనీ కార్యకలాపాలు ఏర్పాటు చేయాలని కేటీఆర్ లేఖ ద్వారా కోరారు. వచ్చేనెలలో భారత్‌లో పర్యటిస్తానని ప్రకటించిన సామ్ ఆల్ట్‌మన్‌కు హైదరాబాద్ నగరం స్వాగతం పలుకుతుందని పేర్కొన్నారు. కాగా, పారిశుధ్య నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు అన్నారు.. పార్టీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో ఆయన మాటాడుతూ.. నగరంతోపాటు పల్లెల్లోనూ గతంలో ఇంత దారుణమైన పరిస్థితులు ఎప్పుడూ లేవన్నారు.

యూరియా సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

» బీజేపీ, కాంగ్రెస్ హైడ్రామాలు చేస్తున్నాయి

» రైతుల కష్టాలను రాజకీయం చేయడం సిగ్గుచేటు: హరీశ్



హైదరాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): యూరియా సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రైతుల కష్టాలను రాజకీయం చేయడం సిగ్గు చేటని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే ఈ సమస్యపై దృష్టి సారించాలని ఎక్స్‌లో డిమాండ్ చేశారు. యూరియా కోసం రైతులు కుండపోత వర్షంలో తడుస్తూ గంటల తరబడి క్యూలో నిలబడడం, అధికారుల కాళ్లు పట్టుకోవడం వంటి దృశ్యాలు కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమని అన్నారు. సీఎం ముందుచూపు లేకపోవడం వల్లే రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో తులం బంగారం ఇస్తానన్న రేవంత్‌రెడ్డి.. యూరియానే బంగారంలా మార్చారని ఎద్దేవా చేశారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులకు యూరియా కొరత రాలేదని చెప్పారు. యూరియా కొరతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ హైడ్రామా సృష్టిస్తున్నాయని మండిపడ్డారు. దేశంలో యూరియా కొరత లేదని ఒకవైపు కేంద్రం చెబుతుంటే, రేవంత్ రెడ్డి మాత్రం కేంద్రమే సరఫరా చేయడం లేదంటున్నారని, ఇందులో ఎవరు నిజం చెబుతున్నారో స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఏడాదికి 50 రాకెట్లు ప్రయోగించగలమా?

» అంతరిక్ష శాస్త్రవేత్తలను ప్రశ్నించిన ప్రధాని మోదీ

» ప్రైవేటు రంగం ముందుకొచ్చి సహకరించాలని పిలుపు



న్యూఢిల్లీ, ఆగస్టు 23: అంతరిక్ష రంగంలో భారత్ వరుస విజయాలతో దూసుకెళ్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రైవేటు రంగం ముందుకొచ్చి సహకరించాలని పిలుపునిచ్చారు. ఏటా 5 నుంచి 6 ప్రధాన రాకెట్లను ప్రయోగిస్తున్నామని.. ప్రతి ఏడాది 50 రాకెట్లను ప్రయోగించే స్థాయికి మనం చేరుకోగలమా..? అంటూ అంతరిక్ష శాస్త్రవేత్తలు, ఇంజనీర్లను ప్రశ్నించారు. శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రధాని మాట్లాడారు. భవిష్యత్తులో చేపట్టే మిషన్ల కోసం భారత్ వ్యోమగాముల సమూహాన్ని ఏర్పాటు చేయబోతోందని.. ఇందులో యువత కూడా పాలుపంచుకోవాలని కోరారు. 'మనం చంద్రుడు, అంగారక గ్రహాన్ని ఇప్పటికే చేరుకున్నాం. ఇప్పుడు ఇంకా లోతైన అంతరిక్షంలోకి తొంగి చూడాలి. త్వరలోనే గగన్‌యాన్ మిషన్‌ను ప్రారంభించబోతున్నాం. అలాగే సొంత స్పేస్‌స్టేషన్‌ను కూడా నిర్మించుకోబోతున్నాం' అని చెప్పారు.

శబరిమలలో భక్తుల భద్రతకు సాంకేతిక కమిటీ

» కేఎస్ఈబీ, టీడీబీ కలిసి ఏర్పాటు చేయాలన్న కేరళ హైకోర్టు

కోచి, ఆగస్టు 23: శబరిమలకు వచ్చే భక్తుల భద్రత ముఖ్యమని కేరళ హైకోర్టు స్పష్టం చేసింది. రెండు వేర్వేరు తీర్పుల్లో.. విద్యుదాఘాతం వంటి ఘటనలు జరగకుండా సాంకేతిక కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విభాగాలు, ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు(టీడీబీ)లను ఆదేశించింది. గత నెల ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన ఓ భక్తురాలు శబరిమల దర్శనానికి వచ్చి, తాగునీటి కియోస్క్ వద్ద నీళ్లు తాగుతుండగా.. విద్యుదాఘాతంతో మరణించిన విషయం తెలిసిందే..! ఈ అంశాన్ని కేరళ హైకోర్టు సుమోటోగా తీసుకుంది. దీనిపై కోర్టు శుక్రవారం తీర్పును వెలువరిస్తూ.. యాత్రికుల భద్రత కోసం కేరళ వాటర్ అథారిటీ(కేడబ్ల్యూఏ), కేరళ రాష్ట్ర విద్యుత్తు బోర్డు(కేఎస్ఈబీ), ఇతర శాఖలు సంయుక్తంగా సాంకేతిక కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. కాగా.. తెలుగు రాష్ట్రాలకు చెందిన అఖిల భారత అయ్యప్ప సేవాసంఘం దాఖలు చేసిన మాండమస్ రిట్ పిటిషన్‌లో ఇదే ధర్మాసనం ఇటీవల తీర్పునిస్తూ.. ఎరుమేలి, పంపా, శబరిమల సన్నిధానంలోని హోటళ్లు, అన్నదాన కేంద్రాల్లో వారానికి ఓ సారి తప్పనిసరిగా తనిఖీలు చేయాలని టీడీబీని ఆదేశించింది.

పాక్‌కు మద్దతుతో తుర్కియే పర్యాటకం ఢమాల్

అంకారా, ఆగస్టు 23: తుర్కియేకు వెళ్లే భారత పర్యాటకుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు తుర్కియే బహిరంగంగా మద్దతు ఇచ్చిన ఫలితం ఇది. భారత్‌లో 'బాయ్‌కాట్ తుర్కియే' ప్రచారం ఊపందుకుంది. గత మూడు నెలల్లోనే తుర్కియేకు భారత పర్యాటకుల సంఖ్య 50% తగ్గింది. ఈ ఏడాది మేలో 31,659 మంది భారతీయులు తుర్కియేలో పర్యటించగా, జూన్‌లో ఆ సంఖ్య 24,250కి, జూలైలో 16,244కి తగ్గిపోయింది. కాగా, 2024 జూలైలో 28,875 మంది భారతీయులు తుర్కియేలో పర్యటించారు. ఇది ఈ ఏడాది జూలైలో పర్యటించినవారి కంటే 44 శాతం అధికం.

వేరే దేశాన్ని పొగడడం నేరం కాదన్న హిమాచల్ హైకోర్టు

సిమ్లా, ఆగస్టు 23: స్వదేశంపై ఎలాంటి విమర్శలు చేయకుండా, వేరే దేశాన్ని పొగిడినంత మాత్రాన అది నేరం కిందికి రాదని హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు స్పష్టం చేసింది. ఇది తిరుగుబాటు, హింస, వేర్పాటువాదాన్ని ప్రోత్సహించినట్టు కాదని పేర్కొంది. ప్రధాని మోదీ 'పాకిస్థాన్ జిందాబాద్' అంటున్నట్టుగా కృత్రిమ మేధ ద్వారా రూపొందించిన ఓ ఫొటోను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసినందుకు అరెస్టయిన వీధి వ్యాపారికి బెయిల్ మంజూరు చేస్తూ ఈ వ్యాఖ్య చేసింది. వ్యాపారి మాతృభూమిని ఏ మాత్రం కించపరచలేదని, కేవలం వేరే దేశాన్ని పొగుడుతూ పోస్టును షేర్ చేశాడని, ఇలాంటి పరిస్థితుల్లో రాజద్రోహం కేసు వర్తించదని న్యాయమూర్తి జస్టిస్ రాకేష్ కైంతల అభిప్రాయపడ్డారు.

శ్రీనివాసరావుకు గంగాశరణ్ సింహ్ పురస్కారం



న్యూఢిల్లీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావుకు శనివారం బిహార్ సీఎం నితీశ్ ప్రతిష్ఠాత్మకమైన గంగాశరణ్ సింహ్ పురస్కారాన్ని ప్రదానం చేశారు. దేశంలో హిందీ సాహిత్యం,భాషాభివృద్ధికి కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శిగా అందిస్తున్న సేవలకుగాను ఆయనకు ఈ పురస్కారం లభించింది. పట్నాలో సచివాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో శ్రీనివాసరావును ఈ పురస్కారాన్ని అందజేశారు.

ఆ జడ్జిలంతా నక్సలైట్లేనా?

'సల్వాజుడుం' తీర్పులో నాతో పాటు మరో జడ్జి ఉన్నారు.. రివ్యూ పిటిషన్‌ను మరో ఇద్దరు కొట్టేశారు

» తీర్పును చదివి ఉంటే అమిత్‌షా అలా మాట్లాడేవారు కాదు

» జస్టిస్ సుదర్శన్‌రెడ్డి



"దేశంలోని అత్యున్నత స్థాయి నాయకుల్లో ఏపీ సీఎం చంద్రబాబు ఒకరు.. దార్శనికత కలిగిన నేత ఆయన.. దేశ హితాన్ని దృష్టిలో పెట్టుకొని ఆయన సరైన నిర్ణయాన్ని తీసుకుంటారని నమ్ముతున్నా.. ఇదివరకు అనేక సందర్భాల్లో ఆయన ఇలాంటి నిర్ణయాలు తీసుకున్నారు. దేశ రాజకీయ రంగాన్ని ఎన్నో మలుపులు తిప్పారు."

న్యూఢిల్లీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో సల్వాజుడుం పేరిట ప్రజలే ప్రజల్ని చంపుకొనేలా చేయడం రాజ్యాంగ వ్యతిరేకమంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కేంద్ర హోంమంత్రి అమిత్ షా చదివి ఉంటే.. తనపై నక్సల్స్ మద్దతుదారు అన్న ఆరోపణలు చేసి ఉండేవారు కాదేమోనని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆ 40 పేజీల తీర్పు వ్యక్తిగతంగా తనది కాదని, సుప్రీంకోర్టుదని, తనతో పాటు బెంచ్‌లో మరో న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఎస్ నిజ్జార్ కూడా ఉన్నారని గుర్తుచేశారు. ఆ తీర్పును వ్యతిరేకిస్తూ దాఖలైన రివ్యూ పిటిషన్‌ను జస్టిస్ నాగరత్నమ్మ, జస్టిస్ సతీష్‌చంద్ర శర్మ కొట్టివేసారని.. దేశ అత్యున్నత న్యాయస్థానానికి చెందిన ఈ న్యాయమూర్తులందర్నీ నక్సలైట్లు అనే అంటారా అని సూటిగా ప్రశ్నించారు. వాస్తవానికి, సుప్రీంకోర్టు తీర్పుపై బయట చర్చించడం గౌరవం కాదని హితవు పలికారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలో విపక్ష కూటమి ఇండియా తరపున పోటీ చేస్తున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నక్సల్స్ మద్దతుదారు అని, అందుకనే సల్వాజుడుంను నిషేధించారని అమిత్‌షా తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై శనివారం జస్టిస్ సుదర్శన్‌రెడ్డి.. పీటీఐ, ఏఎన్ఐ, హిందుస్థాన్‌టైమ్స్, ఆజ్‌తక్ వంటి పలు మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పందించారు. గౌరవనీయ భారతదేశ హోంమంత్రిగా ఎలాంటి సైద్ధాంతిక వ్యత్యాసాలు చూపకుండా ప్రజల ప్రాణాలను, స్వేచ్ఛను, ఆస్తిని రక్షించే రాజ్యాంగ విధి, కర్తవ్యం అమిత్‌షాకు ఉందని, ఆయనతో నేరుగా వాగ్వాదానికి దిగాలని తాను అనుకోవటం లేదని జస్టిస్ సుదర్శన్ రెడ్డి చెప్పారు. చర్చలో హుందాతనం ఉండాలని, ఈ విషయాన్ని ఇక్కడితో వదిలేస్తున్నానన్నారు.

ఇది సైద్ధాంతిక పోరు

ఉపరాష్ట్రపతి పదవికి జరుగుతున్న పోటీ తనకు, ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు మధ్య జరుగుతున్న వ్యక్తిగత పోటీ కాదని, ఇది తాము ప్రాతినిధ్యం వహిస్తున్న రెండు భిన్న సిద్ధాంతాల మధ్య పోటీ అని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వివరించారు. రాధాకృష్ణన్ ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చారని, ఆ సిద్ధాంతాన్ని తాను ఆమోదించకపోవటమే కాదు.. దానికి చాలా చాలా దూరంగా ఉంటానని తెలిపారు. తాను ప్రధానంగా ఉదార భావాలున్న రాజ్యాంగ ప్రజాస్వామ్యవాదినన్నారు. పార్లమెంట్‌లో ప్రతిపక్షాల నిరసనపై అడిగిన ప్రశ్నకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సమాధానమిస్తూ.. విపక్షాలు సభను భగ్నం చేయడం కూడా నిరసనలో భాగమని, మాట్లాడటానికి అనుమతించనప్పుడు నిరసన తెలుపడమే మాట్లాడటమని అభివర్ణించారు. బీజేపీ ప్రతిపక్షంగా ఉన్న సమయంలో.. 'సభను ఆటంకపర్చటం కూడా రాజకీయ కార్యాచరణే. అది ఒక పార్లమెంటరీ సంప్రదాయం' అంటూ నాడు ఆ పార్టీ నేత అరుణ్‌జైట్లీ చేసిన వ్యాఖ్యను గుర్తుచేశారు. కులగణన అవసరాన్ని నొక్కిచెబుతూ.. సమాజంలో ఏయే వర్గాలకు ప్రభుత్వ చేయూత అవసరమో తెలుసుకునేందుకే అది అవసరమని పేర్కొన్నారు. 'రాజ్యాంగం కులం గురించి మాట్లాడదు. ఏ సమూహ ప్రజానీకాన్నైనా వెనుకబాటు వర్గంగా పేర్కొనాలంటే ఆ ప్రజల కులం, వారి సామాజిక ఆర్థిక స్థితిగతులు, అధికారంలో వారి భాగస్వామ్యం, సమాజంలో వారి గుర్తింపు తదితర అంశాలు తెలుసుకోవటం అవసరం. దీనికోసమే కులగణన చేపట్టాల్సి ఉంటుంది. ప్రస్తుతం కేంద్రప్రభుత్వం కూడా జనగణనలో దీనిని చేర్చుతామని ప్రకటించింది' అని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.

ప్రవేశిక సవరణకు జనసంఘ్ సమర్థన

సోషలిస్టు, సెక్యులర్ పదాలపై అలుముకున్న చర్చను ఉద్దేశించి మాట్లాడుతూ.. రాజ్యాంగంలో తొలి నుంచీ ఇవి లేకున్నా, రాజ్యాంగంలో అవి అంతర్భాగమేనన్నారు. ఎమర్జెన్సీ సమయంలో వాటిని రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశికలో చేర్చినప్పటికీ, ఆ తర్వాత జనసంఘ్ (బీజేపీ పూర్వరూపం)తో కూడిన జనతా పార్టీ ప్రభుత్వం వచ్చినప్పుడు.. ఆ సవరణను ఏకగ్రీవంగా ఆమోదించిందని తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్యం తీరుతెన్నులపై స్పందిస్తూ.. గతంలో ఆర్థిక వ్యవస్థకు సంబంధించి 'ద్రవ్యలోటు' అనే పదాన్ని ఉపయోగించేవారని, ఇప్పుడు 'ప్రజాస్వామ్య లోటు' గురించి మాట్లాడాల్సి వస్తోందని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.దేశం నేటికీ రాజ్యాంగ ప్రజాస్వామ్యంగా కొనసాగుతున్నప్పటికీ.. ప్రజాస్వామ్యం ఒత్తిడిలో ఉండటం మాత్రం వాస్తవమన్నారు. దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందా అన్న చర్చ మంచిదేనని, దాంట్లో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఏ పార్టీతో నాకు సంబంధం లేదు

తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని, చంద్రబాబు, కేసీఆర్‌తోసహా అన్ని రాజకీయ పార్టీలనూ, నేతలనూ తనకు ఓటు వేయాల్సిందిగా అభ్యర్థిస్తున్నానని తెలిపారు. తెలుగు ఆత్మగౌరవం పేరుతో ఓటు వేయమని తాను మాట్లాడలేదని, తెలుగుదేశం ఆ ప్రాతిపదికగా అధికారంలోకి వచ్చిందని చెప్పారు. తాను ఒక భారతీయ పౌరుడిగా అందర్నీ ఓట్లు అడుగుతున్నానని చెప్పారు. ఇండియా కూటమి తనను ఏకగ్రీవంగా ఎంపిక చేయటంపై స్పందిస్తూ.. దేశ ప్రజానీకంలో 63-64 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీలు తనకు మద్దతునివ్వటం తనకు గర్వకారణమన్నారు. కాగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఆదివారం తమిళనాడు వెళ్లి డీఎంకే అధినేత, ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకోనున్నారు. డీఎంకే ఎంపీలతో ఆయన భేటీ అవుతారు.

బెట్టింగ్ కేసులో కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర అరెస్ట్

బెంగళూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్ కేసులో కర్ణాటకలోని చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే కేసీ వీరేంద్ర పప్పీని మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. క్యాసినో లీజు వ్యవహారంపై మాట్లాడేందుకు తన అనుచరులతో కలసి సిక్కిం రాజధాని గ్యాంగ్‌టక్‌కు వెళ్లిన ఆయనను శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్టు ఈడీ అధికారులు వెల్లడించారు. పలు రాష్ట్రాల్లో దాడులు చేసి విదేశీ కరెన్సీ సహా 12 కోట్ల రూపాయల నగదు, రూ.6 కోట్ల విలువైన బంగారం, 10 కిలోల వెండితో పాటు నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. గ్యాంగ్‌టక్‌లో స్థానిక మేజిస్ట్రేట్ ముందు ఆయన్ను హాజరుపరిచి, ట్రాన్సిట్ రిమాండ్‌తో కర్ణాటకకు తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. చిత్రదుర్గ జిల్లా చెళ్లకెరెలోని వీరేంద్రతో పాటు ఆయన సోదరులు కేసీ తిప్పేస్వామి, కేసీ నాగరాజ్ నివాసాలపైనా ఈడీ దాడులు చేశారు. బెంగళూరు, హుబ్బళ్లి, జోధ్‌పూర్ (రాజస్థాన్), ముంబై, సిక్కిం, గోవాలోని ఐదు క్యాసినోలతో కలిపి 31 చోట్ల దాడులు జరిగాయి. ఈడీ దాడులు, ఎమ్మెల్యే అరెస్టు గురించి సీఎం సహా కాంగ్రెస్ నాయకులు ఎవరూ స్పందించలేదు.

రూ.2929 కోట్ల మోసం కేసు.. అనిల్ అంబానీ ఇంట్లో సీబీఐ సోదాలు

న్యూఢిల్లీ/ముంబై, ఆగస్టు 23: రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌కామ్) డైరెక్టర్ అనిల్ అంబానీ ఇంట్లో సీబీఐ సోదాలు జరిపింది. ఎస్బీఐని రూ.2929.05 కోట్ల మేర మోసగించిన కేసులో భాగంగా ముంబైలోని ఆయన నివాసంలో శనివారం సోదాలు చేసినట్లు అధికారులు తెలిపారు. ముంబైలోని ఆర్‌కామ్ కార్యాలయంతో పాటు అనిల్ నివాసంలో తనిఖీలు చేసినట్లు ఓ ప్రకటనలో వెల్లడించారు. ఎస్బీఐ ఫిర్యాదు మేరకు ఆర్‌కామ్, సంస్థ డైరెక్టర్ అనిల్ అంబానీ, గుర్తుతెలియని ప్రభుత్వ అధికారులపై సీబీఐ గురువారం ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సంగతి తెలిసిందే. నేరపూరిత కుట్ర, మోసం తదితర ఆరోపణలపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే సోదాలు నిర్వహించినట్లు సీబీఐ అధికార ప్రతినిధి తెలిపారు. నిందితులు కుట్రపూరితంగా తప్పుడు ప్రతిపాదనలతో ఆర్‌కామ్‌కు రుణాలను మంజూరు చేయించుకున్నారన్నారు. ఎస్బీఐ ఫిర్యాదు మేరకు 2018 లెక్కల ప్రకారం.. ఆర్‌కామ్ వేర్వేరు బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు రూ.40 వేల కోట్లకు పైగా బకాయిలు ఉంది. ఈ సంస్థ వల్ల ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన ఎస్బీఐ ఒక్కదానికే రూ.2929.05 కోట్ల నష్టం వాటిల్లింది.

భారత్‌లో అమెరికా నూతన రాయబారిగా సెర్జియో గోర్

» ట్రంప్‌నకు అత్యంత నమ్మకస్తుడు



వాషింగ్టన్, ఆగస్టు 23: అమెరికా అధ్యక్షుడి పాలనా కేంద్రం శ్వేత సౌధం సిబ్బంది వ్యవహారాల డైరెక్టర్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు అత్యంత నమ్మకస్తుడు అయిన సెర్జియో గోర్ భారత్‌లో అమెరికా నూతన రాయబారిగా నియమితులయ్యారు. అమెరికా భారత వస్తువులపై అధిక సుంకాలు విధించినప్పటి నుంచి రెండు దేశాల మధ్య విభేదాలు నెలకొన్న తరుణంలో ఈ నిర్ణయం వెలువడడం గమనార్హం. కీలకమైన ఈ పదవికి గోర్(38) నియామకాన్ని ప్రకటిస్తూ అధ్యక్షుడు ట్రంప్.. గోర్ దక్షిణ, మధ్య ఆసియా వ్యవహారాల ప్రత్యేక రాయబారిగానూ వ్యవహరిస్తారని ప్రకటించారు. "ప్రపంచంలోనే అత్యధిక జన సాంద్రత గల ప్రాంతంలో నా ఎజెండా అమలుకు అత్యంత నమ్మకస్తుడైన వ్యక్తి అవసరం. అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా తీర్చిదిద్దడంలోనూ గోర్ సహకరించాల్సి ఉంది" అని ట్రంప్ అన్నారు. 2024లో ట్రంప్ ఎన్నికల ప్రచారం సందర్భంగా గోర్ ఆయన రాజకీయ కార్యాచరణ కమిటీలో కీలక పాత్ర పోషించారు.

మా చమురు కొనకపోతే పోండి

మేం ఎవరినీ ఒత్తిడి చేయడం లేదు.. మా రైతులు, వ్యాపారులే మాకు ముఖ్యం

» అమెరికా, యూరప్ బయ్యర్లకు తేల్చిచెప్పిన విదేశాంగ మంత్రి జైశంకర్

» రష్యా చమురు అంశంపై స్పష్టత



గురువారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అయిన జైశంకర్(ఫైల్)

న్యూఢిల్లీ, ఆగస్టు 23 : "మీకు నచ్చకపోతే మా దగ్గర చమురు తీసుకోకండి" అంటూ అమెరికా, యూరప్ చమురు బయ్యర్లకు విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ తేల్చిచెప్పారు. రష్యానుంచి చమురు కొంటున్నదన్న కారణంగా భారత ఉత్పత్తులపై ట్రంప్ 50% సుంకం విధించిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తమకు రైతులు, చిన్న వ్యాపారుల ప్రయోజనాలే ముఖ్యమని జైశంకర్ స్పష్టం చేశారు. శనివారమిక్కడ జరిగిన ఎకనామిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరమ్ - 2025 సదస్సులో జైశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రష్యా చమురు కేంద్రంగా అమెరికా, ఇతర దేశాలు చేస్తున్న విమర్శలకు ఆయన గట్టిగా సమాధానమిచ్చారు. "శుద్ధిచేసిన చమురు లేక పెట్రో ఉత్పత్తులను మా వద్దే తీసుకోవాలని ఎవరినీ మేం బలవంతం పెట్టడం లేదు. అమెరికా యంత్రాంగం వ్యాపారం చేయడాన్ని సమర్థించే కొంతమంది ఇతరులను మాత్రం వ్యాపారం చేయొద్దని అనడం హాస్యాస్పదం. ఇందులో ఒత్తిడి ఏమీ లేదు. నచ్చకపోతే మా ఉత్పత్తులు కొనొద్దు" అన్నారు. భారత్ కంటే చైనానే రష్యా చమురును అధికంగా తీసుకుంటున్నా, ఆ దేశంపై ప్రతీకార సుంకాలు వేయరని, ఇంతకుమించి వివక్ష, అన్యాయం ఉంటాయా అని ప్రశ్నించారు. పాకిస్థాన్- అమెరికా సంబంధాలు ఇటీవల పెరగడంపై జైశంకర్ స్పందిస్తూ.. అల్‌కాయిదా ఉగ్రవాది ఒసామా బిన్ లాడెన్‌ను పాకిస్థాన్‌లో అమెరికా అంతం చేసిన విషయం గుర్తుచేశారు. "అమెరికా.. పాక్.. లాడెన్" అంటూ వ్యాఖ్యానించారు. ఆగస్టులో భారత్‌కు రావాల్సిన అమెరికా ప్రభుత్వ బృందం పర్యటన రద్దు కావడంపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. వాషింగ్టన్, న్యూఢిల్లీల మధ్య వాణిజ్య సంప్రదింపులు కొనసాగుతున్నాయని తెలిపారు. దేశ ప్రజల ప్రయోజనాల రీత్యా కొన్ని పరిమితులు తమకు తాము విధించుకున్నామని, దీని అర్థం కటీఫ్ (తెగదెంపులు) చెప్పినట్టు కాదని జైశంకర్ సరదాగా వ్యాఖ్యానించారు.

అమెరికాకు తపాలా పార్సిళ్లు బంద్

సుంకాల నిబంధనల్లో అమెరికా మార్పులు తెచ్చిన నేపథ్యంలో తపాలా శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇక్కడ నుంచి అమెరికాకు పంపే పార్సిళ్లను అనుమతించరాదని నిర్ణయం తీసుకుంది. అయితే, ఉత్తరాలు, పత్రాలు, బహుమతులను మాత్రం ఎప్పటిలాగానే అమెరికాకు పంపవచ్చునని పేర్కొంది. అయితే, వాటి విలువ వంద డాలర్ల లోపు ఉండాలని స్పష్టంచేసింది. 800 అమెరికా డాలర్ల కంటే తక్కువ విలువ ఉండే పార్సిళ్లు, ఇతర కవర్లపై గతంలో అమెరికాలో సుంకం లేదు. కొత్త డ్యూటీ నిబంధనల ప్రకారం.. విలువతో సంబంధం లేకుండా అన్నిరకాల సర్వీసులను సుంకాల పరిధిలోకి తెచ్చారు.

ధర్మస్థలపై తొలగిన ముసుగు!

» శవాల ఖననంపై తను చెప్పినవన్నీ అబద్ధాలేనన్న మాజీ కార్మికుడు

» 10 రోజుల సిట్ కస్టడీ చన్నయ్య





తవ్వకాల సమయంలో ముసుగులో మాజీ పారిశుధ్య కార్మికుడు చన్నయ్య (ఫైల్)

బెంగళూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ధర్మస్థల వివాదంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కర్ణాటకలోని ఆ ప్రసిద్ధ ఆలయ పరిసరాల్లో వందలాది మృతదేహాలను పాతిపెట్టానంటూ ఫిర్యాదు చేసి, దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మాజీ పారిశుధ్య కార్మికుడు చన్నయ్యను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు అరెస్టు చేశారు. తాను చెప్పినవన్నీ అబద్ధాలేనని, తనపై కొంత మంది ఒత్తిడి చేసి ఆ విధంగా చెప్పించారని, అసలు అలాంటిదేమీ లేదని ఒప్పుకోవడంతో.. ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం శనివారం బెళ్తంగడి కోర్టులో ప్రవేశపెట్టగా.. తదుపరి దర్యాప్తు కోసం చన్నయ్యను న్యాయాధికారి 10 రోజుల పాటు సిట్ కస్టడీకి అప్పగించారు. కుట్రకు స్పష్టమైన ఆధారాలు లభించడంతో సిట్ అధికారులు చన్నయ్య మాస్క్‌ను శనివారం తొలగించి, అరెస్టు చేసినట్లు ప్రకటించారు. చన్నయ్య చూపిన 17 ప్రదేశాల్లో సిట్ అధికారులు మృతదేహాల ఆనవాళ్ల కోసం 20 రోజులకు పైగా తవ్వకాలు చేపట్టిన విషయం తెలిసిందే. అయినా ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఈ నేపథ్యంలో తవ్వకాలను గతవారం నిలిపివేసిన అధికారులు.. ఆయన్ను విచారించడం ప్రారంభించారు. తాను తమిళనాడులో నివసిస్తుండగా, ఏడాదిన్నర క్రితం అదే ప్రాంతానికి చెందిన కొంత మంది తనను సంప్రదించినట్లు చన్నయ్య సిట్ విచారణలో చెప్పారు. ధర్మస్థలలో మృతదేహాలను పాతిపెట్టినట్లు ప్రచారం చేయమన్నారని, అలాంటి ఘటనలు ధర్మస్థలలో జరగలేదని తెలిపినా.. వారు వదిలిపెట్టలేదని పేర్కొన్నట్లు తెలిసింది. 'నెలల తరబడి తనను వెంబడించి ఒత్తిడి చేసి ఒప్పించారు. ఓ పుర్రెను తీసుకొచ్చి ఇచ్చారు. వారి సలహాలకు అనుగుణంగానే ఫిర్యాదు చేశాను' అని చన్నయ్య సిట్ అధికారులకు వివరించాడు.

అనన్య నా కూతురు కాదు: సుజాత

మరోవైపు ధర్మస్థల వివాదంలో సుజాత భట్ 'ముసుగు' కూడా తొలగింది. అనన్య భట్ తన కూతురు కాదని ఆమె ఒప్పుకున్నారు. 'నా కూతురు మంగళూరు కస్తూర్బా మెడికల్ కళాశాలలో చదువుతుండేది. స్నేహితులతోపాటు ధర్మస్థలకు వెళ్లి మాయమైంది' అంటూ సుజాత గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే సుజాత భట్‌కు అసలు పిల్లలే లేరని వారం క్రితమే ఆమె బంధువులు స్పష్టం చేశారు. ఆమె చూపిన ఫొటో అనన్య భట్‌ది కాదన్నారు.

ఇంటెల్‌లో అమెరికాకు 10% వాటా

వాషింగ్టన్: అమెరికాకు చెందిన అంతర్జాతీయ సెమీకండక్టర్ల (చిప్) తయారీ దిగ్గజం ఇంటెల్ కార్ప్‌లో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం 10% వాటా చేజిక్కించుకుంది. ఇంటెల్‌కు గతంలో ప్రకటించిన గ్రాంట్లను ఈక్విటీ వాటాగా మార్చుకుంది. యూఎస్ చిప్స్ అండ్ సైన్స్ చట్టంలో భాగంగా 570 కోట్ల డాలర్లు, భద్రమైన చిప్‌ల తయారీ కోసం ఏర్పాటు చేసిన సెక్యూర్ ఎన్‌క్లేవ్ ప్రోగ్రామ్‌లో భాగంగా 320 కోట్ల డాలర్లు కలిపి మొత్తం 890 కోట్ల డాలర్ల (రూ.77,875 కోట్లు)ను అమెరికా ప్రభుత్వం ఇంటెల్‌కు మంజూరు చేసింది. ఇంకా విడుదల చేయాల్సి ఉన్న ఈ నిధులకు బదులుగా కంపెనీలోని 9.9 శాతం వాటాకు సమానమైన 43.33 కోట్ల షేర్లను ఒక్కొక్కటి 20.47 డాలర్ల చొప్పున కేటాయించినట్లు ఇంటెల్ వెల్లడించింది. అయితే, కంపెనీలో ప్రభుత్వానికి బోర్డు సభ్యత్వం లేదా నియంత్రణ హక్కులు లభించవని ఇంటెల్ స్పష్టం చేసింది. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి యూఎస్ కార్పొరేట్ రంగంపై నియంత్రణ కోసం గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే ఇంటెల్‌లో వాటాను దక్కించుకున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.